## చైనాతో ట్రేడ్ డీల్.. కెనడాపై 100% సుంకాలు విధిస్తా - ట్రంప్



కెనడా ప్రధాని మార్క్ కార్నీపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్

» 2లో

# సిటీటైమ్స్
తెలుగు దినపత్రిక

## విదేశాల్లో భారత్ 'వాంటెడ్' రెండేళ్లలో 70 మంది గుర్తింపు!

» 2లో

వివిధ కేసుల్లో నిందితులుగా ఉండి, పరారీలో ఉన్న మన దేశానికి చెందిన వారిని గుర్తించే ప్రక్రియ ముమ్మరంగా కొనసాగు-తోందని కేంద్ర ప్రభుత్వ నివేదిక వెల్లడించింది.




హైదరాబాద్ (తేదీ) 25-01-2026 (వారం) ఆదివారం |సంపుటి: 25 |సంచిక:23 | |పేజీలు 10 |వెల రూ.3 |

Epaper Hyderabad | Adilabad | Rangareddy | Nalgonda | Medak | Mahaboobnagar | Karimnagar | Warangal | Khammam | Nizamabad citytimesdaily.com


## నాంపల్లి ఫర్నిచర్ దుకాణంలో
# భారీ అగ్నిప్రమాదం



- » సెల్లార్లో చిక్కుకున్న ఐదుగురు!
- » పొగతీవ్రతతో సహాయక చర్యలకు ఆటంకం
- » బచాస్ ఫర్నీచర్ క్యాసిల్‌లో ప్రమాదవశాత్తూ మంటలు
- » 10 ఫైర్ ఇంజన్ల సాయంతో మంటలు ఆర్పిన అగినమాపక సిబ్బంది

**హైదరాబాద్, అబిడ్స్, సిటీటైమ్స్ :**
హైదరాబాద్ నాంపల్లి స్టేషన్ రోడ్డులోని ఓ ఫర్నిచర్ దుకాణంలో శనివారం మధ్యాహ్నం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. క్షణాల్లో భవనమంతా మంటలు వ్యాపించడంతో బయటకు రాలేక ఐదుగురు లోపలే చిక్కుకున్నారు. దట్టమైన పొగలు వ్యాపించటంతో సహాయక చర్యలకు ఆటంకంగా మారింది. ప్రమాదంపై పూర్తిస్థాయి నివేదిక ఇవ్వాలని మంత్రి పొంగులేటి అధికారులను ఆదేశించారు. నాంపల్లి స్టేషన్‌రోడ్‌లోని హిందీ ప్రచార్‌సభ భవనం పక్కన సాయి విశ్వాస్ ఛాంబర్స్ ఐదంతస్తుల భవనంలో బచ్చాస్ ఫర్నిచర్ దుకాణం ఉంది. శుక్రవారం రాత్రి కంటైనర్‌లో చైనా నుంచి భారీగా ఫర్నిచర్ వచ్చింది. దాన్ని రెండు సెల్లార్లలో భద్రపరిచారు. దుకాణంలో సుమారు 22 మంది పనిచేస్తున్నారు. అక్కడ వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న యాదయ్య, లక్ష్మి దంపతులు.. తమ ఇద్దరు పిల్లలు ప్రణీత్(11), అఖిల్(7)లతో కలసి సెల్లార్‌లో నివాసం ఉంటున్నారు. శనివారం పిల్లలిద్దరూ పాఠశాలకు వెళ్లకుండా ఇంట్లోనే ఉండిపోయారు. పిల్లల్ని సెల్లార్‌లోనే ఆడుకోవాలని చెప్పి తల్లిదండ్రులు పనిమీద బయటకు వెళ్లారు.

తరువాయి 2లో




# స్టార్టప్‌ల స్థలం
# ప్రభుత్వ కార్యాలయాలా?
## టీ హబ్'పై నిర్ణయానికి సర్కారు బ్రేక్

- » యువ వ్యాపార వాతావరణం దెబ్బతింటుందన్న అభ్యంతరాలతో వెనక్కి తగ్గిన ప్రభుత్వం
- » కార్యాలయాల తరలింపు ప్రతిపాదన రద్దు...
- » 'టీ హబ్' స్టార్టప్‌లకే అంకితం
- » సీఎం స్థాయిలో సమీక్ష--- ప్రజా స్పందనకు గౌరవం

**హైదరాబాద్, జనవరి 24 (సిటీటైమ్స్):**
తెలంగాణ స్టార్టప్ వ్యవస్థకు ప్రతీకగా నిలిచిన 'టీ హబ్'లో ప్రభుత్వ కార్యాలయాలను ఏర్పాటు చేయాలన్న నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా రద్దు చేసింది. యువ వ్యాపారాలు, ఆవిష్కరణలకు కేటాయించిన ప్రాంగణంలో సర్కారు శాఖలు వస్తే స్వేచ్ఛాయుత వాతావరణం దెబ్బతింటుందన్న తీవ్ర అభ్యంతరాలు వెల్లువెత్తడంతో, ఈ అంశాన్ని సీఎం కార్యాలయం స్థాయిలో పునఃపరిశీలించి వెనక్కి తగ్గినట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి. 'టీ హబ్' అనేది ఫైళ్లకు కాదు--- ఆలోచనలకు, కొత్త వ్యాపారాలకు, యువత కలలకు వేదిక అన్నది తెలంగాణ ప్రత్యేకతగా ప్రభుత్వం గుర్తించింది. ఇక్కడ ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటైతే భద్రతా పరిమితులు, ప్రవేశ ఆంక్షలు, అధికార వ్యవస్థ పెరిగి స్టార్టప్‌ల చురుకుదనం తగ్గిపోతుందన్న వాదన బలంగా వినిపించింది. ఈ అంశాన్ని స్టార్టప్ ప్రతినిధులు, పెట్టుబడిదారులు నేరుగా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లారు. ఈ అభిప్రాయాలపై సమీక్షించిన ప్రభుత్వం, 'టీ హబ్'కు సంబంధించిన పాత ప్రతిపాదనలను పూర్తిగా పక్కన పెట్టింది. ఇకపై 'టీ హబ్' భవనాలు పూర్తిగా స్టార్టప్‌లు, పరిశోధన, నూతన ఆవిష్కరణలకే అంకితంగా కొనసాగుతాయని స్పష్టం చేసింది. ప్రభుత్వ కార్యాలయాల అవసరాలకు ఇతర ప్రత్యామ్నాయ స్థలాలను పరిశీలిస్తామని ఉన్నతాధికారులు తెలిపారు.

తరువాయి 2లో

## సీపీ సజ్జనార్ నోటీసులకు సమాధానం ఇస్తా ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

**హైదరాబాద్, సిటీటైమ్స్ :**
నగర పోలీస్ కమిషన్ సజ్జనార్ ఇచ్చిన నోటీసులకు సమాధానంగా తన వద్ద ఉన్న సమాచారంతో జవాబు ఇస్తానని, ఆ తరువాత ఇష్టం వచ్చినట్లు చేసుకోవచ్చని భారత రాష్ట్ర సమితి ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. సజ్జనార్ నోటీసుల నేపథ్యంలో ఎక్స్ వేదికగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. తాను వ్యక్తిగత దూషణలు చేయనని, చిల్లర భాష వాడనని, వాస్తవాలు దాచనని, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పోరాటం ఆపబోనని పేర్కొన్నారు.





తరువాయి 2లో

## నాంపల్లిలో ట్రాఫిక్ ఆంక్షలు.. నుమాయిష్ సందర్శకులకు కీలక సూచన



2లో

## మహిళా కానిస్టేబుల్‌ను కారుతో ఢీకొట్టి.. గంజాయి గ్యాంగ్ హల్‌చల్



2లో




# టెండర్లపై విచారణకు సిద్ధం

- » సైట్ విజిట్ నిబంధన భారాస ప్రభుత్వ హయాంలోనే వచ్చింది
- » సృజన్‌రెడ్డి భారాస మాజీ ఎమ్మెల్యే ఉపేందర్‌రెడ్డికి అల్లుడు
- » ఆయనకు సీఎం రేవంత్‌రెడ్డితో ఏం సంబంధం?
- » ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క
- » హరీశ్‌రావు లేఖ రాస్తే 2014 నుంచి ఇప్పటిదాకా సింగరేణి కాంట్రాక్టులపై సిట్ దర్యాప్తు చేయిస్తా

**సిటీటైమ్స్, హైదరాబాద్ :**
తెలంగాణ ఏర్పడిన 2014 సంవత్సరం నుంచి ఇప్పటి వరకు సింగరేణి సంస్థలో టెండర్ల కేటాయింపులన్నింటిపై విచారణ చేయించడానికి సిద్ధంగా ఉన్నామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రకటించారు. హరీశ్‌రావు తనకు లేఖ రాస్తే అవసరమైతే సిట్ వేసి విచారణ చేయిస్తానని స్పష్టం చేశారు. 'సింగరేణి టెండర్ల కేటాయింపుల్లో సైట్ విజిట్ సర్టిఫికెట్ దాఖలు చేయాలనే నిబంధన పెట్టి కాంగ్రెస్ వాళ్లు దోచుకు తిన్నారని హరీశ్‌రావు అంటున్నారు. ఈ నిబంధన 2018 నుంచి ఉంది. భారాస ప్రభుత్వ హయాంలోనే వచ్చింది' అని చెప్పారు. కాంగ్రెస్ పాలనలో సింగరేణిలో 5 టెండర్లు కేటాయించగా వాటిలో 4 భారాస నాయకుల కంపెనీలకే వచ్చినట్లు ప్రకటించారు. మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి శనివారం ప్రజాభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. "సింగరేణి టెండర్లపై విచారణ చేయాలని హరీశ్‌రావు కేంద్రానికి లేఖ రాయడం ఎందుకు? 2014 నుంచి నేటి వరకు అన్నింటిపై విచారణ చేయాలని నాకు లేఖ రాస్తే సరిపోతుంది. అలా రాస్తే సీఎం రేవంత్‌రెడ్డి దావోస్ పర్యటన నుంచి రాగానే నేను వెళ్లి చెప్పి విచారణ చేయించేందుకు ఒప్పిస్తా. తెలంగాణ వచ్చాక గనులలో మట్టి(ఓవర్ బర్డెన్ ఓబీ) తొలగింపు పనుల టెండర్లను సింగరేణి భారాస పాలనలో 20, కాంగ్రెస్ పాలనలో 5 కేటాయించింది.

తరువాయి 2లో

## కేసీఆర్, కేటీఆర్ నా ఛాలెంజ్‌కు సిద్ధమా?
» .. కేంద్రమంత్రి బండి సంజయ్



**హైదరాబాద్, సిటీటైమ్స్ :**
కేటీఆర్, హరీశ్‌రావు సహా అందరినీ సాక్షులుగా పిలిస్తే... అసలు ఫోన్ ట్యాపింగ్ దోషులెవరని కేంద్రమంత్రి బండి సంజయ్ ప్రశ్నించారు. ఫోన్ ట్యాపింగ్ దొంగలను సాక్షులుగా పిలవడమేంటన్నారు. సిట్ విచారణను ప్రత్యక్షంగా, పరోక్షంగా మంత్రులు ప్రభావితం చేసినట్లేనని.. ఇప్పటికైనా సిట్‌కు స్వేచ్ఛ ఇవ్వాలన్నారు. ప్రభుత్వ ఒత్తిడికి లొంగితే సిట్ అధికారులకు ఉన్న క్రెడిబిలిటీ పోతుందన్నారు. కేటీఆర్‌లో ఇంకా అహంకారం తగ్గలేదని, ఫోన్ ట్యాపింగ్ చేయలేదని చెబుతున్న కేసీఆర్, కేటీఆర్ నా ఛాలెంజ్ కు సిద్ధమా? అని సవాల్ విసిరారు. దేవుడి ఆలయం వద్ద కుటుంబ సభ్యులతో కలిసి ప్రమాణం చేసే ధైర్యం ఉందా అని ప్రశ్నించారు. మావోయిస్టుల జాబితాలో హీరోయిన్లు, వ్యాపారులతోపాటు బీఆర్ఎస్ ఎంపీలు, ఎమ్మెల్యేల ఫోన్ నెంబర్లను చేర్చింది నిజం కాదా? అన్నారు. ఆఖరికి కేసీఆర్ బిడ్డ, అల్లుడి ఫోన్లను కూడా ఆ జాబితాలో చేర్చి ఫోన్ ట్యాపింగ్ చేయించలేదా?అని నిలదీశారు. హైదరాబాద్ నాంపల్లిలోని భాజపా రాష్ట్ర కార్యాలయంలో మీడియా ప్రతినిధులతో బండి సంజయ్ ఇష్టాగోష్టిగా మాట్లాడారు.

తరువాయి 2లో

# ధరణిని అడ్డుపెట్టుకుని భూముల్ని కాజేశారు

- » ఫోరెన్సిక్ ఆడిట్‌లో సిరిసిల్ల, సిద్దిపేట జిల్లాల్లో అక్రమాల గుర్తింపు
- » చలానా సొమ్ము దారిమళ్లింపు వ్యవహారంలో 48 మందిపై క్రిమినల్ కేసులు
- » రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి



**సిటీటైమ్స్, హైదరాబాద్ :**
ధరణి పోర్టల్‌ని అడ్డుపెట్టుకుని గత ప్రభుత్వంలోని పెద్దలు ప్రభుత్వ భూములను కాజేశారని, పోర్టల్లోని లొసుగులను ఆసరాగా చేసుకుని రిజిస్ట్రేషన్ల చలానా సొమ్మును కాజేశారని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఆరోపించారు. అందరి బాగోతాలనూ బయటపెడతామని, ఎవరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదని స్పష్టంచేశారు. సిద్దిపేట, సిరిసిల్ల జిల్లాల్లో కేంద్ర ప్రభుత్వ అనుబంధ సంస్థతో పైలట్ ప్రాజెక్టు కింద ఫోరెన్సిక్ ఆడిట్ చేయించగా... ఈ జిల్లాల్లో అనేక అవినీతి, అక్రమాలు జరిగినట్లు ప్రాథమిక నివేదిక ద్వారా గుర్తించామని తెలిపారు. ఈ నివేదిక పరిశీలన పూర్తయిన తర్వాత మిగిలిన 31 జిల్లాల్లోనూ ఆడిట్ నిర్వహిస్తామని పేర్కొన్నారు. సాగు భూముల రిజిస్ట్రేషన్ పోర్టల్‌లో ఛార్జీల దారిమళ్లింపుపై ఏర్పాటు చేసిన హైలెవల్ కమిటీ సభ్యులతో శనివారం రాష్ట్ర సచివాలయంలో మంత్రి సమావేశం నిర్వహించారు. ఇంటెలిజెన్స్ అదనపు డీజీ విజయ్‌కుమార్, కమిటీ సభ్యులు అనిశా ఎస్పీ సింధు శర్మ, సీఎమ్మార్వో ప్రాజెక్టు డైరెక్టర్ మంద మకరందు, రిజిస్ట్రేషన్ల డీఐజీ ఎం.సుభాషిణి, సైబర్ క్రైమ్ డీఎస్పీ ఎ.సంపత్, ఎన్ఐసీ ప్రతినిధి శ్రీనివాస్, హోంశాఖ సలహాదారు పి.శరత్‌కుమార్‌తో ఆయన చర్చించారు. రెవెన్యూశాఖ కార్యదర్శి లోకేశ్‌కుమార్, రిజిస్ట్రేషన్ల శాఖ ఇన్‌స్పెక్టర్ జనరల్ రాజీవ్‌గాంధీ హనుమంతు పాల్గొన్నారు.

తరువాయి 2లో

## మేడారంలో 'చిల్డ్రన్ ట్రాకింగ్ అండ్ మానిటరింగ్ సిస్టం'

- » మేడారంలో పిల్లలు తప్పిపోతే ఇట్టే కనిపెట్టొచ్చు
- » జాతరలో 11 పాయింట్ల వద్ద చిన్నారుల వివరాలు నమోదు
- » తప్పిపోతే రిస్ట్‌బ్యాండ్ స్కాన్ చేసి కన్నవారి చెంతకు చేర్చనున్న వలంటీర్లు



**హైదరాబాద్, జనవరి 24 (సిటీటైమ్స్):**
మేడారం మహా జాతర.. ఆ రద్దీలో పిల్లలు తప్పిపోతే? తల్లిదండ్రుల ఫోన్ నంబర్లు, వివరాలు చెప్పే పరిణతి కూడా చిన్నారులకు లేకపోతే? ఆచూకీ రాబట్టడం ఎంత కష్టం? తల్లిదండ్రులకు ఈ టెన్షన్లేవీ లేకుండా జాతరలో పిల్లల భద్రత కోసం 'చిల్డ్రన్ ట్రాకింగ్ అండ్ మానిటరింగ్ సిస్టం (సీటీఎంఎస్)'ను అధికారులు అందుబాటులోకి తెచ్చారు.

తరువాయి 2లో

# నాంపల్లి ఫర్నిచర్ దుకాణంలో.. భారీ అగ్నిప్రమాదం

మొదటి పేజి తరువాయి

మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో భవనంలోని రెండు సెల్లార్లలో అగ్నిప్రమాదం సంభవించింది. పొగలు రావడం గమనించి సిబ్బంది బయటకు పరుగులు తీశారు. దుకాణంలో పనిచేస్తున్న సుభాన్‌పుర నివాసి మహ్మద్ ఇంతియాజ్(27), శాస్త్రిపురం ప్రాంతానికి చెందిన సయ్యద్ హబీబ్(40)లు.. సెల్లార్లో చిక్కుకున్న ప్రణీత్, అఖిల్, బీబీ(55) అనే వృద్ధురాలిని బయటకు తీసుకువచ్చేందుకు లోపలికి వెళ్లి.. తిరిగి రాలేదు. సెల్లార్‌లో మొత్తం ఆరుగురు ఉన్నారని అక్కడ పనిచేసే సిబ్బంది చెబుతున్నారు. మధ్యాహ్నం 1.15 గంటలకు యజమాని సతీష్ అగ్నిమాపకకేంద్రం, పోలీసు అధికారులకు సమాచారమిచ్చారు. 1.30 గంటలకు అగ్నిమాపకశాఖ సిబ్బంది రంగంలోకి దిగి.. దాదాపు గంటన్నర పాటు శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చారు. భవనంలో చిక్కుకున్నవారిని గుర్తించేందుకు రెండు రోబో ఫైటర్లను పంపారు. పొగ దట్టంగా వ్యాపించడంతో సహాయక చర్యలకు ఆటంకంగా మారింది. భవనం లోపల, పైభాగంలో ఎవరూ చిక్కుకోలేదని నిర్ధారించారు. సెల్లార్‌లోకి వెళ్లేందుకు అక్కడ నిల్వచేసిన ఫర్నిచర్ అడ్డంకిగా మారింది. నగర సీపీ సజ్జనార్, హైదరాబాద్ కలెక్టర్ హరిచందన, ఖైరతాబాద్ డీసీపీ శిల్పవల్లి సహాయక చర్యలను పర్యవేక్షించారు. సమాచారం అందగానే అగ్నిమాపక, ఎన్డీఆర్ఎఫ్, పోలీసు సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకున్నట్లు సీపీ వివరించారు. మంటలు అదుపులోకి వచ్చినా పొగ తీవ్రత ఎక్కువగా ఉండటంతో సహాయక బృందాలు లోపలకు వెళ్లలేకపోతున్నాయని చెప్పారు. భవనం లోపల నలుగురు చిక్కుకున్నట్లు భావిస్తున్నామన్నారు. ఇది పెద్ద ప్రమాదమని, అతికష్టం మీద మంటలను అదుపులోకి తెచ్చామని అగ్నిమాపకశాఖ డీజీ విక్రమ్‌సింగ్‌మాన్ అన్నారు. నిబంధనలకు విరుద్ధంగా సెల్లార్లలో ఫర్నిచర్ నిల్వ చేశారన్నారు

--వేగంగా చర్యలు చేపట్టాలి: పొంగులేటి

ఫర్నిచర్ దుకాణంలో సంభవించిన అగ్ని ప్రమాదంపై పూర్తిస్థాయి నివేదిక ఇవ్వాలని విపత్తుల నిర్వహణ శాఖ ముఖ్య కార్యదర్శి అర్విండ్ కుమార్‌ను రెవెన్యూ, విపత్తుల నిర్వహణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. ప్రమాదంపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధితులను వెంటనే ఆదుకోవాలన్నారు. హైదరాబాద్ జిల్లా కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీశారు. పోలీస్, అగ్నిమాపక అధికారుల సమన్వయంతో సహాయక చర్యలు వేగంగా చేపట్టాలని ఆదేశించారు.

**అంబులెన్స్‌లు సిద్ధంగా..**

నాంపల్లి అగ్ని ప్రమాద ప్రాంతం వద్ద పోలీసులు, హైడ్రా, విపత్తు నిర్వహణ బృందం సహాయక చర్యలు చేపట్టింది. ఘటనాస్థలిలో అంబులెన్స్‌లను అధికారులు సిద్ధంగా ఉంచారు. భవనం చుట్టుపక్కల దట్టంగా పొగ అలుముకుంది. ప్రమాద తీవ్రతను పెంచే వస్తువులను స్థానికులతో కలిసి అధికారులు తొలగిస్తున్నారు.



# టెండర్లపై విచారణకు సిద్ధం

మొదటి పేజి తరువాయి



**--ఇతర రాష్ట్రాల సంస్థల టెండర్లలోనూ సైట్ విజిట్ నిబంధన**

నైనీ టెండర్ నోటిఫికేషన్‌లో సైట్ విజిట్ నిబంధన ఎందుకు పెట్టారని హరీశ్ అంటున్నారు. 2018, 2021, 2023 సంవత్సరాల్లో సెంట్రల్ మైన్స్ ప్లానింగ్ అండ్ డిజైన్ ఇన్‌స్టిట్యూట్ జారీ చేసిన మార్గదర్శకాల్లో టెండర్లలో ఈ నిబంధన పెట్టాలని సూచించినందునే నైనీకి కూడా సింగరేణి పెట్టింది. దానికి ముందు అనేక రాష్ట్రాలతో పాటు, కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల టెండర్ల నోటిఫికేషన్లలో కూడా ఇది ఉంది. ఈ నిబంధన పెట్టడం తప్పు కాకపోతే మరి నైనీ టెండర్ నోటిఫికేషన్‌ను ఎందుకు రద్దుచేశారని అందరూ అనవచ్చు. ఆరోపణలు రాగానే... వాస్తవాలు ప్రజలకు పూర్తిగా తెలియకుండా ఆ నోటిఫికేషన్‌ను కొనసాగిస్తే అడ్డగోలుగా ఊహించుకుంటారని వెంటనే రద్దుచేయాలని చెప్పా.

**--సృజన్‌రెడ్డి మామ ఉపేందర్‌రెడ్డి ఇప్పటికీ భారాసలోనే ఉన్నారు**

పాత కాంట్రాక్టులన్నీ రద్దుచేసి సైట్ విజిట్ అనే నిబంధన పెట్టి సృజన్‌రెడ్డి అనే సీఎం బంధువుకి టెండర్లు కట్టబెడుతున్నారని హరీశ్‌రావు అంటున్నారు. శోధా కన్‌స్ట్రక్షన్స్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీకి ఎండీగా దీప్తిరెడ్డి ఉన్నారు. ఆమె భారాస మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి కుమార్తె. ఆయన 2018లో కాంగ్రెస్ తరపున ఎమ్మెల్యేగా గెలిచి అసెంబ్లీలో నాతో పాటు ఉండాలి. కానీ కాంట్రాక్టులు, టెండర్లు అని ప్రలోభాలు చూపి ఉపేందర్‌రెడ్డిని భారాసలో చేర్చుకున్నారు. ఆయన అల్లుడు.. దీప్తిరెడ్డి భర్తనే ఈ సృజన్‌రెడ్డి. ఇప్పటికీ ఉపేందర్‌రెడ్డి భారాసలోనే ఉన్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి దీంతో ఏం సంబంధం?

సైట్ విజిట్ సర్టిఫికెట్ తప్పనిసరి అనే నిబంధన పెట్టిన తరవాత ఇప్పటి వరకు 4 కంపెనీలకు మాత్రమే సింగరేణి టెండర్లను కేటాయించింది. శోధా కంపెనీకి వీకే ఓసీ గని 1 కాంట్రాక్టును ఇచ్చింది. మందమర్రి కళ్యాణఖని ఓసీ కాంట్రాక్టును 2025 మేలో ఎక్స్‌ప్రెస్‌వే ఆర్‌వీఎస్ఆర్ కంపెనీకి ఇచ్చింది. ఆర్‌వీఎస్ఆర్ అంటే ఆర్.విద్యాసాగర్‌రావు. ఎక్స్‌ప్రెస్‌వే కంపెనీ ఎండీ దీక్షిత్‌రావు. ఈ కంపెనీలు ఎవరివనేది అందరికీ తెలుసు. మొత్తం 12 మంది టెండర్లు వేయగా ఎవరికీ సైట్ విజిట్ సర్టిఫికెట్ ఇవ్వకుండా నిరాకరించలేదు. ఆర్‌జీ ఓసీ2 ఎక్స్‌టెన్షన్ ప్రాజెక్టు టెండర్‌ను సీ5 ఇంజినీరింగ్ ప్రైవేటు లిమిటెడ్‌కు 2025 జులై 4న ఇచ్చింది. ఈ కంపెనీ డైరక్టర్లు నిశాంత్‌రావు, మదన్‌మోహన్‌రావు. నిశాంత్‌రావు.. భారాస మాజీ ఎమ్మెల్సీ సుధాకర్‌రావు కుమారుడు. ఎస్ఆర్‌పీ ఓసీ2 ప్రాజెక్టు కోసం 12 మంది టెండర్లు వేయగా హర్ష కన్‌స్ట్రక్షన్స్ ప్రైవేటు లిమిటెడ్‌కి దక్కింది. ఈ కంపెనీలో ఎవరెవరు ఉన్నారో, ఇది భారాస పాలనలో ఎన్ని నీటిపారుదల ప్రాజెక్టులు పొందిందో, ఎవరితో చేతులు కలిపిందో అందరికీ తెలుసు. సైట్ విజిట్ నిబంధన పెట్టి మాకు కావాల్సిన వాళ్లకే టెండర్లు ఇచ్చి ఉంటే ఈ కంపెనీలకు వచ్చేవా? ఇంత పారదర్శకంగా టెండర్లు కేటాయించినా విచారణ చేయాలని కేంద్రానికి లేఖ రాసి తప్పుడు సమాచారం ఇవ్వడం ద్వారా హరీశ్‌రావు సింగరేణికి, తెలంగాణ ప్రజలకు నష్టం చేస్తున్నారు.

**--డీజిల్ కొనుగోలు నిబంధనలు భారాస హయాంలోనే మార్చారు...**

సింగరేణి.. ఐవోసీ నుంచి డీజిల్ కొనుగోలు మానేసి ప్రైవేటు కాంట్రాక్టర్లకు ఇచ్చినట్లు హరీశ్‌రావు ఆరోపించారు. కాంట్రాక్టర్లు నడిపే వాహనాలకు సంస్థ డీజిల్ సరఫరా చేసే విధానం సింగరేణిలో తప్ప దేశంలో ఎక్కడా లేదు. డీజిల్ సరఫరాలో ఒకప్పుడు పెద్ద స్కాం జరిగింది. అందులో నిందితులు ఇప్పుడు ఎక్కడున్నారనే వివరాలు తరవాత చెపుతా. పాత విధానం మారుస్తామంటే దేశవ్యాప్తంగా ఎలా జరుగుతుంటే అలా చేయాలని చెప్పా. నైనీ గనిలో మట్టి తొలగించే పనుల కాంట్రాక్టు నిబంధనలు మార్చి డీజిల్ సరఫరా వ్యయం కూడా కాంట్రాక్టరే భరించాలని భారాస హయాంలోనే 2472022న ఉత్తర్వులిచ్చారు.

**--బొగ్గు ఉత్పత్తి పెంచుకోవాలి...**

బొగ్గుబావులపై ఏ రాబందులను, గద్దలను, ఏ పెద్దలను వాలనీయను. అదనంగా బొగ్గు ఉత్పత్తి పెంచుకోవాలి. గత పదేళ్లుగా కొత్త గనులు తెచ్చుకోలేదు. ఉత్పత్తి తగ్గిపోయి అంతిమంగా లాభాలు, ఆదాయం పడిపోయి సింగరేణిపై ఆధారపడిన కుటుంబాలు ఉపాధిని కోల్పోయే ప్రమాదముంది. బొగ్గు నాణ్యత లేకపోతే వాడకం కూడా తగ్గే ప్రమాదముంది. నాణ్యమైన బొగ్గు గనులను తెచ్చుకుని ఈ సింగరేణిని బతికించుకోవాలి. రాజకీయ లబ్ధి కోసమో, వ్యక్తిగత ప్రయోజనాల కోసమో సింగరేణిపై విషం చిమ్మవద్దు. ఏమైనా అనుమానాలుంటే నా తలుపులు అన్నివేళలా తెరిచే ఉంటాయి. ఏం అడిగినా చెప్పడానికి నేను సిద్ధంగా ఉన్నా'' అని భట్టి అన్నారు.

# మహిళా కానిస్టేబుల్‌ను కారుతో ఢీకొట్టి.. గంజాయి గ్యాంగ్ హల్‌చల్



మొదటి పేజి తరువాయి

**సిటీటైమ్స్, నెట్‌వర్క్ :**

నగర శివారులో గంజాయి గ్యాంగ్ హల్‌చల్ చేసింది. శుక్రవారం అర్ధరాత్రి తనిఖీలు చేస్తున్న ఎక్సైజ్ సిబ్బందిని కారుతో ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఎక్సైజ్ మహిళా కానిస్టేబుల్ గాజుల సౌమ్య తీవ్రంగా గాయపడ్డారు. నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో ఆమె చికిత్స పొందుతున్నారు. ఆమె కిడ్నీలు దెబ్బతిన్నట్లు వైద్యులు తెలిపారు. ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఘటన అనంతరం పోలీసులు వాహనాన్ని వెంబడించి ఇద్దరు గంజాయి స్మగ్లర్లను అరెస్ట్ చేశారు. 2 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నిందితులను నిర్మల్ జిల్లాకు చెందిన వారిగా గుర్తించారు. కానిస్టేబుల్ సౌమ్యను ఆస్పత్రిలో కలెక్టర్ ఇలా త్రిపాఠి పరామర్శించారు.

**--కానిస్టేబుళ్ల ధర్నా..**

మరోవైపు నిజామాబాద్ ఆబ్కారీశాఖ ఎస్‌హెచ్‌వో కార్యాలయం ముందు కానిస్టేబుళ్లు ధర్నా చేపట్టారు. గంజాయి ముఠా దాడిలో గాయపడిన సౌమ్యకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

## సీపీ సజ్జనార్ నోటీసులకు సమాధానం ఇస్తా

## -- ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్



మొదటి పేజి తరువాయి

ఫోన్‌ట్యాపింగ్ వ్యవహారంలో కేటీఆర్, హరీశ్‌రావుకు సంబంధం లేకున్నా నోటీసులు ఇచ్చి సిట్ గంటల తరబడి దర్యాప్తు పేరిట వేధిస్తున్న ప్రహసనాన్ని ఖండించిన 12 గంటల్లోనే పోలీసులు ఇంటికి వచ్చి తనకు నోటీసు ఇచ్చినట్లు పేర్కొన్నారు. రెండు రోజుల్లో ఆధారాలతో సహా సమాధానం ఇవ్వకపోతే సివిల్, క్రిమినల్ చర్యలకు సిద్ధం కావాలని హెచ్చరించారని ప్రవీణ్ కుమార్ తెలిపారు. ప్రజా సమస్యలు, దౌర్జన్యాలపై గొంతెత్తడం తన హక్కని.. వార్నింగ్‌లకు భయపడబోనని పేర్కొన్నారు. సిట్ చీఫ్ సజ్జనార్ మీద ఏపీలో నమోదైన కేసులపై మరో సిట్ వేయాలని తాను డిమాండ్ చేసినట్లు నోటీసులో ఉందని, అది వాస్తవ విరుద్ధమని తోసిపుచ్చారు. పోలీస్ అధికారులు రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ రాజకీయ క్రీడలో పావులుగా మారవద్దని సలహా ఇచ్చినట్లు తెలిపారు. నాటి డీజీపీ, హోంసెక్రెటరీ, సీఎస్ లాంటి అధికారులందరినీ విడిచిపెట్టి సిట్ అధికారులు కేవలం విశ్రాంత ఐపీఎస్ ప్రభాకర్ రావు, ఆయన కుటుంబాన్ని, ఆయనతో పనిచేసిన కానిస్టేబుళ్లు, బంధువులను వేధించడం అన్యాయమని చెప్పినట్లు వివరించారు. తాను సజ్జనార్ సహా ఏ అధికారి, ఏ రాజకీయ నాయకుడి వ్యక్తిత్వ హననానికి పాల్పడలేదని... ఆ సంస్కృతి తనకు లేదని తెలిపారు.

# ధరణిని అడ్డుపెట్టుకుని భూముల్ని కాజేశారు

మొదటి పేజి తరువాయి

ఈ సందర్భంగా ధరణి పోర్టల్ ప్రారంభం నాటి నుంచి 35 లక్షల లావాదేవీలు జరిగినట్లు మంత్రికి హైలెవల్ కమిటీ నివేదించింది. ప్రాథమికంగా 4,848 లావాదేవీల్లో లోటుపాట్లను గుర్తించామని... 1,109 దస్తావేజులకు సంబంధించి రూ.4 కోట్లు దారిమళ్లాయని వెల్లడించింది. ధరణి పోర్టల్లోని లొసుగులతో చలానా సొమ్మును కాజేసిన అంశంలో ఎవరి పాత్ర ఎంత ఉంది? తెరవెనుక ఎవరైనా ఉన్నారా? రెవెన్యూ అధికారుల పాత్ర ఏమైనా ఉందా? అని కమిటీ సభ్యులను మంత్రి ఆరా తీశారు. కమిటీ సమర్పించిన ప్రాథమిక నివేదికను పరిశీలించిన మంత్రి... మరింత లోతైన విచారణ చేసి తుది నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడారు.

**--ధరణిలో లొసుగులతోనే...**

''నాటి ప్రభుత్వం ఎలాంటి ముందుచూపు లేకుండా, కుట్రపూరితంగా ధరణి పోర్టల్‌ను తీసుకొచ్చింది. ఈ పోర్టల్లోని లొసుగులను ఆసరాగా చేసుకుని కొంతమంది అక్రమాలకు పాల్పడితే భూభారతి పోర్టల్ సాంకేతికత ద్వారా ఆడిట్ నిర్వహించాం. అక్రమాలను గుర్తించి... తక్షణమే ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేసి విచారణ చేపట్టాం. దీనికి సంబంధించి 9 జిల్లాల్లోని 35 మండలాల్లో అక్రమాలకు పాల్పడిన 48 మందిపై క్రిమినల్ కేసులు నమోదు చేశాం. వాస్తవ పరిస్థితి ఇలా ఉంటే ప్రతిపక్షంలో ఉన్న ఓ నాయకుడు రూ.వెయ్యి కోట్ల అవినీతి అని, మరో నాయకుడు రూ.10 వేల కోట్లు అని, మరొకరు భూభారతి పోర్టల్ అవినీతిమయమని నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారు'' అని పొంగులేటి పేర్కొన్నారు. రెండో విడతలో శిక్షణ పూర్తిచేసుకున్న రెండు వేల మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లకు ఖమ్మంలో ఆదివారం నిర్వహించనున్న కార్యక్రమంలో లైసెన్స్‌లను అందజేయనున్నట్లు పొంగులేటి తెలిపారు. ప్యూటీ కలెక్టర్ల అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ బ్రాంచ్ తెలంగాణ రాష్ట్ర శాఖ నూతన డైరీని మంత్రి పొంగులేటి శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు వి.విక్టర్, చంద్రకళ, మాలతి, రమాదేవి, చంద్రావతి, ఉపేందర్‌రెడ్డి, సాయిరామ్ తదితరులు పాల్గొన్నారు.

**--'కేటీఆర్‌వి మతిలేని మాటలు'......**

సీఎం రేవంత్‌రెడ్డిపై కేటీఆర్ మాట్లాడుతున్న భాష సరిగా లేదని, ఆయనవి మతిలేని మాటలని పొంగులేటి ఘాటుగా విమర్శించారు. ఆయన మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. ''పురపాలక ఎన్నికలను రెఫరెండంగా నేను వ్యక్తిగతంగా భావిస్తున్నా. ఇప్పటికే రెండుసార్లు కేటీఆర్ రెఫరెండమని అన్నారు. మళ్లీ ఇప్పుడు మరోసారి అంటున్నారు. ఇంతకు ముందు జరిగిందే ఈ ఎన్నికల్లోనూ పునరావృతమవుతుంది. ఆనాడు ఇష్టమొచ్చినట్లు జిల్లాలను ఏర్పాటు చేశారు. ఇప్పుడేమో రాష్ట్రాన్ని అగ్నిగుండం చేస్తామంటూ అర్థం లేని వ్యాఖ్యలు చేస్తున్నారు. ప్రజాభిప్రాయానికి అనుగుణంగా శాస్త్రీయ పద్ధతిలో ప్రజామోదంతో జిల్లాలను పునర్వ్యవస్థీకరిస్తాం. వారి పాలనలో అక్రమాలు జరిగినట్లుగానే ఇప్పుడూ జరుగుతున్నాయని ప్రధాన ప్రతిపక్ష పార్టీ నేతలు భ్రమపడుతున్నారు' అంటూ మంత్రి ఎద్దేవా చేశారు.



# కేసీఆర్, కేటీఆర్ నా ఛాలెంజ్‌కు సిద్ధమా?

**--కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసి సింగరేణిని దోచుకుంటున్నాయి**

సింగరేణి సంస్థను కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసి దోచుకుంటున్నాయని కేంద్రమంత్రి బండి సంజయ్ ఆరోపించారు. గతంలో కేసీఆర్ కుటుంబమే దోచుకుంటే...కాంగ్రెస్ పాలనలో మంత్రులు, దళారులు దోచుకుంటున్నారన్నారని విమర్శించారు. అందుకే ఒకరి అవినీతిపై మరొకరు ఆరోపణలు చేసుకుంటున్నారని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ అవినీతిపై బీఆర్ఎస్ లేఖ రాస్తే... బీఆర్ఎస్ అవినీతిపై కూడా విచారణ జరుపుదామా? అని ఉప ముఖ్యమంత్రి భట్టి చెబుతున్నారని...సింగరేణిలో రెండు పార్టీలు దోచుకున్న దోపిడీపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. 2014 నుంచి ఇప్పటి వరకు సింగరేణిలో గనుల కేటాయింపు, జరిగిన దోపిడీపై శ్వేత పత్రం విడుదల చేయాలని తెలిపారు. తెలంగాణలో జరిగిన దోపిడీపై మాట్లాడుతుంటే... గుజరాత్‌ను ఎందుకు లాగుతున్నారని బండి సంజయ్ ప్రశ్నించారు. సింగరేణి కార్మికులు పోరాటాలు చేసి తెలంగాణ సాధించుకుంటే.. ఉమ్మడి రాష్ట్రంలో కంటే ఎక్కువ గనుల దోపిడీ ఇప్పుడు కొనసాగుతోందని విమర్శించారు. కేసీఆర్ పాలనలో సింగరేణిని దోచుకుంది ఆయన కుటుంబమేనని.. ఆ సంస్థలో దోచుకున్న సొమ్ముతోనే బీఆర్ఎస్ పార్టీని ఇన్నాళ్లు నడిపించారని పేర్కొన్నారు. రూ.42వేల కోట్ల సింగరేణి సొమ్మును రాష్ట్ర ప్రభుత్వం దోచుకుని సింగరేణిని అప్పుల పాల్జేసిందని మండిపడ్డారు. ఎన్నికలకు ముందు సింగరేణిని లాభాల్లోకి తెస్తామంటారు.. అధికారంలోకి వచ్చాక ఆ సొమ్మంతా దారి మళ్లించడం పరిపాటైందన్నారు. సింగరేణి ప్రజలు, కార్మికులు రెండు పార్టీల తీరును చూసి అసహ్యించుకుంటున్నారని తెలిపారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండూ తోడు దొంగలేనని...మా భాగోతం మీరు బయటపెడితే... మీ భాగోతం మేం బయటపెడతామంటూ మాట్లాడుకుంటున్నారని ఎద్దేవా చేశారు.



# స్టార్టప్‌ల స్థలం ప్రభుత్వ కార్యాలయాలా?



మొదటి పేజి తరువాయి

ఈ నిర్ణయంపై స్టార్టప్ వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. "టీ హబ్‌ను కార్యాలయాలుగా మార్చితే తెలంగాణ స్టార్టప్ గుర్తింపుకే మచ్చ పడేది. సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకున్నారు" అని వారు అభిప్రాయపడుతున్నారు. దేశవ్యాప్తంగా స్టార్టప్ కేంద్రంగా గుర్తింపు తెచ్చుకున్న తెలంగాణ, తన దిశను మార్చుకోకుండా ముందుకే సాగుతుందన్న సంకేతంగా ఈ పరిణామాన్ని పారిశ్రామిక వర్గాలు భావిస్తున్నాయి.

# నాంపల్లిలో ట్రాఫిక్ ఆంక్షలు .. నుమాయిష్ సందర్శకులకు కీలక సూచన



మొదటి పేజి తరువాయి

**హైదరాబాద్, సిటీటైమ్స్ :**

నాంపల్లిలోని ఫర్నిచర్ షాపులో జరిగిన అగ్ని ప్రమాదం నేపథ్యంలో ప్రజలకు సీపీ సజ్జనార్ కీలక సూచన చేశారు. ట్రాఫిక్ రద్దీని దృష్టిలో ఉంచుకుని సందర్శకులు నుమాయిష్ పర్యటనను ఈ రోజు వాయిదా వేసుకోవాలని సజ్జనార్ విజ్ఞప్తి చేశారు. నాంపల్లి స్టేషన్ రోడ్‌లో అగ్నిప్రమాదం కారణంగా.. పరిసర ప్రాంతాల్లో వచ్చే వాహనాలను దారి మళ్లిస్తున్నట్టు తెలిపారు. ఫర్నిచర్ దుకాణంలో చెలరేగిన మంటలు దాదాపు అదుపులోకి వచ్చాయని సజ్జనార్ వెల్లడించారు. ఘటనాస్థలిని పరిశీలించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. పొగ ఎక్కువగా ఉండటంతో సిబ్బంది భవనం లోపలికి వెళ్లలేకపోతున్నామని తెలిపారు. ''లోపల ఎంతమంది చిక్కుకున్నారనే దానిపై స్పష్టత లేదు. ముగ్గురు లేదా నలుగురు చిక్కుకొని ఉంటారని భావిస్తున్నాం. సహాయకచర్యలు పూర్తయ్యేందుకు మరో 23 గంటలు పట్టొచ్చు. రోబోను పంపించి లోపల చిక్కుకున్న వారిని రక్షించేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు'' అని తెలిపారు.

## చైనాతో ట్రేడ్ డీల్.. కెనడాపై 100%

# సుంకాలు విధిస్తా – ట్రంప్

మొదటి పేజి తరువాయి

చైనాతో వాణిజ్య ఒప్పందంపై ముందుకెళ్తే వారిపై చర్యలు తప్పవని అన్నారు. ముఖ్యంగా కెనడా నుంచి దిగుమతి చేసుకునే వస్తువులపై 100శాతం సుంకాలు విధిస్తామని హెచ్చరించారు. మరోవైపు కెనడా ను చైనా తినేస్తుందని.. వారి జీవన విధానాన్ని నాశనం చేస్తుందని మరోసారి సూచించారు. ''కెనడాను ప్రధాని మార్క్ కార్నీ ఓ 'డ్రాప్ ఆఫ్ పోర్ట్' (అదనపు రుసుములు తప్పించుకునే ప్రదేశంగా) భావిస్తే అది తప్పిదమే అవుతుంది. ఒకవేళ చైనాతో కెనడా వాణిజ్య ఒప్పందం కుదుర్చుకుంటే.. కెనడా నుంచి అమెరికా దిగుమతి చేసుకునే వస్తువులపై 100శాతం సుంకాలు విధిస్తా. కెనడాను చైనా సజీవంగా మింగేయడంతో పాటు వ్యాపారాలను, సామాజిక నిర్మాణాన్ని, జీవన విధానాన్ని పూర్తిగా నాశనం చేస్తుంది'' అని ట్రంప్ హెచ్చరించారు. చైనాతో కొత్త వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని ఏర్పరచుకున్నట్లు కెనడా ప్రధాని కార్నీ ఇటీవల ప్రకటించిన విషయం తెలిసిందే. దీని ద్వారా కెనడియన్ కార్మికులు, వ్యాపారులకు లబ్ధి చేకూరుతుందన్నారు. కెనడా ఆహార ఉత్పత్తులపై తక్కువ సుంకాలకు ప్రతిగా.. చైనా ఎలక్ట్రిక్ కార్లపై విధించిన 100 శాతం సుంకాలను తగ్గించడానికి అంగీకరించామని చెప్పారు. ఇదే సమయంలో 'గోల్డెన్ డోమ్' రక్షణ వ్యవస్థ ప్రాజెక్టును కెనడా తిరస్కరించడంపైనా ఆగ్రహంగా ఉన్న అమెరికా అధ్యక్షుడు.. కెనడా ప్రధానిపై తీవ్ర విమర్శలు చేస్తున్నారు.



## విదేశాల్లో భారత్ 'వాంటెడ్'

# రెండేళ్లలో 70 మంది గుర్తింపు!

మొదటి పేజి తరువాయి

గత రెండేళ్లలో (202425) 'వాంటెడ్' జాబితాలో ఉన్న వారిలో 70 మంది విదేశాల్లో ఉన్నట్లు గుర్తించామని పేర్కొంది. అంతేకాదు.. ఇతర దేశాలు వెతుకుతున్న 203 మంది నిందితులు భారత్‌లో ఉన్నట్లు కేంద్ర సిబ్బంది వ్యవహారాల శాఖ తాజా నివేదికలో పేర్కొంది. వాంటెడ్ జాబితాలో ఉన్న వారిలో 27 మంది గతేడాది విదేశాల నుంచి తిరిగి వచ్చారని భారత ప్రభుత్వం వెల్లడించింది. సీబీఐ కేసులకు సంబంధించి ఏడాది వ్యవధిలో 74 రొగేటరీ లెటర్స్ (దర్యాప్తునకు సహకరించాలని విజ్ఞప్తి చేస్తూ విదేశీ న్యాయస్థానాలకు రాసే లేఖ) పంపించామని, వీటిలో 54 సీబీఐ, మరో 20 రాష్ట్ర దర్యాప్తు బృందాలకు చెందినవని పేర్కొంది. ఇప్పటివరకు ఆయా దేశాల్లో మొత్తం 533 ఎల్ఆర్‌లు పెండింగులో ఉన్నాయని తెలిపింది.

# మేడారంలో 'చిల్డ్రన్ ట్రాకింగ్ అండ్ మానిటరింగ్ సిస్టం'

మొదటి పేజి తరువాయి

ఈ సాంకేతిక విధానం ప్రకారం జాతరకొచ్చే భక్తుల వెంట ఉన్న చిన్నారుల వివరాలను నిర్దేశించిన 11 ప్రత్యేక పాయింట్ల వద్ద సిబ్బంది నమోదు చేసుకుంటారు. ఆ వివరాల్లో చిన్నారులు, తల్లిదండ్రులు లేదా సంరక్షుల పేర్లు, ఫోన్ నంబర్లు కంప్యూటర్‌లో ఎంట్రీ చేస్తారు. ఆ తర్వాత క్యూఆర్ కోడ్‌తో కూడిన రిస్ట్‌బ్యాండ్లను చిన్నారులకు చుడతారు. ఒకవేళ జాతరలో పిల్లలు తప్పిపోయి వలంటీర్లు, పోలీసుల కంట పడితే వారు.. చిన్నారుల చేతికి ఉన్న క్యూఆర్ కోడ్‌ను తమ ఫోన్‌తో స్కాన్ చేస్తారు. ఆ వెంటనే తల్లిదండ్రుల వివరాలు, ఫోన్ నంబర్లు కనిపిస్తాయి. ఆ సమాచారంతో వెంటనే కుటుంబసభ్యులకు ఫోన్ చేసి పిల్లలను వారి చెంతకు చేరుస్తారు. ఈ మేరకు జాతర కోసం తొలిదశలో 25వేల రిస్ట్‌బ్యాండ్లు సిద్ధంగా ఉంచారు. వొడాఫోన్ ఐడియా సహకారంతో స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో ఐజీ సుమతి నెలన్నర పాటు శ్రమించి ఈ క్యూఆర్ కోడ్‌ను రూపొందించారు. శనివారం తన కార్యాలయంలో డీజీపీ శివధర్ రెడ్డి.. సీటీఎంఎస్ రిస్ట్‌బ్యాండ్లను, పోస్టర్లను ఆవిష్కరించారు. దీనికి సంబంధించిన వివరాలన్నీ ఆయనే వెల్లడించారు. మహిళా భద్రతా విభాగం డీజీపీ చారుసిన్హా ఆధ్వర్యంలో మేడారం జాతరలో పూర్తి స్థాయిలో ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తామని ఆయన చెప్పారు. భవిష్యత్తులో జరిగే కుంభమేళాలో ఈ విధానాన్ని వినియోగించుకోవచ్చునని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో అదనపు డీజీపీ మహేశ్ భగవత్, చారుసిన్హా, డీఎస్ చౌహాన్, ఐజీలు చంద్రశేఖర్ రెడ్డి, సుమతి, డాక్టర్ గజారావు భూపాల్ తదితరులు పాల్గొన్నారు.

## హిందూ సమాజ ఐక్యతే ధర్మ రక్షణ

**చలో బాలాపూర్ ధర్మ రక్షణ సభ విజయవంతం**

**భారీగా తరలివెళ్లిన కుత్బుల్లాపూర్ హిందూ సమాజం**




**కుత్బుల్లాపూర్, సిటీటైమ్స్:**
హిందూ సమాజ ఐక్యతే ధర్మ రక్షణకు మూలమని కుత్బుల్లాపూర్ డివిజన్ హిందూ సమాజం నాయకులు తెలిపారు. శనివారం చలో బాలాపూర్ ధర్మ రక్షణ సభ కార్యక్రమానికి కుత్బుల్లాపూర్ డివిజన్ హిందూ బంధువులు భారీ సంఖ్యలో బయలుదేరి వెళ్లారు. హిందూ ఐక్యతను చాటుతూ, ఉత్సాహభరిత నినాదాలతో కుత్బుల్లాపూర్ నుంచి బాలాపూర్ దిశగా శాంతియుతంగా ర్యాలీ నిర్వహించి గంభీరంగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా హిందూ సమాజం ఏకతాటిపై నిలబడి ధర్మ పరిరక్షణకు కట్టుబడి ఉందని నాయకులు స్పష్టం చేశారు. కార్యక్రమం అంతటా భక్తి, శక్తి, ఐక్యత స్పష్టంగా కనిపించాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆకుల సతీష్, మాదవులు, వరాల మహేష్, నల్ల జై శంకర్ గౌడ్, కంది శ్రీరాములు, రమేష్ వేముల, పులి బలరాం, మనీష్, శ్యామ్ రెడ్డి, విఠల్ తదితర ప్రముఖులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. హిందూ సమాజ ఐక్యతే ధర్మ రక్షణకు మూలమని, భవిష్యత్తులో ఇలాంటి కార్యక్రమాలు మరింత బలంగా నిర్వహిస్తామని పాల్గొన్న నాయకులు తెలిపారు.

## వసంత పంచమి సాకుతో ముందస్తు అడ్మిషన్లు ఆపాలి

**ప్రైవేట్ స్కూల్స్ పై వెంటనే ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి**

**-ఏఐఎస్ఎఫ్ రంగారెడ్డి జిల్లా ఆఫీస్ బేరర్స్ డిమాండ్**



**శేరిలింగంపల్లి, సిటీటైమ్స్:**
వసంత పంచమి సాకుతో ముందస్తు అడ్మిషన్లు నిర్వహిస్తున్న ప్రైవేట్ స్కూల్స్ పై వెంటనే ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ రంగారెడ్డి జిల్లా ఆఫీస్ బేరర్స్ డిమాండ్ చేశారు. శనివారం రంగారెడ్డి జిల్లా వివిధ మండలాలో వసంత పంచమి పేరుతో కార్పొరేట్, ప్రవేట్ పాఠశాలల్లో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఆఫర్లతో అడ్మిషన్లు చేస్తున్న పాఠశాలల చర్యలు తీసుకోవాలని రంగారెడ్డి జిల్లా ఆడిషనల్ డీఈఓ పూర్ణచందర్ రావుకి వినతిపత్రం అందజేశారు. వివిధ మండలాలలో ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలో విద్యా వ్యాపారం దిశగా 202526 విద్యాసంవత్సరం గడవక ముందే, వసంత పంచమి పేరుతో 20262027 విద్యా సంవత్సరానికి గాను నోఅడ్మిషన్ ఫీ, డిస్కౌంట్ల పేరుతో ముందస్తు అడ్మిషన్లు బహిరంగంగా ఇష్టారాజ్యంగా చేపడుతున్నారని ఆరోపించారు. అడ్మిషన్లు ఫీ, బుక్స్, డ్రెస్, టై, బెల్ట్ పేర్లతో లక్షలకు లక్షలు విద్యార్థుల తల్లిదండ్రుల నుండి విద్య పేరుతో వ్యాపారం చేస్తూ ముందస్తు అడ్మిషన్లు చేస్తున్న ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ అఖిల భారత విద్యార్థి సమైక్య రంగారెడ్డి జిల్లా ఆఫీస్ బేరర్స్ జిల్లా సహా కార్యదర్శి కె శివ, జే ధర్మ తేజ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు పి వినోద్ ఎగ్జిక్యూటివ్ నెంబర్ టీ నితీష్ తదితరులు పాల్గొన్నారు.

## వరద ముంపు సమస్యలకు శాశ్వత పరిష్కారం

**రూ.79.58కోట్లతో నాలాల విస్తరణ పనులకు శ్రీకారం**

**-పిఏసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ**



**శేరిలింగంపల్లి, సిటీటైమ్స్:**
వరద ముంపు సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని, నియోజకవర్గంలో రూ.78.58కోట్లతో నాలాల విస్తరణ పనులకు శ్రీకారం చుట్టామని పిఏసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ తెలిపారు. శనివారం చందానగర్ డివిజన్ పరిధిలోని దీప్తి శ్రీ నగర్ నాలా విస్తరణ పనులలో భాగంగా అసంపూర్తిగా మిగిలిపోయిన నాలా విస్తరణ నిర్మాణం పనులను ఎస్ఎన్డిపి ఇంజనీరింగ్ విభాగం అధికారులు సీనియర్ నాయకులు రఘునాథ్ రెడ్డితో కలిసి పిఏసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దీప్తి శ్రీ నగర్ కాలనీలో నాలా విస్తరణ పనులలో భాగంగా అసంపూర్తిగా మిగిలిపోయిన నాలా విస్తరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఎన్నో ఏండ్ల సమస్య నేటితో తీరనుంది అన్నారు. నాలాల విస్తరణ పనులతో లోతట్టు, ముంపు ప్రాంతాలకు ఉపశమనం లభించింది అని, ప్రజా అవసరాల దృష్ట్యా ప్రథమ ప్రాధాన్యతలో విస్తరణ పనులు చేపట్టాలని, నాలాల విస్తరణ పనులలో వేగం పెంచాలని, యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డీఈ ధీరజ్, నాయకులు రఘునాథ్ రెడ్డి, ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, గౌతమ్ గౌడ్, ప్రవీణ్ రెడ్డి, సుదేశ్, సీతారామయ్య కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## ఫ్రెండ్స్ వెల్ఫేర్ ఆధ్వర్యంలో జాతీయ ఓటర్ల దినోత్సవం






**శేరిలింగంపల్లి, సిటీటైమ్స్:**
1950 జనవరి 25న భారత ఎన్నికల కమిషన్ ఏర్పాటు చేయబడిన సందర్భంగా ఈ రోజు జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహించడం జరుగుతుందని ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామియాదవ్ తెలిపారు.శనివార బిహెచ్ఈఎల్ టౌన్ షిప్ లో గల శేరిలింగంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థిని విద్యార్థులకు జాతీయ ఓటర్ల దినోత్సవం అవగాహన కార్యక్రమాన్ని ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈకార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కవిత అధ్యక్షత వహించారు. అలాగే ముఖ్యఅతిథిగా డాక్టర్ పూలపల్లి వెంకటరమణ (విశ్రాంత ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్) విచ్చేసి విద్యార్థిని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ.. భారత ఎన్నికల కమీషను స్వతంత్ర భారత దేశంలో ఎన్నికలను సజావుగా, నిష్పక్షపాతముగా నిర్వహించేందుకు రాజ్యాంగం ద్వారా ఏర్పాటు చేసిన సంస్థ అన్నారు. 1950 జనవరి 25న ఏర్పాటు చేయబడిన ఈ కమీషను సుప్రీంకోర్టు వలనే రాజ్యాంగం ఏర్పరచిన స్వయం ప్రతిపత్తి కలిగిన వ్యవస్థ అన్నారు. ఇది ప్రభుత్వ నియంత్రణకు లోబడి ఉండదని, దేశంలో రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి, లోక్ సభ, రాష్ట్రాల శాసనసభలు, శాసనమండళ్ళకు జరిగే ఎన్నికలను ఈ కమీషన్ నిర్వహిస్తుందని వివరించారు. ఈ సందర్భంగా అందరిచేతా 'ఓటుహక్కును పొందుతామని, ఓటింగులో పాల్గొని ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా మంచి అభ్యర్థులను ఎన్నుకుంటామని ప్రతిజ్ఞ చేశారు.కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ అభిజిత్, అధ్యాపకులు డాక్టర్ అనురాధ, ప్రజ్వల, జనార్ధన్ ఫ్రెండ్స్వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు అమ్మయ్య చౌదరి, శివరామకృష్ణ, పాల్గొన్నారు.

## కైదమ్మ కుంటను సుందరశోభితవనంగా తీర్చిదిద్దుతాం

**-పిఏసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ**



**శేరిలింగంపల్లి, సిటీటైమ్స్:**
చెరువులను సంరక్షణిచడమే ధ్యేయంగా పనిచేస్తున్నామని, కైదమ్మ కుంట చెరువు పునరుద్ధరణతో దశ దిశ మారుతుందని, చెరువును సుజల జలంతో అపురూప దృశ్యకావ్యంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తామని పిఏసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ అన్నారు. శనివారం హాఫీజ్పెట్ డివిజన్ పరిధిలోని కైదమ్మ కుంట చెరువు సుందరికరణలో భాగంగా నెక్సాస్ సెలెక్ట్ మాల్ కంపెనీ వారి సిఎస్ఆర్ ఫండ్స్ ద్వారా మల్లిగవాడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్వచ్ఛందంగా చేపట్టనున్న చెరువు పునర్జీవనం సుందరీకరణ పునరుద్ధరణ పనులను పిఏసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ పరిశీలించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ.. కైదమ్మ కుంట చెరువు పునరుద్ధరణ ప్రభుత్వం, పరిశ్రమలు సమాజం మధ్య భాగస్వామ్య ప్రయత్నాలు అర్థవంతమైన పర్యావరణ పురోగతిని ఎలా నడిపించగలదో చెప్పడానికి ఒక శక్తివంతమైన ఉదాహరణగా నిలుస్తుంది. ఈ ప్రాజెక్ట్ కీలకమైన సహజ వనరులను పునరుజ్జీవింపజేయడమే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా భవిష్యత్తులో సుస్థిరమైన అభివృద్ధి కోసం ఒక నమూనాను ఏర్పాటు చేస్తుంది అని అన్నారు. నెక్సాస్ సెలెక్ట్ మాల్స్, మల్లిగవాడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సుందరీకరణ చేపట్టుటకు ముందుకు రావడం చాలా అభినదించదగ్గ విషయం అన్నారు. చెరువు చుట్టుపక్కల కాలనీ వాసులు ప్రజలు చెరువును సంరక్షించడంలో ప్రతి ఒక్కరు బాధ్యతాయుతంగా సామాజిక బాధ్యతతో సంరక్షించుకోవాలని, చెరువుల పరిరక్షణలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఎస్ఆర్ ఐటి సంస్థ ప్రతినిధులు చైతన్య నాయకులు బాలింగ్ గౌతమ్ గౌడ్, ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్ ,సుదేశ్ కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా అవసరాలకు అనుగుణంగా మెరుగైన సౌకర్యాలు

**మౌలిక వసతుల కల్పనకు సంపూర్ణ సహకారం**

**-కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి**

**ప్రజా సమస్యలపై కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి పాదయాత్ర**



**శేరిలింగంపల్లి, సిటీటైమ్స్:**
డివిజన్ పరిధిలో ప్రతి కాలనీ, బస్తీలో ప్రజలకు మెరుగైన మౌళికవసతులు కల్పించడమే ప్రధాన ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని, ప్రజల అవసరాలకు అనుగుణంగా మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనకు నిరంతరం కృషి చేస్తున్నామని ఎటువంటి సమస్యలు ఉన్న తన దృష్టికి తీసుకోని రావాలని గచ్చిబౌలి డివిజన్ ప్రజలను కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. శనివారం శేరిలింగంపల్లి నియోజకవర్గం గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని మంజీర డైమండ్ హైట్స్ లో స్థానిక ప్రజా సమస్యలపై గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ జిహెచ్ఎంసి అధికారులతో కలిసి పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా కాలనీ వీదుల్లో పర్యటించి అక్కడి సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ మేరకు తమ కాలనీలో భూగర్భ డ్రైనేజీ పనులు పూర్తయ్యాయని, పెండింగ్ లో ఉన్న సీసీ రోడ్లను పూర్తి చేయాలని కార్పొరేటర్ గంగాధర్ రెడ్డిని కోరారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి మాట్లాడుతూ.. సీసీ రోడ్ల పనులకు ఇప్పటికే మంజూరు అయ్యాయి , త్వరలోనే పనులు ప్రారంభమవుతాయని భరోసా ఇచ్చారు. అనంతరం తమ కాలనీలోని హనుమాన్ పార్క్‌లో యోగా ధ్యాన కార్యక్రమాల కోసం ప్లేన్ ప్లాట్ ఫామ్‌తో పాటు షెడ్ ఏర్పాటు చేయడం, టాటా స్పోర్ట్స్ పార్క్‌లో యువతను క్రీడల వైపు ప్రోత్సహించేలా బ్యాంక్ క్రికెట్ సదుపాయం కల్పించడం, ట్రీ పార్క్‌లో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయడంతో పాటు చిన్నారుల కోసం చిల్డ్రన్ ప్లే ఎక్విప్మెంట్, విశ్రాంతికి బెంచీలు, అన్ని వయస్సుల వారికి ఉపయోగపడే వాకింగ్ ట్రాక్ అభివృద్ధి చేయాలని కార్పొరేటర్ గంగాధర్ రెడ్డిని కోరారు. అలాగే పార్కుల పరిసరాల్లో శుభ్రత, వీధి దీపాల మరమ్మతులు, విద్యుత్ సమస్యలు, డ్రైనేజీ నిర్వహణను మరింత మెరుగుపరచాలని కోరారు. ఈ అంశాలపై తక్షణమే స్పందించిన కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి అక్కడే ఉన్న అధికారులకు అన్ని సమస్యలను నోట్ చేయించి, అవసరమైన నిధులు కేటాయించి వీలైనంత త్వరగా పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజా సమస్యలకు శాశ్వత పరిష్కారమే లక్ష్యంగా పారదర్శకంగా, బాధ్యతతో అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగిస్తామని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి ఇంజనీరింగ్ విభాగం ఏఈ భాస్కర్, మంజీరా డైమండ్ హైట్స్ అధ్యక్షులు పి ఆర్ రావు , ఉపాధ్యక్షులు సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి సుందర చరి, జాయింట్ సెక్రెటరీ సుమంత్, కాలనీ వాసులు, మనోజ్, రామచంద్రా రెడ్డి, గోవర్ధన్, మదన్, రాకేష్, గోపాల్, శేఖర్ రెడ్డి, శశి, రజని, హేమ, సీనియర్ నాయకులు శేఖర్, సుమన్, వెంకటేష్,రంగస్వామి, చిన్న, నర్సింగ్ రావు, వర్క్ ఇన్స్పెక్టర్ లక్ష్మణ్, స్థానిక నేతలు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అవగాహనతో భద్రత... 4,260 మందికి చేరువైన పోలీస్ కార్యక్రమాలు

***అవగాహనతో భద్రత... 4,260 మందికి చేరువైన పోలీస్ కార్యక్రమాలు***

****ఆపరేషన్ స్మైల్–XIIలో 337 మంది చిన్నారుల రక్షణ***

****షీ టీం డెకాయ్ ఆపరేషన్లలో 55 మంది అదుపులోకి***

****కుటుంబ కౌన్సిలింగ్‌తో 30 కుటుంబాల పునర్మిళనం***




**సైబరాబాద్, జనవరి 24 (సిటీటైమ్స్):**
మహిళలు, చిన్నారుల భద్రతను మరింత పటిష్టం చేయాలనే లక్ష్యంతో సైబరాబాద్ విమెన్ అండ్ చిల్డ్రన్ సేఫ్టీ వింగ్ ఆధ్వర్యంలో ఈ నెల 17 నుంచి 23 వరకు వారం రోజుల పాటు విస్తృత చర్యలు చేపట్టినట్లు డీసీపీ సృజన కరణం తెలిపారు. ఈ చర్యలలో భాగంగా రక్షణ చర్యలతో పాటు అవగాహన కార్యక్రమాలను సమన్వయంగా నిర్వహించి మొత్తం 4,260 మందికి చేరువైనట్లు వెల్లడించారు. ఆపరేషన్ స్మైల్-XIIలో బాలల రక్షణ ఆపరేషన్ స్మైల్-XIIలో భాగంగా సైబరాబాద్ యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ చేపట్టిన ప్రత్యేక దాడుల్లో జువెనైల్ జస్టిస్ చట్టం కింద 119 కేసులు నమోదు చేసి, 337 మంది చిన్నారులను విజయవంతంగా రక్షించినట్లు తెలిపారు. రక్షించబడిన వారిలో 329 మంది బాలురు, 8 మంది బాలికలు ఉన్నారని వివరించారు. షీ టీం డెకాయ్ ఆపరేషన్లు ఉధృతం ఈ వారం షీ టీం బృందాలు 176 డెకాయ్ ఆపరేషన్లు నిర్వహించగా, బహిరంగ ప్రదేశాల్లో అసభ్యకర ప్రవర్తనకు పాల్పడిన 55 మందిని రెడ్ హ్యాండెడ్‌గా అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వీరిలో 45 మందిపై పెటీ కేసులు నమోదు చేయగా, మిగిలిన వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇదే సమయంలో మహిళల నుంచి వచ్చిన 18 ఫిర్యాదులను స్వీకరించి తగిన చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. కుటుంబ కౌన్సిలింగ్‌తో పునర్మిళనం భార్యాభర్తల మధ్య తలెత్తిన కుటుంబ సమస్యలను పరిష్కరించడంలో ఫ్యామిలీ కౌన్సిలింగ్ సెంటర్లు, సీడీఈడబ్ల్యూ కేంద్రాలు కీలకంగా వ్యవహరించాయని తెలిపారు. ఈ కేంద్రాల ద్వారా 30 కుటుంబాలను తిరిగి కలిపి, కుటుంబాల్లో మళ్లీ సంతోషాన్ని నెలకొల్పినట్లు వెల్లడించారు. విస్తృత అవగాహన కార్యక్రమాలు సైబరాబాద్ పరిధిలోని పలు ప్రాంతాల్లో యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్, షీ టీం బృందాలు మానవ అక్రమ రవాణా, బాలల అక్రమ రవాణా, బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ, మహిళలపై వేధింపులు, నిరంతర వెంబడింపులు, భిక్షాటన, సామాజిక మాధ్యమాల ద్వారా వేధింపులు, సైబర్ మోసాలపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. హెల్ప్‌లైన్‌లపై ప్రత్యేక ప్రచారం మహిళల హెల్ప్‌లైన్ 181, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, డయల్ 100, సైబర్ హెల్ప్‌లైన్ 1930 సేవల ప్రాముఖ్యతను ప్రజలకు వివరించి, అత్యవసర పరిస్థితుల్లో వెంటనే సంప్రదించాలని డీసీపీ సృజన కరణం సూచించారు.

## మృతురాలి కుటుంబానికి అండగా ఎమ్మెల్యే మేఘారెడ్డి: 'అభయహస్తం'తో ఆర్థిక భరోసా



**పెద్దమందడి, సిటీ టైమ్స్ 24**

కష్టాల్లో ఉన్న పేద ప్రజలకు నేనున్నానంటూ వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి మరోసారి తన ఉదారతను చాటుకున్నారు. అనారోగ్యంతో మరణించిన నిరుపేద కుటుంబానికి తక్షణ సాయం అందించి మానవత్వాన్ని చాటుకున్నారు.

పెద్దమందడి మండలం అమ్మపల్లి గ్రామానికి చెందిన పచారమోని భీములమ్మ (60) అనారోగ్యం క్షీణించి (నిన్న) శుక్రవారం మృతి చెందారు. నిరుపేద కుటుంబం కావడంతో అంత్యక్రియల నిర్వహణ భారమైన తరుణంలో, స్థానిక కాంగ్రెస్ నాయకులు ఈ విషయాన్ని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే, తన 'అభయహస్తం' కార్యక్రమం ద్వారా బాధిత కుటుంబానికి రూ. 5,000 ఆర్థిక సాయాన్ని ప్రకటించారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు స్థానిక సర్పంచ్ గౌని మాధవి వెంకటేశ్వర రెడ్డి, గ్రామ నాయకులు మృతురాలి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి నగదును అందజేశారు. వీరికి తోడుగా ఉప సర్పంచ్ బాబు నాయక్ కూడా రూ. 2,000 వ్యక్తిగతగా సాయం అందించి ఆ కుటుంబానికి భరోసానిచ్చారు. ఆపద సమయంలో తమను ఆదుకున్న ఎమ్మెల్యే కి భీములమ్మ కుటుంబ సభ్యులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బి. రమేష్ యాదవ్, సింగల్ విండో డైరెక్టర్ గౌని వెంకటేశ్వర రెడ్డి, పార్టీ అధ్యక్షులు సి. ఆంజనేయులు మరియు గ్రామ నాయకులు పాల్గొన్నారు

## వీరభద్రుని సన్నిధిలో రవీందర్ ప్రత్యేక పూజలు



**భీమదేవరపల్లి, జనవరి 24 ( సిటీ టైమ్స్)**

హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తకొండలోని శ్రీ వీరభద్ర స్వామి జాతరలో భాగంగా ఆర్యవైశ్య సంఘం నాయకుడు చిదర రవీందర్, కెసి సారధి లు శనివారం నాడు స్వామి వారిని దర్శించుకున్నారు

ఈ సందర్భంగా వారిని ఆలయ ముఖ్య అర్చకుడు మొగిలిపాలెం రాంబాబు ఆశీర్వాదాలు చేసి సత్కరించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ తమ స్వగ్రామం ముల్కనూరు అయినప్పటికీ వృత్తి రీత్యా హైదరాబాదులో నివాసం ఉంటున్నామని అయినప్పటికీ జనవరి మాసంలో జరిగే వీరభద్రుడు జాతరకు ప్రతి ఏటా హాజరై మొక్కులు చెల్లించుకుంటామని ఆయన తెలిపారు

## వనపర్తి మున్సిపాలిటీలో అవినీతిని అంతం చేద్దాం: డా" సతీష్ యాదవ్





**వనపర్తి సిటీ టైమ్స్ జనవరి 24**

వనపర్తి మున్సిపాలిటీ ప్రక్షాళనే లక్ష్యంగా పదిమంది అవినీతిపరులను ఓడించి, ఐదుగురు ప్రశ్నించే గొంతుకలను గెలిపించాలని అఖిలపక్ష ఐక్యవేదిక అధ్యక్షుడు డా" సతీష్ యాదవ్ ప్రజలకు పిలుపునిచ్చారు. పట్టణంలోని 5, 13, 28వ వార్డుల్లో శనివారం పర్యటించిన ఆయన, అవినీతిని ఎండగట్టిన వారిపై దాడులు చేయడం, బెదిరించడం పాలకుల నైజమని విమర్శించారు. పుట్టిన ఊరి సేవ కోసం ఏ త్యాగానికైనా సిద్ధమని స్పష్టం చేస్తూ, వనపర్తిని దోచుకున్న వారి వివరాలను త్వరలోనే సాక్ష్యాలతో సహా ప్రజల ముందు ఉంచుతామని హెచ్చరించారు. ఎన్నికల నోటిఫికేషన్ అనంతరం అభ్యర్థుల సరళిని బట్టి తమ తదుపరి నిర్ణయాలు ఉంటాయని, ఈ పోరాటంలో ప్రజలంతా భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, బత్తిని మధు, రామస్వామి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# నపర్తిలో ఏబీవీపీ ఆధ్వర్యంలో ఘనంగా తిరంగా ర్యాలీ

**వనపర్తి టౌన్ సిటీ టైమ్స్ జనవరి 24**

వనపర్తి జిల్లా కేంద్రంలో అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఆధ్వర్యంలో భారతదేశ 77వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఘనంగా తిరంగా ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ ర్యాలీలో పెద్ద సంఖ్యలో విద్యార్థులు, ఏబీవీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని త్రివర్ణ పతాకాలతో దేశభక్తి నినాదాలు చేస్తూ వాతావరణాన్ని దేశభక్తితో నింపారు.ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కార్తీక్ మాట్లాడుతూ, 1950 జనవరి 26న భారతదేశం రాజ్యాంగాన్ని స్వీకరించి ప్రజాస్వామ్య గణతంత్ర దేశంగా అవతరించిందని గుర్తు చేశారు. గణతంత్ర దినోత్సవం రాజ్యాంగం ఇచ్చిన హక్కులతో పాటు, దేశం పట్ల ఉన్న విధులు, బాధ్యతలను గుర్తు చేసే దినమని తెలిపారు.విద్యార్థుల్లో జాతీయ భావనను, రాజ్యాంగ విలువలను పెంపొందించడమే ఏబీవీపీ ప్రధాన లక్ష్యమని, దేశ ఐక్యత, సమానత్వం, సామాజిక న్యాయం కోసం ఏబీవీపీ నిరంతరం పోరాడుతోందని స్పష్టం చేశారు. విద్యార్థుల హక్కులు కాలరాయబడినప్పుడు రాజీపడకుండా ప్రశ్నించడమే నిజమైన గణతంత్ర స్ఫూర్తి అని అన్నారు.






రాజ్యాంగ విలువలను కాపాడుతూ, స్వాభిమానంతో కూడిన బలమైన భారత నిర్మాణంలో యువత కీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఉందని, ఆ దిశగా విద్యార్థులను చైతన్యవంతం చేయడంలో ఏబీవీపీ ముందుంటుందని తెలిపారు.ఈ గణతంత్ర దినోత్సవ సందర్భంగా ప్రతి విద్యార్థి త్రివర్ణ పతాకం కింద ఐక్యంగా నిలబడి రాజ్యాంగాన్ని గౌరవిస్తూ, వికసిత భారత నిర్మాణానికి కట్టుబడి ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా హాస్టల్ కన్వీనర్ జ్ఞానేశ్వర్, టౌన్ సంయుక్త కార్యదర్శి బంటి, శంకర్, నందకిషోర్, సంతోష్, పరమేష్, మురళి తదితర ఏబీవీపీ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

# వనపర్తిలో ఘనంగా జననాయక్ కర్పూరి ఠాగూర్ జయంతి వేడుకలు

**వనపర్తి సిటీ టైమ్స్ జనవరి 24**

సామాజిక న్యాయ పోరాట యోధుడు, బీహార్ మాజీ ముఖ్యమంత్రి, భారత రత్న కర్పూరి ఠాగూర్ జయంతి వేడుకలు వనపర్తి జిల్లా కేంద్రంలో శనివారం ఘనంగా జరిగాయి. వనపర్తి పట్టణ మరియు జిల్లా నాయి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నాయకులు, సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని కర్పూరి ఠాగూర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేస్తూ సంబరాలు జరుపుకున్నారు.

ఈ సందర్భంగా నాయి బ్రాహ్మణ సేవా సంఘం పట్టణ అధ్యక్షుడు అశ్విని చంద్రకుమార్ మాట్లాడుతూ.. అణగారిన వర్గాల ఆశాజ్యోతిగా, వెనుకబడిన తరగతుల హక్కుల కోసం అలుపెరగని పోరాటం చేసిన మహనీయుడు కర్పూరి ఠాగూర్ అని కొనియాడారు. ఆయన చూపిన బాటలో నడుస్తూ, నాయి బ్రాహ్మణ సంఘం ఐక్యమత్యంతో సామాజిక అభ్యున్నతికి తోడ్పడాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు అశ్విని రమేష్, ప్రధాన కార్యదర్శి చింతకుంట నాగరాజు, క్యాషియర్ విశ్వనాథం ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వీరితో పాటు పట్టణ ఉపాధ్యక్షులు తక్కశిల నాగరాజు, సిద్దేశ్వర్, అశ్విని నరేష్, క్యాషియర్ తిరుమలేష్, ఆర్గనైజర్ మహేష్, విజయ్ కుమార్, క్రాంతి, శివ కుమార్, కడుకుంట్ల రాజు తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు







# ఘనంగా భారతరత్నా కర్పూరి ఠాకూర్ జయంతి వేడుకలు

**కొత్తకోట సిటీ టైమ్స్ జనవరి 24:**

కొత్తకోట మున్సిపాలిటీ కేంద్రంలో భారతరత్న కర్పూరి ఠాకూర్ జయంతి వేడుకలు బీసీ కులాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. బీసీ కులాల కన్వీనర్ రాములు యాదవ్ మాట్లాడుతూ

ఉత్తర భారతదేశంలోని రాష్ట్రలలో మొదటిసారిగా ఓ బి సి రిజర్వేషన్లను ఇవ్వడం మెట్రిక్యులేషన్ వరకు అందరికీ విద్య ఉచితంగా అందించడం మరియు ఆత్మ రక్షణ కోసం ప్రభుత్వ ఖర్చుతో ఎస్సీలకు తుపాకీ అందించడం లాంటి అనేక సామాజిక అంశాలతో నడిచిన గొప్ప నాయకుడు కర్పూరి ఠాకూర్ కుల వ్యవస్థలో అత్యంత అన్యాయనికి గురైన నాయీలు (మంగలి కులం వారు) మగధ సామ్రాజ్యంలో నంద వంశంలోని ధన నంద రాజకీయాల గురించి అదే గడ్డ మీద నుంచి వచ్చిన కర్పూరి ఠాగూర్ అత్యంత వెనుకబాటు కులంలో నుంచి సామజిక నాయ్యం

పోరాడిన యోధున్ని అలాగే తమిళనాడు గడ్డమీద సామాజిక న్యాయం కోసం యుద్ధం చేస్తున్న కరుణానిధి అతని వారసుల రాజకీయాలను ఈ తెలుగు గడ్డమీద నాయి బ్రాహ్మణులు రాజ్యాధికారం గా ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమంలో కొత్త గంగాధర్ ముదిరాజ్ నాయి బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీరాములు వెంకటన్న గౌడ్ హోటల్ కురుమూర్తి విజయ్ కుమార్ శివశంకర్ ఊసన్న యాదవ్ నాయి బ్రాహ్మణ సేవా సంఘం మండల అధ్యక్షులు పట్టణ అధ్యక్షులు మరియు నాయి బ్రాహ్మణ నాయి బ్రాహ్మణ కుటుంబ సభ్యులు మరియు బిసి కులాల సంఘ నాయకులు పాపయ్య గారి కృష్ణారెడ్డి, మేస్త్రి శ్రీనివాసులు, వనపర్తి కృష్ణారెడ్డి , బాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## బాలికలే దేశ శక్తి... బాలికలకు కీసర అండ..



**బాలికలే భవిష్యత్: చదువు, చైతన్యమే సమాజానికి బలం...**

**భద్రతకు అధికారుల అండ పోలీస్ శాఖ ఎల్లప్పుడూ తోడుగా...**

**బేటీ బచావో–బేటీ పడావో: నినాదం కాదు, ఆచరణ కావాలి...**

**కీసర జనవరి 24 ,( సిటీ టైమ్స్ ) :**

బాలికలే భవిష్యత్...సమాజానికి అసలైన శక్తి జాతీయ బాలికల దినోత్సవం సందేశం,సాధికారతే లక్ష్యం. ఒక ఆడపిల్ల చిరునవ్వులోనే కుటుంబ భవిష్యత్ దాగి ఉందన్న సత్యాన్ని గుర్తుచేసే రోజు జాతీయ బాలికల దినోత్సవం..బాలికల విద్య, భద్రత, సమాన హక్కులు సమాజ ప్రగతికి ఎంత అవసరమో ఈ దినోత్సవం మరోసారి స్పష్టం చేసింది..బాలికలను కాపాడటం మాత్రమే కాదు, వారిని చదివించడం, ధైర్యంగా నిలబెట్టడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఈ రోజు దేశవ్యాప్తంగా చర్చకు వచ్చింది..బేటీ బచావో, బేటీ పడావో నినాదం ఆచరణలోకి రావాల్సిన అవసరాన్ని ఈ దినోత్సవం బలంగా చాటుతోంది..

ఈ సందర్భంగా కీసరలో జరిగిన కార్యక్రమంలో సీఐ ఆంజనేయులు మాట్లాడుతూ, కీలక సందేశం ఇచ్చారు.. బాలికల భద్రత విషయంలో పోలీస్ శాఖ ఏమాత్రం రాజీ పడదు,ఆడపిల్లపై అన్యాయం జరిగితే వెంటనే స్పందించే బాధ్యత మాది..బాలికలు భయపడకుండా చదువులో, జీవితంలో ముందుకు సాగాలి,వారి రక్షణకు పోలీస్ శాఖ ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు.. అదే విధంగా ఎస్సై లక్ష్మణ్ మాట్లాడుతూ, చదువుకున్న బాలికే బలమైన సమాజానికి పునాది.. బాలికలకు విద్య అందితే కుటుంబం, గ్రామం, దేశం అభివృద్ధి చెందుతుంది, ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని బాలికలు అన్ని రంగాల్లో రాణించాలని అన్నారు.. జాతీయ బాలికల దినోత్సవం కేవలం ఒక వేడుకగా కాకుండా, ఒక ఉద్యమంగా మారాల్సిన అవసరాన్ని కీసరలో జరిగిన కార్యక్రమం స్పష్టంగా చాటింది. బాలికల భద్రత, విద్య, గౌరవం,ఇవే సమాజ ప్రగతికి అసలైన కొలమానాలు అన్న సందేశం ప్రజల్లో బలంగా నాటుకుంది..ప్రభుత్వ అధికారులు, విద్యాసంస్థలు, పోలీస్ యంత్రాంగం కలసి బాలికల సాధికారతకు అండగా నిలిస్తేనే నిజమైన మార్పు సాధ్యమన్న విశ్వాసాన్ని ఈ కార్యక్రమం మరింత బలపరిచింది..ఆడపిల్లకు రక్షణ కాదు, అవకాశాలు కావాలి, అప్పుడే దేశ భవిష్యత్ సురక్షితంగా

## జాతీయ పండుగకు సిద్ధమవుతున్న కేసీఆర్ నగర్

**తెల్లాపూర్ , జనవరి 24 (సిటీటైమ్స్):**

తెల్లాపూర్ కార్పొరేషన్ పరిధిలోని కేసీఆర్ నగర్‌లో నిర్వహించనున్న గణతంత్ర దినోత్సవ వేడుకలను విజయవంతం చేయాలని తెల్లాపూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ మల్లేపల్లి సోమిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా జాతీయ జెండా ఆవిష్కరణతో పాటు ప్రత్యేక సభను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కావున కేసీఆర్ నగర్ ఫేజ్ 1, 2, 3కు చెందిన ప్రజలు, అడ్మిన్స్, ప్రసిడెంట్స్, జిఎస్, పిల్లలు, పెద్దలు, పెద్ద ఎత్తున పాల్గొని గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించి విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



## ప్రజలకు అందుబాటులోకి వాణిజ్య, సామాజిక సదుపాయాలు



**పటాన్‌చెరు, జనవరి 24 (సిటీటైమ్స్):**

పటాన్‌చెరు నియోజకవర్గం భారతి నగర్ డివిజన్‌లో రూ.10 కోట్లకు పైగా వ్యయంతో చేపట్టిన అభివృద్ధి పనులను హైదరాబాద్ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి గారు ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా రూ.5.77 కోట్లతో నిర్మించిన 104 దుకాణాల బజార్, రూ.2.47 కోట్లతో నిర్మించిన ఫంక్షన్ హాల్‌ను ప్రారంభించగా, రూ.1.20 కోట్లతో కమ్యూనిటీ హాల్‌కు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్, జోనల్ కమిషనర్ హేమంత్, మాజీ ప్రోటెం చైర్మన్ భూపాల్ రెడ్డి, గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ అంజి రెడ్డి, పటాన్చెరు నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ ఆదర్శ రెడ్డి, భారతి నగర్ డివిజన్ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# చట్టాల బలంతో బాలికల భవిష్యత్తు..

*** బాలికల భద్రతపై న్యాయస్థానాల స్ట్రాంగ్ స్టాండ్..**

*** చట్టాలే కవచం...విద్యే బాలికలకు బలం..**

*** జాతీయ బాలికల దినోత్సవానికి న్యాయ చైతన్య ఘన సందేశం..**

**కుషాయిగూడ జనవరి 24, (సిటీ టైమ్స్)**

తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో, మల్కాజ్గిరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి బాల భాస్కర్ ఆదేశాల మేరకు జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకొని కుషాయిగూడలోని సాయి సుధీర్ విద్యా సంస్థలో న్యాయ చైతన్య సదస్సు ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా న్యాయమూర్తి బాల భాస్కర్ మాట్లాడుతూ, బాలికల హక్కుల పరిరక్షణే న్యాయస్థానాల ప్రధాన బాధ్యత. బాలికలపై జరిగే అన్యాయాలను అడ్డుకోవడానికి చట్టాలు బలంగా ఉన్నాయనీ, వాటిని తెలుసుకొని ధైర్యంగా ముందుకు రావాల్సిన అవసరం ఉందని తెలిపారు..

బాల్య వివాహాలు, వరకట్న వేధింపులు, లింగ వివక్ష వంటి సామాజిక దురాచారాలను నిర్మూలించడంలో న్యాయ వ్యవస్థ కీలక పాత్ర పోషిస్తోందని ఆయన స్పష్టం చేశారు..అనంతరం డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మీరా రాణి బాలికలను ఉద్దేశించి మాట్లాడుతూ, విద్యే బాలికలకు అసలైన సంపద. చదువుతోనే ఆత్మవిశ్వాసం, స్వావలంబన వస్తాయి. సాయి సుధీర్ విద్యా సంస్థ బాలికల భవిష్యత్తు నిర్మాణమే లక్ష్యంగా నాణ్యమైన విద్యతో పాటు విలువలను అందిస్తోంది" అని పేర్కొన్నారు.

బాలికలు తమ హక్కులపై అవగాహన పెంచుకొని సమాజంలో నాయకత్వ పాత్ర పోషించాలని ఆమె పిలుపునిచ్చారు..ఈ న్యాయ చైతన్య సదస్సులో కళాశాల విద్యార్థినిలకు బాల్య వివాహాల నిరోధక చట్టం, వరకట్న నిషేధ చట్టం, లింగ నిర్ధారణ నిషేధ చట్టం,

రాష్ట్ర ప్రభుత్వం బాలికల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలపై విస్తృత అవగాహన కల్పించారు.. ఈ కార్యక్రమంలో న్యాయ సహాయ రక్షణ సలహాదారు వెంకటరమణ, గోపాల్ రెడ్డి, గౌరిత, సమాధుల్లాహ్, ధనజ, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మహాలక్ష్మి మమ్మ, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

బాలికలు భద్రంగా, స్వావలంబనతో ఎదిగితేనే సమాజం బలపడుతుందన్న స్పష్టమైన సందేశంతో ఈ కార్యక్రమం ముగిసింది..







# విద్యార్థులు కొత్త ఆలోచనల పై దృష్టి సారించి సాంకేతిక రంగంలో ఎదగాలి: లప్లీ బెన్నీ



**వనపర్తి జనవరి 24 (సిటీ టైమ్స్)**

వనపర్తి జిల్లా కేంద్రంలోని వల్లబ్ నగర్ గౌతమ్ మోడల్ హైస్కూల్లో వైజ్ఞానిక ప్రదర్శన కార్యక్రమానికి 400 మంది విద్యార్థులు హాజరయ్యారు. మొత్తం 174 వైజ్ఞానిక ప్రదర్శనలు ఇక్కడ ప్రదర్శించారు.ఈ సందర్భంగా స్కూల్ ప్రిన్సిపాల్ లప్లీ బెన్నీ మాట్లాడుతూ విద్యార్థులు చిన్ననాటి నుంచి కొత్త కొత్త ఆలోచనలపై దృష్టి సాధించి సాంకేతిక రంగంలో ఎదగాలన్నారు. రోజురోజుకు సాంకేతిక పరంగా అనేక మార్పులు వస్తున్నాయని, వాటికి అనుగుణంగా కొత్త ఆలోచనలకు పదును పెట్టాలన్నారు. సైన్స్ అంటేనే నిజం అని, సైన్స్ ద్వారా ప్రపంచంలో ప్రకృతిలో దాగి ఉన్న నిజాలను తెలుసుకోవచ్చని చెప్పారు. సైన్స్ ను అలవర్చుకుంటే జీవితంలో ముందుకు వెళ్ళగలమని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ బెన్నీ జోసెఫ్, మరియు స్కూల్ టీచర్లు విద్యార్థులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యం...




**- మియాపూర్ ట్రాఫిక్ ఏసీపీ వెంకటయ్య**

**పటాన్‌చెరు, జనవరి 24 (సిటీటైమ్స్):**

రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యమని మియాపూర్ ట్రాఫిక్ ఏసీపీ వెంకటయ్య అన్నారు. రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా శనివారం పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్ ఆధ్వర్యంలో ఇస్నాపూర్ మజీద్ సమీపంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మియాపూర్ ట్రాఫిక్ ఏసిపి వెంకటయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు.దూరప్రాంతాలకు ప్రయాణించే సమయంలో తప్పనిసరిగా సీట్ బెల్ట్ ధరించాలని అదేవిధంగా ద్విచక్ర వాహన దారుడు అయితే తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. వాహనా దారులు వాహనాలను వేగంగా నడపకూడదని, మద్యం సేవించి, సెల్ ఫోన్ మాట్లాడుతూ ఎట్టి పరిస్థితిలో వాహనం నడపకూడదని సూచించారు.చిన్న నిర్లక్ష్యం కూడా పెద్ద ప్రమాదానికి దారి తీస్తుందని వాహనాదారులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పటాన్ చెరు ట్రాఫిక్ సీఐ లాలూ నాయక్, ఎస్ఐ లు ఆంజనేయులు, పవన్, సిద్దయ్య, ట్రాఫిక్ సిబ్బంది, వాహనదారులు పాల్గొన్నారు.

# క్రిస్టియన్ల సంక్షేమానికి కృషి...

**- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**

**పటాన్‌చెరు, జనవరి 24 (సిటీటైమ్స్):**

పటాన్ చెరు నియోజకవర్గ పరిధిలోని క్రిస్టియన్ ల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. పటాన్ చెరు నియోజకవర్గం పరిధిలోని చర్చిల కోసం రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన 10 లక్షల 80 వేల రూపాయల విలువైన చెక్కులను శనివారం సాయంత్రం ఆయా చర్చిల పాస్టర్లకు ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అనివార్య కారణాల మూలంగా చెక్కుల పంపిణీ ఆలస్యం జరిగిందని తెలిపారు. రెండు విడతలలో మొత్తం 70 చర్చి లకు 21 లక్షల రూపాయలను అందచేయడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వం నుండి మంజూరైన ప్రతి పై సాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పటాన్ చెరు డిప్యూటీ కమిషనర్ జ్యోతి రెడ్డి, మెప్మ డిపిఓ స్వాతి, సిఓలు రేఖా, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



# అమ్మను హత్తుకునేలోపే.. విద్యుత్ తీగను పట్టుకున్నాడు



**మహబూబాబాద్ రూరల్ సిటి టైమ్స్ జనవరి 24**

పొలం పనులతో అలసిపోయిన ఆ తండ్రి.. తన నాలుగేళ్ల కుమారుడితో సరదాగా కాసేపు ఆడుకొని సేదతీరాడు. ఇక చాలు.. అమ్మ దగ్గరకు పోదాం పదా అని బాలుడిని భుజాల మీదకు ఎత్తుకొని బయలుదేరాడు. కబుర్లు చెప్పుకొంటూ తన వద్దకు వస్తున్న వారిద్దరినీ చూసి అతని భార్య మురిసిపోసాగింది. కానీ.. అంతలోనే పెద్దగా కేకలు వేస్తూ.. గుండెలు బాదుకుంటూ పరుగు తీస్తూ వెళ్లింది. ఆమె వెళ్లేసరికి తండ్రీతనయులిద్దరూ వ్యవసాయ బావిలో విగతజీవులుగా కనిపించారు. తండ్రి భుజాల మీదున్న కొడుకు పొరపాటున విద్యుత్ తీగను పట్టుకోవడంతో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. మహబూబాబాద్ మండలం బలరాంతండాకు చెందిన కేలోత్ మదన్(32) భార్య అనిత, చిన్నకుమారుడు లక్షిత్(4)తో కలిసి శనివారం వారి వ్యవసాయక్షేత్రానికి వెళ్లారు. మదన్ ట్రాక్టరుతో దుక్కి దున్నిన తరువాత కుమారుడితో ఆడుకొన్నారు. తరువాత బాలుడిని తన భుజాలపై ఎత్తుకొని తీసుకెళ్తుండగా.. అతను తన తలపై కనిపించిన వ్యవసాయ మోటారుకు సంబంధించిన విద్యుత్తు తీగను పట్టుకోవడంతో ఇద్దరూ విద్యుదాఘాతానికి గురై పక్కనే ఉన్న వ్యవసాయ బావిలో పడ్డారు. అనిత, సమీపంలోని రైతులు వెళ్లేసరికి ఇద్దరూ నీటిలో మునిగిపోయారు. స్థానికులు, అగ్నిమాపక సిబ్బంది వారి మృతదేహాలను వెలికితీశారు. కళ్ల ముందే భర్త, కుమారుడు మృతిచెందడంతో అనిత రోదనలు చూపరులను కంటతడి పెట్టించాయి. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ప్రమాదానికి గల కారణాలను తెలుసుకున్నారు.

# వ్యవసాయ యాంత్రీకరణ తో అధిక ఉత్పత్తులు...



**- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**

**- 64 మందు రైతులకు 20 లక్షల రూపాయల సబ్సిడీపై వ్యవసాయ యంత్ర పరికరాల పంపిణీ**

**పటాన్‌చెరు, జనవరి 24 (సిటీటైమ్స్):**

ఆధునిక వ్యవసాయంలో వ్యవసాయ యాంత్రీకరణ కీలకపాత్ర పోషిస్తుందని.. రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం సబ్సిడీతో వ్యవసాయ యాంత్రికరణ పరికరాలు అందిస్తుందని.. ఈ అవకాశాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పటాన్ చెరు నియోజకవర్గ పరిధిలోని రైతులకు సబ్సిడీ పైన మంజూరైన వివిధ రకాల వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలను శనివారం సాయంత్రం పటాన్ చెరు డివిజన్ పరిధిలోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి చేతుల మీదుగా రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వ్యవసాయ రంగంలో సాంప్రదాయ పద్ధతులతో వ్యవసాయం చేయడం మూలంగా తక్కు వ దిగుబడి తోపాటు అధిక ఖర్చు మూలంగా రైతు నష్టపోతున్నారని తెలిపారు. కృత్రిమ మేదస్సు ద్వారా తయారైన యంత్రాలు వాడకం ద్వారా సాగు వ్యయం తగ్గడం తో పాటు ఉత్పత్తుల పెరుగుతున్నాయని తెలిపారు. ప్రతి యంత్ర పరికరం పై ప్రభుత్వం 40 శాతం సబ్సిడీ అందిస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా 64 మంది రైతులకు 20 లక్షల రూపాయల సబ్సిడీతో 27 లక్షల రూపాయల విలువైన వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో వెలిమల ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్మన్ బుచ్చిరెడ్డి, వ్యవసాయ శాఖ ఏడి మనోహర, వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు

# ప్రజలకు మెరుగైన విద్యుత్ సేవలు అందించడమే లక్ష్యం...



**- విద్యుత్ శాఖ ఎస్ఈ సుధీర్ కుమార్**

**- ప్రజా బాట ద్వారా సమస్యల పరిష్కారం...**

**పటాన్‌చెరు, జనవరి 24 (సిటీటైమ్స్):**

ప్రజలకు మెరుగైన విద్యుత్ సేవలు అందించడమే లక్ష్యం అని,ప్రజా బాట ద్వారా ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని సకాలంలో పరిష్కరించాలనే లక్ష్యంతో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో 'ప్రజా బాట' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని విద్యుత్ శాఖ ఎస్ఈ సుధీర్ కుమార్ అన్నారు. శనివారం ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలోని చిట్కుల్ లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈ కార్యక్రమాన్ని వారానికి మూడు రోజుల పాటు కొనసాగిస్తున్నారు.కార్యక్రమంలో భాగంగా అధికారులు గ్రామాలు, కాలనీల్లో పర్యటించి ప్రజల నుంచి సమస్యలను స్వీకరిస్తున్నారు. అలాగే 11 కె.వి లైన్ లు, డిటిఆర్ నిర్మాణాలను పరిశీలించి, లోపాలను గుర్తించడం జరుగుతుందన్నారు. గుర్తించిన సమస్యలను అక్కడికక్కడే సరిదిద్దడం ద్వారా విద్యుత్ సరఫరాలో అంతరాయాలు తగ్గించేందుకు చర్యలు చేపడుతున్నామని,

ఈ కార్యక్రమంతో ప్రజలకు మెరుగైన విద్యుత్ సేవలు అందడంతో పాటు శాఖ పై నమ్మకం మరింత పెరుగుతోందని తెలిపారు.

అనంతరం చిట్కుల్ మాజీ ఉప్ప సర్పంచ్ విష్ణువర్ధన్ రెడ్డి ఇచ్చిన వినతి పత్రాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ డీ.ఈ నెహ్రూ నాయక్, ఏఈ వీరాంజనేయులు, సబ్ ఇంజనీర్ రాఘవేందర్, సిబ్బంది పాల్గొన్నారు.

# బెట్టింగ్‌కు బానిసై.. ఆర్థికంగా నష్టపోయి..

**సారంగాపూర్, సిటి టైమ్స్ జనవరి 24**

ఆన్‌లైన్ బెట్టింగ్, వ్యాపారంలో నష్టాలతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన శనివారం నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలం చించోలి(బి)లో చోటుచేసుకుంది. సారంగాపూర్ ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. నిర్మల్ గ్రామీణ మండలం రాణాపూర్ గ్రామానికి చెందిన జాదవ్ ప్రేమ్‌కుమార్(39) గత పదేళ్లుగా గ్రామంలో ఎరువుల వ్యాపారం చేస్తున్నాడు. అతడి తండ్రి తారాసింగ్ ఏఎస్సైగా పనిచేస్తున్నాడు. ప్రేమ్‌కుమార్‌కు భార్య, ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కొన్నేళ్లుగా ఆన్‌లైన్ బెట్టింగ్‌కు బానిసైన అతను వ్యాపారంలోనూ దెబ్బతిన్నాడు. అన్నీ కలిపి రూ.70 లక్షల వరకు నష్టపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురైన ప్రేమ్‌కుమార్ శుక్రవారం మధ్యాహ్నం నుంచి కనిపించకుండా పోయాడు. కుటుంబ సభ్యులు, స్నేహితులు వెతకగా శనివారం సారంగాపూర్ మండలం చించోలి(బి) మైనార్టీ గురుకుల విద్యాలయం సమీపంలో శవమై కనిపించాడు. కుడిచేతి మణికట్టుపై బ్లేడుతో కోసుకోవడంతో తీవ్ర రక్తస్రావమై మృతిచెందినట్లు అనుమానిస్తున్నారు. పక్కనే పురుగుల మందు డబ్బా సైతం ఉంది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నిర్మల్ ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు.

# జర్నలిజంలో నిబద్ధతకు గుర్తింపు..

## పటేల్ నర్సింహులు యాదవ్‌కు ఘన సన్మానం...




**కీసర జనవరి 24,(సిటీ టైమ్స్):**

నవతెలంగాణ హైదరాబాద్ రీజియన్ సమావేశంలో చర్లపల్లి రిపోర్టర్‌గా ఉత్తమ పనితీరు కనబర్చినందుకు పటేల్ నర్సింహులు యాదవ్ ను ఘనంగా సన్మానించారు. జర్నలిజం వృత్తిలో నిబద్ధతతో రాణిస్తూ.. వార్తా రంగంలో చూపిన ప్రతిభకు గుర్తింపుగా నవతెలంగాణ సీజీఎం ప్రభాకర్, జనరల్ మేనేజర్ లింగారెడ్డి చేతులమీదుగా పటేల్ నర్సింహులు యాదవ్ ను సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మెఫిషియల్ ఇంచార్జ్ వేణుమాధవ్, మేనేజర్లు భరత్, ఉపేందర్, డెస్క్ ఇంచార్జ్ శివ కిరణ్ తదితరులు పాల్గొని అభినందనలు తెలిపారు.

# కర్నూలులో కలకలం.. ప్రియుడి భార్యకు వైరస్ ఇంజెక్షన్ ఇచ్చిన మాజీ ప్రియురాలు

కర్నూలు: తాను ప్రేమించిన వ్యక్తి మరో మహిళను పెళ్లి చేసుకున్నాడని అతని భార్యకు మాజీ ప్రియురాలు వైరస్ ఇంజెక్షన్ ఇచ్చిన ఘటన కర్నూలు నగరంలో కలకలం రేపింది. కర్నూలుకు చెందిన ఓ వైద్యుడు.. ఆదోనికి చెందిన యువతి కొన్నేళ్లుగా ప్రేమికులుగా ఉండి ఆ తర్వాత విడిపోయారు. ఈ క్రమంలో వైద్యుడు.. మరో మహిళా డాక్టర్‌ను పెళ్లి చేసుకున్నారు. ఆమె కర్నూలు వైద్య కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తుండగా.. భర్త కర్నూలులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో పనిచేస్తున్నారు.ఈ క్రమంలో తాను ప్రేమించిన వ్యక్తి మరో మహిళను పెళ్లి చేసుకోవడాన్ని జీర్ణించుకోలేక వారి ఇద్దరినీ విడదీయాలని మాజీ ప్రియురాలు కుట్ర పన్నింది. అందులో భాగంగా ఈనెల 9న మహిళా వైద్యురాలు విధులు ముగించుకొని మధ్యాహ్నం ఇంటికి వెళ్తుండగా నలుగురు వ్యక్తులు వచ్చి ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టి కిందపడేలా చేశారు. కింద పడిన ఆమెకు సహాయం చేస్తున్నట్లు నటించి ఆటో ఎక్కిస్తూ ఓ వైరస్(HIV) ఎక్కించారని కర్నూలు డీఎస్పీ బాబు ప్రసాద్ తెలిపారు. ఈ ఘటనపై భాదితురాలి భర్త పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న 3వ పట్టణ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఘటనా స్థలం వద్ద సీసీ కెమెరాల సాయంతో నిందితులను గుర్తించి అరెస్ట్ చేశారు. ఈ కేసులో మాజీ ప్రియురాలితో పాటు నలుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు డీఎస్పీ తెలిపారు.



# వెంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి మరో రూ 4 కోట్లు మంజూరు...

**కోటి రూపాయలతో కొనసాగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి...**

**వనపర్తి సిటీ టైమ్స్ జనవరి 24**

వనపర్తి పట్టణంలో శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంకు వచ్చే సంవత్సరం నాటికి 50 వసంతాలు పూర్తయితాయని ఈ సందర్భంగా ఆలయాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసేందుకు మరో రూ. 4 కోట్లు తీసుకురానున్నట్లు వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. శనివారం వనపర్తి పట్టణంలోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో 1 కోటి రూపాయల వ్యయంతో కొనసాగుతున్న పలు అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఇదే వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఆవరణలో పెరిగిన వ్యక్తి నని ఇక్కడి సమస్యలు ఆయన దృష్టిలో ఉన్నాయని ఆయన అభివృద్ధికి ఆయన అన్ని రకాల సహాయ సహకారాలు అందించేందుకు సుముఖంగా ఉన్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు ముఖ్యమంత్రి హోదాలో ఆలయానికి వచ్చిన ఆయన మొదటి విడతగా కోటి రూపాయలను మంజూరు చేయించారని అందుకు సంబంధించిన పనులు కొనసాగుతున్నాయని ఎమ్మెల్యే చెప్పారు చదువుకునే రోజుల్లో నేను కూడా ఈ ఆవరణలో తిరుగాడిన వ్యక్తి నేనని నా వంతుగా ఆ భగవంతుడు సేవకు ప్రయత్నం చేస్తానని ఆలయాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తాన ని ఎమ్మెల్యే పేర్కొన్నారు కార్యక్రమంలో వనపర్తి మార్కెట్ యార్డ్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, లక్కాకుల సతీష్, ఎస్ ఎల్ ఎన్ రమేష్, మాజీ కౌన్సిలర్లు వెంకటేష్, జంపన్న, బ్రహ్మం చారి, యాదగిరి, ఆలయ కమిటీ సభ్యులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు





## నిమ్స్ ప్రాంగణంలో వీధి దీపాల ప్రారంభోత్సవం



**పంజాగుట్ట, జనవరి 24,(సిటీ టైమ్స్):**

నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్) ప్రాంగణంలో, హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ హెమ్ డి ఎ) ఆధ్వర్యంలో రూ.4 కోట్ల వ్యయంతో చేపట్టిన అభివృద్ధి మరియు సుందరీకరణ పనుల్లో భాగంగా ఏర్పాటు చేసిన ఎలక్ట్రిక్ వీధి దీపాల ప్రారంభోత్సవ కార్యక్రమం శనివారం సాయంత్రం ఘనంగా జరిగింది.నిమ్స్ స్పెషాలిటీ బ్లాక్ సర్కిల్ (బుద్ధ విగ్రహం సమీపంలో) వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ డా. ఎన్. భీరప్ప దీపాలను ప్రారంభించారు.ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ, హెచ్ హెమ్ డి ఎ చేపట్టిన రూ.4 కోట్ల అభివృద్ధి ప్రాజెక్ట్‌లో భాగంగా ఏర్పాటు చేసిన ఈ వీధి దీపాల వల్ల నిమ్స్ ప్రాంగణంలో రాత్రి వేళల్లో భద్రత మరింత మెరుగవుతుందని తెలిపారు. రోగులు, వారి సహాయకులు, వైద్య సిబ్బంది, ఉద్యోగులు, సందర్శకులకు ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ అభివృది సుందరీకరణ పనులకు సహకరించిన హెచ్ హెమ్ డి ఎ అధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో డా.చీఫ్ ఇన్ఫర్మేషన్ కమిషనర్ జి . చంద్రశేఖర్ రెడ్డి , అడిషనల్ మెడికల్ సూపరింటెండెంట్ లక్ష్మి భాస్కర్, డా. గంగాధర్, డా.చరణ్ రాజ్, డా.నిఖిల్, కేజియా, ఆసుపత్రి సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.హెచ్ హెమ్ డి ఎ చేపట్టిన ఈ సుందరీకరణ మరియు మౌలిక సదుపాయాల అభివృద్ధి కార్యక్రమాలు నిమ్స్ ప్రాంగణానికి మరింత భద్రతతో పాటు ఆకర్షణను తీసుకువస్తాయని అధికారులు తెలిపారు.

## చంపాపేట్‌కు తీరని లోటు...

*** బీజేపీ కార్పొరేటర్ వంగ మధుసూదన్ రెడ్డి అకాల మృతి..**
*** ప్రజాసేవకు అంకితమైన నాయకుడి అకాల మృతి...**
*** చంపాపేట్‌లో విషాదం.**
**అందుబాటులో ఉండే కార్పొరేటర్ మృతి... బీజేపీకి తీరని లోటు.**

**చంపాపేట్ జనవరి 24 ,(సిటీ టైమ్స్)**

:ఎల్‌బీ నగర్ నియోజకవర్గ పరిధిలోని చంపాపేట్ డివిజన్ బీజేపీ కార్పొరేటర్ వంగ మధుసూదన్ రెడ్డి, ఆకస్మిక మరణం రాజకీయ, ప్రజా వర్గాల్లో తీవ్ర విషాదాన్ని నింపింది.. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన హైటెక్ సిటీలోని స్టార్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం పరిస్థితి విషమించడంతో తుదిశ్వాస విడిచినట్లు వైద్య వర్గాలు వెల్లడించాయి..ఈ విషాద వార్త వెలువడగానే చంపాపేట్ డివిజన్ మొత్తం శోకసంద్రంలో మునిగిపోయింది. బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తీవ్ర దిగ్భ్రాంతికి గురై ఆసుపత్రి వద్దకు చేరుకున్నారు.. ఒక్కసారిగా చోటుచేసుకున్న ఈ దుర్ఘటన పార్టీ శ్రేణుల్లో తీవ్ర దిగులును మిగిల్చింది.. వంగ మధుసూదన్ రెడ్డి ప్రజాసేవను ధ్యేయంగా చేసుకున్న ప్రజాప్రతినిధిగా చంపాపేట్‌లో ప్రత్యేక గుర్తింపు పొందారు. డివిజన్ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తూ, ప్రజల సమస్యలపై వెంటనే స్పందించే నాయకుడిగా ఆయన పేరు తెచ్చుకున్నారు. తాగునీరు, రహదారులు, పారిశుధ్యం వంటి మౌలిక వసతులపై అధికారులను నిలదీస్తూ, సమస్యల పరిష్కారానికి అహర్నిశలు శ్రమించిన కార్పొరేటర్‌గా ప్రజల హృదయాల్లో నిలిచారు..ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉండే నాయకుడిగా, సాధారణ కార్యకర్త నుంచి సామాన్య పౌరుడివరకు అందరి అభిమానాన్ని సంపాదించారు..ప్రజల కోసం పనిచేసే కార్పొరేటర్ గా ఆయనకు చంపాపేట్‌లో ప్రత్యేక గుర్తింపు ఉండేది..మధుసూదన్ రెడ్డి, అకాల మరణం బీజేపీకి తీరని లోటుగా మారిందని పలువురు పార్టీ నేతలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ కోసం, ప్రజల కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని, అలాంటి నాయకుడిని కోల్పోవడం బాధాకరమని పేర్కొన్నారు. మరోవైపు, చంపాపేట్ ప్రజల్లోనూ ఆయన మరణం తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ పలువురు భావోద్వేగానికి లోనవుతున్నారు..మధుసూదన్ రెడ్డి భౌతిక దేహాన్ని ప్రజల దర్శనార్థం కర్మన్‌ఘాట్‌కు తరలించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయనకు చివరి నివాళులు అర్పించేందుకు ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, స్థానికులు పెద్ద సంఖ్యలో తరలివచ్చే అవకాశముంది..ఇప్పటికే పలువురు ప్రజాప్రతినిధులు, బీజేపీ సీనియర్ నాయకులు, స్థానిక నేతలు కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు.

చంపాపేట్ అభివృద్ధికి అంకితమైన నాయకుడి అకాల మరణం...

ప్రజల గుండెల్లో చెరగని విషాదంగా మిగిలిపోయింది..



## గోపాల మిత్రల వేతనాలు పెంచాలి



**గోపాలమిత్ర సర్వీస్ అసోసియేషన్ అధ్యక్షుడు సింగం రాజు**

**హైదరాబాద్, జనవరి 24, (సిటీ టైమ్స్)**

గోపాల మిత్రల వేతనాలు పెంచి ఆదుకోవాలని గోపాల మిత్ర సర్వీస్ అసోసియేషన్ అధ్యక్షుడు సింగం రాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ యల్లంముళ్ళ శంబులింగం, ప్రధానకార్యదర్శి మల్లేష్ యాదవ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం అసోసియేషన్ కి నూతనంగా ఎన్నికైన ప్రతినిధి బృందం మంత్రులు వాకిటి శ్రీహరి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పోన్నం ప్రభాకర్, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ చిన్నారెడ్డి, పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ డాక్టర్ గోపి ఐఎఎస్ ను కలిసి వినతి పత్రం అందజేశారు. గోపాల మిత్రుల సమస్యలను పరిష్కరించి తమ బతుకుల్లో మార్పు తీసుకురావడానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు శ్రీరాములు, వెంకన్న నాయక్, అశోక్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## రెస్క్యూ ఆపరేషన్ ను పర్యవేక్షించిన మేయర్

**నాంపల్లి,సిటీ టైమ్స్:**



నాంపల్లిలోని బచాస్ ఫర్నిచర్ క్యసిల్లో ఫర్నిచర్ షాపులో శనివారం అగ్నిప్రమాదం జరిగిన నేపథ్యంలోనగరమేయర్ గద్వాల విజయలక్ష్మి ఘటన స్థలానికి చేరుకుని రెస్క్యూ ఆపరేషన్ పర్యవేక్షించారు.అధికారులను అడిగి ఘటన వివరాలు తెలుసుకన్నారు.

## పేదలకు అండగా సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ





**పెద్దమందడి సిటీ టైమ్స్ జనవరి 24**

పెద్దమందడి మండలం జగత్ పల్లి గ్రామంలో శనివారం రోజు లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు వైద్య ఖర్చులతో ఇబ్బంది పడుతున్న పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి (CMRF) భరోసానిస్తుందని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. శనివారం వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి ఆదేశాల మేరకు జగత్పల్లి గ్రామంలో లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను కాంగ్రెస్ సీనియర్ నాయకులు చవ్వ గట్టు యాదవ్ పంపిణీ చేశారు.గ్రామానికి చెందిన నలుగురు లబ్ధిదారులకు ప్రభుత్వం నుండి మంజూరైన మొత్తం రూ. 2,04,500 విలువ గల చెక్కులను అందజేశారు. ఇందులో ముఖ్యంగా అనారోగ్యంతో బాధపడుతున్నదాసరి రాములుకు రూ. 1,75,000 భారీ ఆర్థిక సాయం అందగా, భాషపాగా చెన్నమ్మకు రూ. 8,500, ముష్టి ఆంజనేయులుకు రూ. 8,500 మరియు మీడెం ఉషణయ్యకు రూ. 12,500 చెక్కులను నాయకులు అందజేశారు.ఈ సందర్భంగా చవ్వ గట్టు యాదవ్ మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ఎమ్మెల్యే మేఘారెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని, ఆపదలో ఉన్న వారికి సీఎంఆర్ఎఫ్ ఒక వరమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో గుంటి చంద్రయ్య సాగర్, జెనిగే నాగన్న యాదవ్, బి పర్వతాలు యాదవ్,శేషు యాదవ్, 1వ వార్డు మెంబర్ సాయి కుమార్, మేస్త్రి చంద్రయ్య, బీచుపల్లి సాగర్, ముంత తిరుపతయ్య, దాసరి మల్లేష్ యాదవ్, దాసరి రాజు, చెవ్వ చెన్నయ్య, గోపాల్ సాగర్, గౌనికాడి వెంకటేష్,చెవ్వ తిరుపతయ్య, నాగేంద్ర సాగర్, ఏ రాములు చెవ్వ నాగరాజు,చెవ్వ అశోక్,నక్క హరీష్ యాదవ్, తుపుడ ఆంజనేయులు పార్టీ కార్యకర్తలు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు

# నిమ్స్ లో సీవీట్స్ బూట్ క్యాంప్–2026 ప్రారంభం

**ఖైరతాబాద్, జనవరి 24,(సిటీ టైమ్స్):**

నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్), హైదరాబాద్‌లోని కార్డియోవాస్క్యులర్ అండ్ థొరాసిక్ సర్జరీ (సీవీట్స్) విభాగం ఆధ్వర్యంలో "సీవీట్స్ బూట్ క్యాంప్ - 2026" అనే ఇంటెన్సివ్ అకాడెమిక్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు.

"రిసెట్ | రీఇన్నోవేట్ | రిఫైన్" అనే థీమ్‌తో రూపొందించిన ఈ సీవీట్స్ బూట్ క్యాంప్ 2026 కార్యక్రమం, కార్డియోవాస్క్యులర్, థొరాసిక్ శస్త్రచికిత్స నిపుణులు, రెసిడెంట్లు మరియు శిక్షణార్థులకు సమగ్ర, ప్రాయోగికతోపాటు భవిష్యత్‌కు దిశానిర్దేశం చేసే లెర్నింగ్ వేదికగా నిలిచింది. ఆధునిక శస్త్రచికిత్సా పద్ధతులు, కార్డియోథొరాసిక్ చికిత్సలో చోటుచేసుకుంటున్న మార్పులు, అలాగే ఆధునిక వైద్య సాంకేతికతలపై ఈ కార్యక్రమంలో ప్రధానంగా దృష్టి సారించారు.

ఈ కార్యక్రమాన్ని జనవరి 24, 2026న, హైదరాబాద్‌కు చెందిన హెచ్.ఈ.హెచ్. నిజాం వారి మనవడు నవాబ్ నజాఫ్‌గఢ్ అలీ ఖాన్ లక్నోలోని ఇంటిగ్రల్ యూనివర్సిటీ వైద్య, ఆరోగ్య శాస్త్రాల విభాగం డీన్ డా. అభా చంద్ర ప్రారంభించారు. ఈ కార్యక్రమం సీవీట్స్ విభాగాధిపతి డా. ఎం. అమరేష్ రావు మార్గదర్శకత్వంలో, నిమ్స్ డైరెక్టర్ డా. ఎన్. భీరప్ప, డీన్ డా. లిజా రాజశేఖర్ మెడికల్ సూపరింటెండెంట్ డా. ఎన్. సత్య నారాయణ గారి ఆధ్వర్యంలో నిర్వహించబడింది.

ఈ సందర్భంగా నిర్వాహక కమిటీ మాట్లాడుతూ, ఈ బూట్ క్యాంప్ శిక్షణా విధానాలను వాస్తవ శస్త్రచికిత్స అనుభవంతో అనుసంధానం చేస్తూ, మెంటార్‌షిప్ మరియు సమన్వయపూర్వక అభ్యాసాన్ని ప్రోత్సహించే ఉన్నత స్థాయి విద్యా కార్యక్రమంగా రూపొందించబడిందని పేర్కొన్నారు.నిమ్స్‌లోని కార్డియోవాస్క్యులర్ అండ్ థొరాసిక్ సర్జరీ విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి దేశవ్యాప్తంగా ఎంబిబిఎస్ విద్యార్థులు, ఎంఎస్ మరియు పోస్ట్ఎం ఎస్ శిక్షణార్థులు, ఎం సి హెచ్ రెసిడెంట్లు, యువ సీవీట్స్ శస్త్రచికిత్స నిపుణులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ వర్క్‌షాప్‌లో 350 మందికి పైగా ప్రతినిధులు



## మారెమ్మ కుంటలో రూ 4 లక్షలతో హైమాస్ట్ లైట్ల ఏర్పాటు..





**ప్రారంభించిన ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి...**

**ఏళ్ల కొద్దిగా ఉన్న సమస్యకు పరిష్కారం...**

**వనపర్తి బ్యూరో సిటి టైమ్స్ జనవరి 24**

వనపర్తి పట్టణంలోని మారెమ్మ కుంట కూడలిలో, గాంధీచౌక్ ఉర్దూ మీడియం పాఠశాల కూడలిలో 4 లక్షల రూపాయల వ్యయంతో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను శనివారం వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి ప్రారంభించారు ఈ లైట్ల ఏర్పాటుతో దీర్ఘకాలికంగా ఉన్న సమస్య తీరిపోయిందని కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు ఎన్నో ఏళ్ల తరబడి అధికారుల ను, అడిగిన రాజకీయ నాయకులను అడిగిన ఈ లైట్లు ఏర్పాటు చేయలేదని నేడు కాంగ్రెస్ ప్రభుత్వం ఎమ్మెల్యే మేఘరెడ్డి ప్రత్యేక శ్రద్ధతో ఈ లైట్లు ఏర్పాటు చేయించడం హర్షించదగ్గ విషయమని వారన్నారు కార్యక్రమంలో వనపర్తి పట్టణ మాజీ కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు

# భారతి నగర్ రైతు బజార్ వినియోగారులకు అన్ని విధాలుగా ప్రయోజనకరం

**మేయర్ గద్వాల్ విజయలక్ష్మి**

**హైదరాబాద్, జనవరి 24,(సిటీ టైమ్స్ )**

:భారతి నగర్ రైతు బజార్ వినియోగారులకు అన్ని విధాలుగా ప్రయోజనకరంగా ఉంటుందని మేయర్ అన్నారు .గ్రేటర్ హైదరాబాద్ లోని అన్ని రైతు బజార్ లకు భారతి నగర్ రైతు బజార్ ఆదర్శంగా నిలవాలని మేయర్ ఆకాంక్షించారు. శనివారం శేరిలింగం పల్లి జోన్ సర్కిల్ 22 లోని భారతి నగర్ లో రూ.5 కోట్ల తో నిర్మించిన రైతు బజార్ కు, బాంబే కాలనీలో రూ.2 కోట్ల 47 లక్షలతో మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్ కు మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ప్రారంభించారు.అనంతరం ఎంఐజిలో రూ. కోటి 20 లక్షల రూపాయలతో నిర్మించనున్న కమ్యూనిటీ హాల్ కు మేయర్ శంకుస్థాపన చేశారు.ఎంఎల్ సి సి అంజిరెడ్డి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్, శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ గా బోర్కడే హేమంత్ సహదేవ్ రావు,కార్పొరేటర్ లు వి సింధు ఆదర్శ రెడ్డి, పుష్ప ఈ కార్యక్రమంలో మాట్లాడారు.ఈ సందర్భంగా మేయర్ గద్వాల్ విజయలక్ష్మి మాట్లాడుతూ.. భారతి నగర్ ఆధునిక రైతు బజార్ లో 4 కేటగిరీ షెడ్ లు. , ఒక్కో షెడ్ లో 26 స్టాల్స్ ఉంటాయన్నారు.షెడ్ 1 పండ్లు, పూల కోసం, షెడ్ 2 కూరగాయల కోసం, షెడ్ 3 చేపల విక్రయం కోసం, షెడ్ 4 మటన్ చికెన్ కోసం కేటాయించారని అన్నారు.

**అన్ని విక్రయాలు ఒకే చోట జరపడంతో**

వినియోగదారులకు ప్రయోజనకరంగా ఉంటుందన్నారు.ఇటు రైతులకు , అటు వినియోగదారులకు ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. వినియోగదారుల వాహనాలు నిలిపేందుకు సరిపడ స్థలంఉందన్నారు. ఈ రోజు ప్రారంభించుకున్న మల్టీపర్పస్ హాల్ పేద , మధ్యతరగతి శుభకార్యాల నిర్వహణకు అనుకూలంగా ఉంటుందన్నారు.



సిటీ టైమ్స్
తెలుగు దినపత్రిక

## కారుతో ఢీకొట్టి... తొక్కుకుంటూ వెళ్లి...



మహిళా ఎక్సైజ్ కానిస్టేబుల్‌పై గంజాయి ముఠా ఘాతుకం... పరిస్థితి విషమం
నిజామాబాద్‌లో వాహనాల తనిఖీ సందర్భంగా ఘటన

నిజామాబాద్ సిటి టైమ్స్ జనవరి 24

తనిఖీల సమయంలో వాహనాన్ని ఆపిన మహిళా ఎక్సైజ్ కానిస్టేబుల్‌ను గంజాయి ముఠాకు చెందిన దుండగులు కారుతో తొక్కుకుంటూ వెళ్లిన అమానవీయ ఘటన నిజామాబాద్‌లో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్(డీసీ) సోమిరెడ్డి శనివారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. ఓ కారులో గంజాయి రవాణా చేస్తున్నారన్న సమాచారంతో నిజామాబాద్ నగర శివారులోని మాధవనగర్‌లో ఎక్సైజ్ సీఐ స్వప్న, సిబ్బంది శుక్రవారం రాత్రి 7.30 గంటల సమయంలో తనిఖీలు చేపట్టారు. రెండు కార్లు అడ్డుపెట్టి... అనుమానిత వాహనాన్ని ఆపేందుకు ప్రయత్నించారు. ఓ కారులో వచ్చిన దుండగులు వాహనాన్ని ఆపినట్లే ఆపి... పారిపోయేందుకు యత్నించారు. ఎదురుగా నిల్చున్న కానిస్టేబుల్ జి.సౌమ్య(22)ను ఢీకొట్టి.. వాహనంతో తొక్కించుకుంటూ వెళ్లారు. ఈ క్రమంలో కారు అదుపుతప్పి రోడ్డు పక్కనున్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొని ఆగిపోయింది. అందులో ఉన్నవారిలో మతిన్, రహీద్ పారిపోగా... నిర్మల్‌కు చెందిన మైనర్(17), సయ్యద్ సోహైల్(27) పట్టుబడ్డారు. కారు ముందు టైరు పొత్తి కడుపు మీదుగా వెళ్లడంతో సౌమ్య ఛాతీ ఎముకలు విరిగాయి. ఒక కిడ్నీ దెబ్బతింది. నడుము భాగంతోపాటు పలు అవయవాలకు గాయాలయ్యాయి. ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఈ ఘటనతో సంబంధం ఉన్న నిజామాబాద్‌కు చెందిన అఫ్రోజ్‌పై కేసు నమోదైందని, నిందితులపై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు నిజామాబాద్ గ్రామీణ పోలీసులు తెలిపారు. కారులో మూడు కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు.

కానిస్టేబుళ్ల నిరసన..

గంజాయి ముఠాలను పట్టుకునే క్రమంలో మహిళా సీఐ, మాక్లూర్‌లోని ఐఎంఎల్ డిపో పాయింట్‌కు చెందిన మరో కానిస్టేబుల్ కలిసి సిబ్బందిని ఇబ్బంది పెడుతున్నారని నిజామాబాద్ ఎక్సైజ్ ఎస్‌హెచ్‌వో కార్యాలయం కానిస్టేబుళ్లు ఆరోపించారు. కానిస్టేబుల్ సౌమ్యకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ... ఎక్సైజ్ ఎస్‌హెచ్‌ఓ కార్యాలయం వద్ద వారు బైఠాయించారు. న్యాయం చేస్తామని డీసీ, సూపరింటెండెంట్ హామీ ఇవ్వడంతో నిరసనను విరమించారు. 'సీఐ, సిబ్బంది విధుల్లో భాగంగానే తనిఖీలకు వెళ్లారు. మాధవనగర్ ఘటనపై ప్రత్యేక విచారణ కమిటీ ఏర్పాటు చేస్తాం. ఈ ఘటనలో సిబ్బంది పొరపాటుపై ఆరోపణలు నిజమని తేలితే... నివేదిక ఆధారంగా వారిపై చర్యలు తీసుకుంటాం' అని డీసీ పేర్కొన్నారు.

## అమెరికాలో భార్య, బంధువులను చంపిన భర్త.. భయంతో దాక్కొన్న పిల్లలు



అమెరికాలో భారత సంతతికి చెందిన నలుగురు వ్యక్తులు హత్యకు గురయ్యారు (4 Indian origins Shot Dead in USA). కుటుంబ తగాదాల వల్ల ఓ వ్యక్తి తన భార్యతో పాటు బంధువులను కాల్చి చంపాడు. జార్జియాలోని లారెన్స్‌విల్లే నగరంలో శుక్రవారం ఉదయం (అమెరికా కాలమానం ప్రకారం) జరిగిన ఈ ఘటనకు సంబంధించి విజయ్ కుమార్ (51)ను పోలీసులు అరెస్టు చేశారు. మీడియా కథనాల ప్రకారం.. కాల్పుల విషయం పోలీసులకు ఫోన్‌కాల్ ద్వారా సమాచారం అందింది. వెంటనే అప్రమత్తమైన పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకోగా.. అక్కడ నలుగురు భారత సంతతి వ్యక్తులు విగత జీవులుగా పడి ఉండటాన్ని గుర్తించారు. కుటుంబ తగాదాల వల్లే విజయ్‌కుమార్ వారిని కాల్చి చంపాడని ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది. మృతులను కుమార్ భార్య మీను డోగ్రా (43), బంధువులు గౌరవ్ కుమార్ (33), నిధి చందర్ (37), హరీష్ చందర్(38)గా గుర్తించారు.

ఐదేళ్ల చిన్నారిని నిర్బంధించిన అమెరికా ఇమ్మిగ్రేషన్ అధికారులుకాల్పుల సమయంలో ఇంట్లో ముగ్గురు పిల్లలు ఉన్నారని, ఆత్మరక్షణ కోసం వారు ఒక గదిలో దాక్కున్నారని పోలీసులు తెలిపారు. వారిలో ఒకరు తమకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వడంతోనే.. విషయం వెలుగులోకి వచ్చిందన్నారు. పిల్లలను సురక్షితంగా వారి కుటుంబసభ్యులకు అప్పగించినట్లు వివరించారు. దీనిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించామన్నారు. ఇక, ఈ ఘటనపై అట్లాంటాలోని భారత కాన్సులేట్ జనరల్ దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. నిందితుడు అరెస్టయ్యాడని.. మృతుల కుటుంబాలకు అండగా ఉంటామని పేర్కొంది.

# రైతు పక్షపాతి ప్రభుత్వం కాంగ్రెస్...

**రైతుల రాయితీ పథకాలను ఎత్తేసిన ఘనత BRS పార్టీ ది...**

**రూ. 77 లక్షల 13 వేల రూపాయల రాయితీ ఉపకరణాల పంపిణీ...**

**రైతులకు రాయితీ ఉపకరణాల పంపిణీ కార్యక్రమంలో..**

**ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి...**

**వనపర్తి బ్యూరో సిటి టైమ్స్ జనవరి 24**



కాంగ్రెస్ పార్టీ ఆది నుంచి రైతు పక్షపాతిగానే పనిచేస్తుందని రైతు రుణమాఫీ, రాయితీపై వ్యవసాయ పనిముట్ల పంపిణీ, రాయితీపై విత్తనాల పంపిణీ, ఎరువుల పంపిణీ, డ్రిప్పు పైపుల పంపిణీ, స్పింకులర్ల పంపిణీ, ట్రాక్టర్ల పంపిణీ, కల్టివేటర్లు, రోటవేటర్లు మందుల పిచికారి యంత్రాలు లాంటి అనేక ఉపకరణాలను రాయితీపై అందిస్తుందని వీటి ద్వారా రైతులకు దాదాపు రూ . 20వేల నుంచి 50 వేల రూపాయలు వరకు లబ్ధి చేకూరుతుందని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు శనివారం వనపర్తి మండలం రైతు వేదికలో ఏర్పాటు చేసిన రైతులకు రాయితీపై వ్యవసాయ ఉపకారణాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు గత 10 ఏళ్ల BRS పాలనలో పాలకులు రైతుల పేరున అనేక మోసాలు చేశారని, అందుకు నిలువెత్తు సాక్ష్యమే ఈ రాయితీ వ్యవసాయ ఉపకరణాల పంపిణీ కార్యక్రమంను ఎమ్మెల్యే చెప్పారు కేవలం రైతుబంధు పేరుతో రైతులకు లక్షల రూపాయలు ఆదా అయ్యే ఇలాంటి వ్యవసాయ ఉపకరణాలపై రాయితీలను ఎత్తేసి కేవలం రైతుబంధు పేరుతో ఆడంబరాలు ప్రచారాలు చేశారే తప్ప వారు రైతులకు చేసింది ఏమీ లేదని ఆయన విమర్శించారు కాంగ్రెస్ ప్రభుత్వం మొదటినుంచి అన్నదాతల ఉపయోగార్థం కట్టిన ఎన్నో ప్రాజెక్టుల నుంచే నేటికి రైతులకు సాగునీరు అందుతుందని కేవలం కాలువలకు బొక్కలు పెట్టి మేము సాగునీరు తీసుకొచ్చామని చెప్పడం సిగ్గుచేటు అన్నారు గతంలో నిర్మించిన ప్రాజెక్టులకు బొక్కలు పెట్టి నీళ్లు తెచ్చామని పూలు చల్లిన నాయకులు రైతుల గురించి మాట్లాడడం హాస్యాస్పదమన్నారు రైతులకు రుణమాఫీ విషయంలో పదేళ్ల కలలో లక్ష రూపాయల రుణమాఫీ చేయని వ్యక్తులు నేడు రుణమాఫీ గురించి అనవసరమైన మాటలు మాట్లాడడం విడ్డూరమన్నారు రైతుల సౌకర్యార్థం వేలాడుతున్న విద్యుత్ తీగలు, స్తంభాలను, నియంత్రికులను ఇటీవల 50 కోట్ల రూపాయలు మంజూరు చేయించి సరి చేయించడం జరిగిందని ఎమ్మెల్యే తెలిపారు జిల్లాల పునర్వ్యవస్థీకరణకు, రద్దుకు తేడా తెలియని కొందరు నాయకులు ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని, ఒక్కో జిల్లా పరిధిలో మూడు నాలుగు నియోజకవర్గాలు కలిసి ఉండే పరిపాలన విధానానికి ఇబ్బందిగా ఉండడంతో అలాంటి జిల్లాలను పునర్వ్యవస్థీకరించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు చేపట్టిందని అవగాహన లేని కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని వారిని తిప్పికొట్టాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు వనపర్తి వేరుశనగ పంటకు ప్రపంచవ్యాప్త గుర్తింపు ఉందని ఇందుకు సంబంధించి వేరుశనగ పరిశోధన కేంద్రాన్ని గతంలో పెద్దమందడి మండలం వీరాయపల్లి గ్రామంలో నిర్మించ తలపెట్టామని వీటి పనులం కూడా అతి త్వరలోనే వేగవంతం చేయనున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు వేరుశెనగ పరిశోధన కేంద్రానికి సంబంధించిన పనులు నేను చేస్తే కొందరు సన్నాసులు వాటిపై కూడా



బిల్లులు చేసుకుని తిన్నారని ఆయన ఎద్దేవ చేశారు వేరుశనగ పంట కాపాడుకునేందుకు రైతులు రాత్రింబవళ్లు తీవ్ర ఇబ్బందులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఇట్టి విషయాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రివర్యుల దృష్టికి తీసుకువెళ్లి పంట పొలాలకు 50 శాతం రాయితీతో కంచ నిర్మాణం చేయించేందుకు తాను బాధ్యత తీసుకుంటానని ఎమ్మెల్యే పేర్కొన్నారు కార్యక్రమంలో వనపర్తి వ్యవసాయ మార్కెట్ యార్డ్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, వనపర్తి మాజీ ఎంపీపీ కిచ్చారెడ్డి, ఖిల్లా ఘణపురం సింగిల్ విండో అధ్యక్షులు మురళీధర్ రెడ్డి, డైరెక్టర్ సాయి చరణ్ రెడ్డి, మార్కెట్ డైరెక్టర్ శారద, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు రైతులు వ్యవసాయ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు

# రాజకీయాలకు పునాది యూత్ కాంగ్రెస్....

**సోషల్ మీడియా ప్రచారలో యూత్ కాంగ్రెస్ ముందుండాలి....**

**పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరు పని చేయాలి....**

**పార్టీ కోసం రోజు రెండు గంటల కేటాయించారు....**

**భావి భారత ప్రధానిగా రాహుల్ గాంధీ ని చేసేంతవరకు విశ్రమించకూడదు....**

**జిల్లా యూత్ కాంగ్రెస్ విస్తృత స్థాయి సమావేశంలో**

**ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి...**

**వనపర్తి బ్యూరో సిటి టైమ్స్ జనవరి 24**

యూత్ కాంగ్రెస్ నుంచి మొదలైన రాజకీయాలు చాలా పటిష్టంగా ఉంటాయని రాజకీయాలకు యూత్ కాంగ్రెస్ పునాది లాంటిదని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు శనివారం వనపర్తి పట్టణంలోని MYS ఫంక్షన్ హాల్ లో వనపర్తి జిల్లా యూత్ అధ్యక్షులు వాకిటి ఆదిత్య అధ్యక్షతన నిర్వహించిన జిల్లా యూత్ కాంగ్రెస్ విస్తృతస్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు యువకులు అనుకుంటే దేనినైనా సాధించగలరని వనపర్తి జిల్లా పరిధిలోని యూత్ కాంగ్రెస్ లో ఉన్న ప్రతి ఒక్కరు కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం పనిచేయాలని వారన్నారు అవినీతిమయమైన BRS పార్టీ సోషల్ మీడియాలో కాంగ్రెస్ ప్రభుత్వం పై దుష్ప్రచారాలు చేస్తుందని అలాంటి వాటిని యూత్ కాంగ్రెస్ యువకులు ఎప్పటికప్పుడు ఖండిస్తూ సోషల్ మీడియాలో చురుగ్గా ఉండాలని ఎమ్మెల్యే సూచించారు భావి భారత ప్రధానిగా రాహుల్ గాంధీ గారిని చేసేంతవరకు నిర్విరామంగా కృషి చేయాలని అందులో యువతనే ప్రధాన పాత్ర పోషించాలని ఎమ్మెల్యే యువకులకు సూచించారు ఇటీవల జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో వనపర్తి నియోజకవర్గంలో 40 మందికి పైగా సర్పంచులు యువకులేనని కాంగ్రెస్ పార్టీ యువకులకు అంత ప్రాధాన్యత ఇస్తుందని గమనించాలని వారు పేర్కొన్నారు వనపర్తి నియోజకవర్గ పరిధిలోని యువకులు నెలకు మారు యూత్ సమావేశాలు నిర్వహించాలని ఎమ్మెల్యే సూచించారు ప్రత్యక్ష రాజకీయాలపై ఆసక్తి ఉన్న యువకులకు సర్వేల ఆధారంగా అవకాశం ఇవ్వబడుతుందని ఎమ్మెల్యే సూచించారు గ్రామాల్లో రైతు కూలీలతో మమేకమైపోయి గ్రామాల్లోని సమస్యలను తెలుసుకొని తీర్చడంపై దృష్టి సారించాలన్నారు జిల్లాల పునర్విభజన పై అవగాహన లేని కొందరు BRS నాయకులు జిల్లాల రద్దు అంటూ ప్రజలను అయోమయానికి గురిచేస్తున్నారని అలాంటి వారికి బుద్ధి చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎమ్మెల్యే సూచించారు బేద అభిప్రాయాలు ఎన్ని ఉన్నా అందరూ కలిసి పనిచేసే కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి పాటుపడాలని ఆయన పేర్కొన్నారు విత్ ఐవైసీ యాప్ ను ఉపయోగించి మనం చేసే కార్యక్రమాలను నమోదు చేయాలన్నారు కార్యక్రమంలో వనపర్తి వ్యవసాయ మార్కెట్ యార్డ్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్ రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షులు జక్కిడి శివ చరణ్ రెడ్డి రాష్ట్ర యువజన కాంగ్రెస్ ఇంచార్జి సయ్యద్ ఖలీద్ యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు మాజీద్ వనపర్తి జిల్లా అధ్యక్షులు వాకిటి ఆదిత్య శివాంత్ రెడ్డి సుకన్య నియోజకవర్గంలోని ఆయా మండలాల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు యువకులు కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు






# సమాజంలో అట్టడుగు స్థాయిలో ఉన్న మైనారిటీ వర్గాల పిల్లలకు నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యం....

**తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ విద్యాసంస్థల సొసైటీ టీఎంఆర్ఈఐఎస్ (TMREIS) సెక్రటరీ బీ షఫీఉల్లా పేర్కొన్నారు.....**

**వనపర్తి బ్యూరో సిటి టైమ్స్ జనవరి 24**

శనివారం వనపర్తి జిల్లా కేంద్రంలోని కె.డి.ఆర్ నగర్‌లో గల తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ (టీఎంఆర్) జూనియర్ కళాశాలను టీఎంఆర్ఈఐఎస్ (TMREIS) సొసైటీ కార్యదర్శి షఫీవుల్లా, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా వారు ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించి, వారి విద్యా ప్రమాణాలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా టీఎంఆర్ఈఐఎస్ (TMREIS) సెక్రటరీ మాట్లాడుతూ సమాజంలో అట్టడుగు స్థాయిలో ఉన్న మైనారిటీ వర్గాల పిల్లలకు నాణ్యమైన విద్య అందించడమే తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ సొసైటీ లక్ష్యమని చెప్పారు. 2016లో ప్రారంభమైన ఈ సొసైటీ పదేళ్లు పూర్తి చేసుకుంటున్న తరుణంలో, విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించి సమాజ మార్పులో భాగస్వాములు కావాలని కోరారు. విద్యార్థులు చదువును మధ్యలోనే ఆపేయకుండా ఉన్నత చదువులను కొనసాగించాలని సూచించారు. ఇంటర్ తర్వాత నిర్వహించే వివిధ ప్రవేశ పరీక్షల (Entrance Exams) గురించి అవగాహన కలిగి ఉండాలని, ఉన్నత విద్యలో రాణించాలని దిశానిర్దేశం చేశారు.ప్రభుత్వం విద్యార్థులకు రెసిడెన్షియల్ సొసైటీ ద్వారా మంచి సదుపాయాలను కల్పిస్తోందని, విద్యార్థులు ఉన్నతమైన లక్ష్యాలు పెట్టుకుని, వాటిని సాకారం చేసుకునేందుకు నిరంతరం కష్టపడాలని కోరారు. చదువును ఎక్కడా ఆపకుండా ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. అదేవిధంగా తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ సొసైటీ పరిధిలోని అన్ని పాఠశాలలు కళాశాలలో 100% అడ్మిషన్లు అయ్యే విధంగా చొరవ తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. 100% అడ్మిషన్లు కావడమే కాకుండా 100% అత్యుత్తమ ఫలితాలను కూడా సాధించే విధంగా సిబ్బంది కృషి చేయాలన్నారు. 202627 విద్యా సంవత్సరానికి సంబంధించి అడ్మిషన్లను సద్వినియోగం చేసుకునేలా తల్లిదండ్రుల్లో సిబ్బంది నమ్మకాన్ని ఆత్మవిశ్వాసాన్ని కలగజేయాలన్నారు. జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ ప్రైవేటు విద్యాసంస్థల కన్నా ప్రభుత్వ రెసిడెన్షియల్ సొసైటీలలో సిబ్బంది మంచి కేర్ తీసుకొని విద్యార్థులకు బోధిస్తున్నట్లు చెప్పారు. తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ సొసైటీ పాఠశాలలు కళాశాలల్లో విద్యార్థులకు మంచి సదుపాయాలు అందిస్తున్నామని వాటిని సద్వినియోగం చేసుకొని మంచి ఫలితాలు సాధించే దిశగా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. విద్యార్థులు అత్యున్నత శిఖరాలను అధిరోహించే విధంగా విద్యను అందించాలని ప్రిన్సిపల్స్ కు కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ సొసైటీ పాఠశాలలు కళాశాలలో 202627 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం మైనారిటీ రెసిడెన్షియల్ సొసైటీ సిబ్బంది టీజీఎమ్ఆర్ఐఏఎస్ సెక్రటరీని, జిల్లా కలెక్టర్ ను శాలువాతో సత్కరించారు. జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి అఫ్జలుద్దీన్, ఆర్ ఎల్ సి ఖాజా, కేడిఆర్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ హవిలా రాణి, ఇతర అధికారులు తదితరులు ఉన్నారు.









## ముఖ్యమంత్రి సహాయనిధి పేద ప్రజలకు గొప్ప వరం; పిఏసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ



**శేరిలింగంపల్లి, సిటీటైమ్స్:**

ముఖ్యమంత్రి సహాయ నిధి పేద ప్రజలకు గొప్ప వరం లాంటిదని, అర్హులు అత్యవసర సమయంలో సద్వినియోగం చేసుకోవాలని పిఏసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ తెలిపారు. శనివారం శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని గోపి నగర్ కాలనీ కి చెందిన భరత్ రావుకి అత్యవసర వైద్య చికిత్స నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన రూ.2.50లక్షల మంజూరి పత్రాన్ని బాధిత కుటుంబానికి పిఏసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ అందజేశారు. ఈ సందర్భంగా పిఏసి చైర్మన్ గాంధీ మాట్లాడుతూ.. ప్రజాక్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేదల పక్షపాతి అన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి నిరంతరం సేవలను అందిస్తూ ఆపదలో ఉన్న వారికి ఆపన్న హస్తంలా ఆదుకుంటున్నదని, అనారోగ్యంకు గురై ఆర్థిక స్థోమత లేక ఆసుపత్రిలో చికిత్స పొందిన నిరుపేదలకు , అభాగ్యులకు అండగా..సీఎం సహాయ నిధి ఆర్థిక భరోసా నిస్తుందన్నారు. ఈ సందర్భంగా వైద్య చికిత్సకి సహకారం అందించిన పిఏసి చైర్మన్ ఆరెకపూడి గాంధీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియచేస్తున్నామని బాధిత కుటుంబ సభ్యులు అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మారబోయిన రాజు యాదవ్, ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, అన్వర్ షరీఫ్, దామోదర్ రెడ్డి, కరుణాకర్ గౌడ్, సత్యనారాయణ, బ్రిక్ శ్రీనివాస్, అనిల్ కావూరి తదితరులు పాల్గొన్నారు.

## నిలకడైన సేవా ప్రయాణం... 168వ వారం అన్నప్రసాదం



**శేరిలింగంపల్లి, జనవరి 24 (సిటీటైమ్స్):**

సేవాభావానికి నిలువెత్తు నిదర్శనంగా హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతి శనివారం నిర్వహిస్తున్న అన్నప్రసాద కార్యక్రమం సమాజానికి ఆదర్శంగా నిలుస్తోందని భారతీయ స్టేట్ బ్యాంక్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ పల్లం రాజు అన్నారు. శనివారం హోప్ ఫౌండేషన్ నిర్వహించిన 168వ వారం అన్నప్రసాద కార్యక్రమంలో ఆయన కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొని వేలాది మందికి భోజనాలను వడ్డించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నిరంతరంగా 168 వారాలుగా ఎలాంటి అంతరాయం లేకుండా అన్నదానం కొనసాగించడం గొప్ప సేవా సంకల్పానికి నిదర్శనమని పేర్కొంటూ, అవసరమైన వారికి ఆహారం అందించడమే లక్ష్యంగా హోప్ ఫౌండేషన్ చేపడుతున్న ఈ కార్యక్రమం సామాజిక బాధ్యతను గుర్తుచేస్తోందని ప్రశంసించారు. కార్యక్రమానికి వచ్చిన వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా హోప్ ఫౌండేషన్ సభ్యులు సమర్థంగా ఏర్పాట్లు చేయగా, వాలంటీర్ల సేవాభావంతో అన్నప్రసాద కార్యక్రమం సాఫీగా సాగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఘూలి కృష్ణ, అపర్ణ, మధుసూధన్ రెడ్డి, రాజశేఖర్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

## మహిళలకు ఉచిత బ్యూటీషియన్ శిక్షణ

### *శ్రీయాస్ బ్యూటీ అకాడమీ బోయిన్‌పల్లిలో ప్రారంభం*

**శంకర్‌పల్లి, జనవరి 24 (సిటీటైమ్స్):**



భారత ప్రభుత్వ సంస్థ అయిన నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్ప్రైజెస్ ఆధ్వర్యంలో మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో శ్రీయాస్ బ్యూటీ అకాడమీ బోయిన్‌పల్లిలో ఉచిత బేసిక్ బ్యూటీషియన్ కోర్సులు నిర్వహిస్తున్నట్లు అకాడమీ సీఈవో శ్రీలత శ్రావణ్ కుమార్ గౌడ్ తెలిపారు. ఈ కోర్సు ద్వారా మొత్తం 25 మంది మహిళలకు ఉచిత శిక్షణ అందించనున్నట్లు, శిక్షణ వ్యవధి ఒక నెలగా ఉండగా శిక్షణ పూర్తైన అనంతరం అభ్యర్థులకు ప్రభుత్వ ధ్రువీకరణ పత్రం అందజేయనున్నట్లు వెల్లడించారు. 18 నుంచి 45 సంవత్సరాల వయస్సు గల మహిళలు దరఖాస్తుకు అర్హులని, కనీస విద్యార్హతగా పదో తరగతి ఉత్తీర్ణత అవసరమని తెలిపారు. దరఖాస్తు సమయంలో రెండు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు, ఆధార్ కార్డు జిరాక్స్ తప్పనిసరిగా సమర్పించాలని సూచించారు. ఈ కోర్సు కోసం రెండు బ్యాచ్‌లు నిర్వహించనున్నట్లు పేర్కొంటూ, మొదటి బ్యాచ్ ఫిబ్రవరి 9న, రెండవ బ్యాచ్ ఫిబ్రవరి 18న ప్రారంభమవుతాయని తెలిపారు. సీట్లు పరిమితంగా ఉన్నందున అర్హులైన మహిళలు త్వరగా నమోదు చేసుకోవాలని సూచిస్తూ, ఇతర వివరాలకు 9989610703 నెంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

## సాంకేతిక పరిజ్ఞానం సహకారంతో పోగొట్టుకున్న ఫోన్లు రికవరీ

### రూ.17 లక్షల విలువైన 64 మొబైల్ ఫోన్లు బాధితులకు అందజేత

**కుత్బుల్లాపూర్, సిటీటైమ్స్:**




పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో పోగొట్టుకున్న రూ.17 లక్షల విలువైన 64 మొబైల్ ఫోన్లను పోలీసులు విజయవంతంగా గుర్తించి, పేట్ బషీరాబాద్ పీఎస్ లో శనివారం సంబంధిత యజమానులకు తిరిగి అందజేశారు. ఈ సందర్భంగా మేడ్చల్ ఏసీపీ శంకర్ రెడ్డి మాట్లాడుతూ.. ఫిర్యాదుల ఆధారంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి మొబైల్ ఫోన్లను గుర్తించి రికవరీ చేశామని తెలిపారు. మొబైల్ ఫోన్ పోయిన వారు వెంటనే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పాటు, కేంద్ర ప్రభుత్వ సీఈఐఆర్ పోర్టల్‌లో తమ మొబైల్ వివరాలు నమోదు చేయాలని సూచించారు. ఏసీపీ వెంట పేట్‌బషీరాబాద్ పీఎస్ ఎస్‌హెచ్‌వో కె విజయ వర్ధన్, డీఐ డి అజయ్ కుమార్, డీఎస్ఐ శ్రీనివాస్, సిబ్బంది ఉన్నారు.

# పోయిన ఫోన్ల జాడ పట్టిన పోలీసులు

## 64 మొబైళ్ల యజమానులకు అప్పగింత







*** ఏసీపీ శంకర్ రెడ్డి పర్యవేక్షణలో రూ.17 లక్షల విలువైన ఫోన్ల రికవరీ**
*** సీఈఐఆర్ పోర్టల్‌తో ట్రాకింగ్... ఫలితాలిచ్చిన ఆపరేషన్**
*** ఫిర్యాదు చేస్తే ఫలితం ఉంటుందని స్పష్టం చేసిన ఏసీపీ**

**సైబరాబాద్, జనవరి (సిటీటైమ్స్):**

పోయిన మొబైల్ ఫోన్లపై ఫిర్యాదు చేస్తే ఫలితం ఉంటుందన్న నమ్మకాన్ని పేట్‌బషీరాబాద్ పోలీసులు మరోసారి నిరూపించారు. మేడ్చల్ ఏసీపీ శంకర్ రెడ్డి పర్యవేక్షణలో పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో పోయిన రూ.17 లక్షల విలువైన 64 మొబైల్ ఫోన్లను పోలీసులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి విజయవంతంగా గుర్తించి, పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సంబంధిత యజమానులకు తిరిగి అందజేశారు. ఏసీపీ శంకర్ రెడ్డి స్పష్టీకరణ ఈ సందర్భంగా ఏసీపీ శంకర్ రెడ్డి మాట్లాడుతూ, మొబైల్ ఫోన్ పోయిన వెంటనే ఇచ్చిన ఫిర్యాదులు, కేంద్ర ప్రభుత్వ సీఈఐఆర్ (CEIR) పోర్టల్‌లో నమోదు చేసిన వివరాల ఆధారంగా ఫోన్ల జాడను గుర్తించామని తెలిపారు. ఐఎంఈఐ నంబర్లను ట్రాక్ చేస్తూ వివిధ ప్రాంతాల్లో ఉన్న ఫోన్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. ప్రజలకు ఏసీపీ కీలక సూచనలు మొబైల్ ఫోన్ పోయిన వారు ఆలస్యం చేయకుండా వెంటనే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పాటు సీఈఐఆర్ పోర్టల్‌లో తప్పనిసరిగా వివరాలు నమోదు చేయాలని ఏసీపీ శంకర్ రెడ్డి సూచించారు. అలా చేస్తే పోయిన ఫోన్లు తిరిగి లభించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని స్పష్టం చేశారు. పేట్‌బషీరాబాద్ పోలీస్ టీం పనితీరు పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ఏసీపీ శంకర్ రెడ్డి చేతుల మీదుగా ఫోన్లను యజమానులకు అందజేయగా, ఫోన్లు తిరిగి పొందిన బాధితులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ రికవరీ ఆపరేషన్‌లో పేట్‌బషీరాబాద్ పీఎస్ ఎస్‌హెచ్‌వో కె. విజయవర్ధన్, డీఐ డి. అజయ్ కుమార్, డీఎస్ఐ శ్రీనివాస్‌తో పాటు సిబ్బంది కీలకంగా వ్యవహరించారు.

# భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ధర్మరక్షణ సభ

## దుండిగల్ సర్కిల్ బీజేపీ అధ్యక్షులు పీసరి కృష్ణారెడ్డి ప్రసంగం

**దుండిగల్, సిటీటైమ్స్:**

జాగో భాగ్యనగర్ చలో బాలాపూర్ బాంగ్లాదేశ్ రోహింగ్యా ముస్లింలైన అక్రమ చొరబాటు దారులను అరెస్ట్ చేసి తిప్పి పంపించాలని శనివారం భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ధర్మరక్షణ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి బీజేపీ దుండిగల్ సర్కిల్ అధ్యక్షులు పీసరి కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. బాంగ్లాదేశ్ మయన్మార్ నుండి అక్రమంగా వచ్చి మన ఇంటి పక్కనే మనకు తెలియకుండా మన కుటుంబ కదలికలు గమనిస్తూ మన ఇళ్లలో చోరీలు చేస్తూ మన కుటుంబ సభ్యులపై దాడులు ఆగాయిత్యాలు తెగబడుతున్నారని, ప్రతిఒక్క హిందువు జాగృతమై మన పరిసరాలు ఒక కంటకనిపెడుతూ మన సమాజాన్ని కాపాడుకోవాల్సిన అవసరం చాలా ఉందని తెలిపారు. మనం ఈ మధ్యలో చూస్తున్నాం బాంగ్లాదేశ్ లో హిందువులపై జరుగుతున్న మారణ హోమం ఈ రోహింగ్యాల అరాచకులను మయాన్మార్ ను తరిమేయడం జరిగిందన్నారు. ఆ రాక్షసజాతిని ఎట్టి పరిస్థితిలో ఉపేక్షించినా మన భారతజాతికే ప్రమాదం కావునా రోహింగ్యా ముస్లిం ఎక్కడున్నా హిందువులు గమనించాలని, స్థానిక ముస్లింలు కూడా స్పందించి రోహింగ్యా ముస్లింలకు అక్రమంగా చోటు కల్పించితే ఈ దేశానికి ద్రోహం చేసినవారవుతారని తెలిపారు. కావున ప్రతి ఒక్కరు మా నినాదం దేశం మొదలు పార్టీలు తరువాత వ్యక్తిగతం చివర అంటూ దేశం మా ప్రాణం ధర్మం మా ఊపిరి గా మాకు సంఘం నేర్పిన నినాదం అన్నారు. భారతీయుడు ఐన ప్రతి క్కరు ఇదే సంకల్పంతో పని చేస్తేనే భారతదేశానికి, భారత సంస్కృతికి, జాతికి రక్షణ, కొన్ని పార్టీలు కేవలం అధికారం కోసం ఓటు బ్యాంక్ రాజకీయాల కోసం దిగజారకుండా దేశ రక్షణ కోసం పాటుపడాలని కోరుకుంటున్నా అన్నారు. ఈ కార్యక్రమానికి బౌరంపేట్ డివిజన్ నుండి తరలిన హిందూ సింహాలు పీసరి కృష్ణారెడ్డి, సింగాపురం జంగారెడ్డి, దమ్మగారి ప్రభాకర్రెడ్డి, ఎంబరి ఆంజనేయులు



ముదిరాజ్, దమ్మగారి సీతారాంరెడ్డి, యాంజాల శ్రీనివాస్ రెడ్డి, నాసి శ్రీపాల్ రెడ్డి, మల్లప్పగారి హరినాథ్ రెడ్డి తదితరుల ఎంతో మంది దేశభక్తులు హిందుత్వ వాదులు పాల్గొన్నారు.

# వీధి కుక్కల దాడిలో గాయపడిన నెమలి... సకాలంలో స్పందించిన గచ్చిబౌలి పోలీసులు

*** ఐడీబీఐ బ్యాంక్ మేనేజర్ ఫిర్యాదుతో తక్షణ చర్యలు**
*** అటవీ శాఖ, జీహెచ్ఎంసీకి సమాచారం**
*** జాతీయ పక్షి ప్రాణాన్ని కాపాడిన పోలీస్ చొరవ**

**శేరిలింగంపల్లి, జనవరి 24 (సిటీటైమ్స్):**

వీధి కుక్కల దాడిలో గాయపడిన జాతీయ పక్షి నెమలిని సకాలంలో రక్షిస్తూ గచ్చిబౌలి పోలీసులు అప్రమత్తతకు నిదర్శనంగా నిలిచారు. ఐడీబీఐ బ్యాంక్ మేనేజర్ జి. అశ్రిత నుంచి అందిన ఫిర్యాదు మేరకు, ఈ నెల 23న రాత్రి సుమారు 8 గంటల సమయంలో బ్యాంక్ ప్రాంగణంలో వీధి కుక్కల దాడి కారణంగా ఒక నెమలి గాయపడినట్లు పోలీసులు గుర్తించారు. ఫిర్యాదు అందగానే చర్యలు సమాచారం అందిన వెంటనే గచ్చిబౌలి పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించి అవసరమైన నమోదు పోలీస్ రికార్డుల్లో చేశారు. గాయపడిన నెమలికి తక్షణ సహాయం అందించే దిశగా చర్యలు చేపట్టారు. అటవీ శాఖ, జీహెచ్ఎంసీకి సమాచారం ఘటన తీవ్రతను పరిగణనలోకి తీసుకొని ఆలస్యం చేయకుండా అటవీ శాఖతో పాటు జీహెచ్ఎంసీ అధికారులకు సమాచారం అందించినట్లు పోలీసులు తెలిపారు. జాతీయ పక్షి కావడంతో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకున్నట్లు వెల్లడించారు. * సురక్షిత సంరక్షణకు అప్పగింత గాయపడిన నెమలిని సురక్షిత సంరక్షణ, వైద్య చికిత్స నిమిత్తం సంబంధిత అటవీ శాఖ అధికారులకు అప్పగించడంతో జాతీయ పక్షి ప్రాణాన్ని కాపాడగలిగామని పోలీసులు తెలిపారు. సకాలంలో స్పందించడంతో పరిస్థితి అదుపులోకి వచ్చిందని పేర్కొన్నారు. ఈ ఘటనలో గచ్చిబౌలి పోలీసులు చూపిన అప్రమత్తత, సమన్వయ చర్యలు ప్రజల్లో ప్రశంసలు అందుకుంటున్నాయి.



# రహదారి భద్రతే లక్ష్యం... 'అరైవ్ అండ్ అలైవ్–2026'కు మంచి స్పందన

*** మసీద్‌బండ కమ్యూనిటీ హాల్‌లో అవగాహన కార్యక్రమం**
*** ప్రజల్లో ట్రాఫిక్ నిబంధనలపై చైతన్యం**
*** గచ్చిబౌలి ట్రాఫిక్ పోలీసుల భాగస్వామ్యం**

**శేరిలింగంపల్లి, జనవరి 24 (సిటీటైమ్స్):**

రహదారి ప్రమాదాలను తగ్గించి భద్రతాయుత ప్రయాణంపై ప్రజల్లో అవగాహన పెంచే లక్ష్యంతో మసీద్‌బండ కమ్యూనిటీ హాల్‌లో 'అరైవ్ అండ్ అలైవ్-2026' పేరుతో రహదారి భద్రత అవగాహన కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు. గచ్చిబౌలి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ జి. సురేష్ ఈ కార్యక్రమంలో పాల్గొని రహదారి భద్రతపై ప్రజలకు సూచనలు చేశారు. • భద్ర డ్రైవింగ్‌పై అవగాహన ఈ కార్యక్రమంలో బాధ్యతాయుత డ్రైవింగ్ అవసరం, ట్రాఫిక్ నిబంధనల పాటింపు, రహదారిపై జాగ్రత్తలు వంటి అంశాలపై ప్రజలకు వివరించారు. వేగ నియంత్రణ, హెల్మెట్ వినియోగం, సీటుబెల్ట్ ప్రాధాన్యం వంటి అంశాలపై ప్రత్యేకంగా చర్చించారు. • ఇంటరాక్టివ్ కార్యక్రమాలు రహదారి భద్రతకు సంబంధించిన పలు ఇంటరాక్టివ్ సెషన్లు నిర్వహించి, రోడ్డుపక్కన ప్రయాణించే వాహనదారులు, సాధారణ ప్రజలకు ప్రాయోగిక అవగాహన కల్పించారు. ప్రమాదాలను నివారించడంలో వ్యక్తిగత బాధ్యత ఎంత ముఖ్యమో వివరించారు. • ప్రజల నుంచి మంచి స్పందన ఈ అవగాహన కార్యక్రమానికి స్థానిక ప్రజల నుంచి విశేష స్పందన లభించిందని నిర్వాహకులు తెలిపారు. రోడ్డుపై భద్రతా నియమాల పాటింపు ద్వారా ప్రాణాలను కాపాడుకోవచ్చన్న సందేశాన్ని ప్రజలు సానుకూలంగా స్వీకరించినట్లు పేర్కొన్నారు.



# 'మాతృభూమి'ని ప్రేమించే వారికి!



"దేశాన్ని తమకంటే ఎక్కువగా ప్రేమించే ప్రతి ఒక్కరికీ.." అంటూ 'బ్యాటిల్ ఆఫ్ గల్వాన్' చిత్రబృందం 'మాతృభూమి' అనే గీతాన్ని విడుదల చేసింది. బాలీవుడ్ అగ్ర కథానాయకుడు సల్మాన్ ఖాన్ ప్రధాన పాత్రలో నటిస్తూ.. నిర్మిస్తున్న చిత్రమిది. చిత్రాంగద సింగ్ కథానాయిక. అపూర్వ లఖియా దర్శకత్వం వహిస్తున్నారు. ఈ పాటలో సల్మాన్ ఓ వైపు యుద్ధభూమిలో సైనికుడిగా వీరత్వం ప్రదర్శించడంతో పాటు.. మరోవైపు కుటుంబ సభ్యులతో ప్రేమగా ఉండే సన్నివేశాలతో ప్రేక్షకుల్ని ఆకట్టుకున్నారు. సమీర్ అంజన్ సాహిత్యమందించగా ఈ గీతాన్ని అర్జిత్ సింగ్, శ్రేయా ఘోషల్ ఆలపించారు. ఈ సినిమాని ఏప్రిల్‌లో విడుదల చేసేందుకు చిత్రబృందం సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. 2020 జూన్‌లో గల్వాన్ లోయలో భారత్, చైనా జవాన్ల మధ్య తీవ్ర ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయి. ఈ ఘర్షణలో మన సైనికులు కొందరు వీర మరణం పొందారు. ఈ సంఘటన ఆధారంగానే ఈ సినిమా రూపొందుతోంది.

# బ్లూ కలర్ డ్రెస్సులో వెంకటేష్ భార్య.. సో సూపర్ అంటూ కామెంట్స్

టాలీవుడ్ హీరోయిన్ ఐశ్వర్య రాజేష్(Aishwarya Rajesh) గురించి స్పెషల్‌గా చెప్పాల్సిన పనిలేదు. 'కౌసల్య కృష్ణమూర్తి'(Kousalya Krishnamurthy) సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన ఈ బ్యూటీ ఆ తర్వాత వరుస సినిమాల్లో నటించి మంచి గుర్తింపు సంపాదించుకున్నది. ఇక రీసెంట్‌గా అనిల్ రావిపూడి(Annil Ravipudi) దర్శకత్వంలో వెంకటేష్(Venkatesh) హీరోగా వచ్చిన 'సంక్రాంతికి వస్తున్నాం'(Sankranti Ki Vastunnam) మూవీలో నటించి మెప్పించింది.

మీనాక్షి చౌదరి(Meenakshi Chowdary) కూడా నటించిన ఈ సినిమా బ్లాక్ బస్టర్ హిట్ అయింది. దీంతో ఈ ముద్దుగుమ్మకు వరుస ఆఫర్లు తలుపులు తడుతున్నాయి. ప్రజెంట్ చేతి నిండా సినిమాలతో బాగా బిజీ అయిపోయింది. ఇదిలా ఉంటే.. ఈ భామ సోషల్ మీడియా(Social Media)లో కూడా బాగా యాక్టీవ్‌గా ఉంటూ ఫాలోవర్స్‌కు కూడా దగ్గరవుతూ ఉంటుంది. నిత్యం ఏదో ఒక విషయం గురించి తెలుపుతూ ఫ్యాన్స్‌ను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తూ ఉంటుంది.

ఈ క్రమంలో ఈ భామ పోస్ట్ నెట్టింట వైరల్‌గా మారింది. తాజాగా ఐశ్వర్య తన ఇన్‌స్టాలో కొన్ని ఫొటోలు షేర్ చేసింది. అందులో బ్లూ కలర్ డ్రెస్సు వేసుకొని వావ్ అనిపించింది. ట్రెండీ అవుట్ ఫిట్‌లో మిర్రర్ ముందు హాట్ స్టిల్స్ ఇచ్చింది. మత్తెక్కించే కళ్లతో మెస్మరైజ్ చేసింది. ఇక వాటికి.. 'అద్దం నా వెలుగును ప్రతిబింబిస్తుంది' అనే క్యాప్షన్ జోడించింది. దీంతో ఈ పోస్ట్ కాస్త నెట్టింట వైరల్‌గా మారింది. ఇక దీన్ని చూసిన నెటిజన్లు వావ్ సూపర్, క్యూట్, సో సూపర్ అంటూ కామెంట్స్ చేస్తున్నారు.







# సంక్రాంతి బరిలో మరోసారి!



కథానాయకుడు వెంకటేశ్.. దర్శకుడు అనిల్ రావిపూడి మరోసారి సంక్రాంతి బరిలో వినోదాలు పంచేందుకు సిద్ధమవుతున్నారు. ఈ ఇద్దరి కలయికలో గతేడాది పండక్కి వచ్చిన 'సంక్రాంతికి వస్తున్నాం' బాక్సాఫీస్ బరిలో భారీ విజయాన్ని అందుకున్న సంగతి తెలిసిందే. ఇప్పుడీ పండగ మ్యాజిక్‌ను పునరావృతం చేసేందుకు వాళ్లిద్దరూ మరోసారి చేతులు కలిపినట్లు సమాచారం. 'మన శంకరవరప్రసాద్‌గారు' విజయం తర్వాత అనిల్ తెరకెక్కించనున్న చిత్రమిది. ఇప్పటికే ఈ చిత్ర విషయమై చర్చలు ఓ కొలిక్కి వచ్చాయని.. ఈసారి మరో సరికొత్త వినోదాత్మక కథతో వెంకీ అనిల్‌ల కాంబో అలరించనుందని చిత్ర సన్నిహిత వర్గాలు తెలిపాయి. ఇది జూన్ నుంచి చిత్రీకరణ ప్రారంభించుకునే అవకాశముందని తెలుస్తోంది. 2027 సంక్రాంతి లక్ష్యంగా ముస్తాబు కానున్న ఈ సినిమాని సాహు గారపాటి నిర్మించనున్నట్లు తెలిసింది. ఇక వెంకటేశ్ ప్రస్తుతం త్రివిక్రమ్ దర్శకత్వంలో 'ఆదర్శ కుటుంబం హౌస్ నెం:47' అనే సినిమా చేస్తున్నారు. అలాగే 'దృశ్యం 3' చేయాల్సి ఉంది.

# 'స్పిరిట్' సన్నాహాలు



ఈ సంక్రాంతి బరిలో 'ది రాజాసాబ్'గా సందడి చేశారు కథానాయకుడు ప్రభాస్. ఇప్పుడాయన తిరిగి 'స్పిరిట్' కోసం రంగంలోకి దిగేందుకు సిద్ధమవుతున్నారు. సందీప్ రెడ్డి దర్శకత్వంలో ముస్తాబవుతున్న ఈ పాన్ ఇండియా చిత్రం ఇప్పటికే ఓ షెడ్యూల్‌ని పూర్తి చేసుకున్న సంగతి తెలిసిందే. ఇప్పుడీ చిత్ర కొత్త షెడ్యూల్‌ను డెహ్రాడూన్‌లో ప్రారంభించేందుకు సందీప్ సన్నాహాలు చేస్తున్నట్లు తెలిసింది. ఈనెలాఖరు నుంచి మొదలు కానున్న ఈ షెడ్యూల్‌లో ప్రభాస్‌తో పాటు ముఖ్య తారాగణంపై కీలక సన్నివేశాలు చిత్రీకరించనున్నట్లు సమాచారం. ఇది దాదాపు రెండు వారాలు సాగనున్నట్లు తెలుస్తోంది. పవర్‌ఫుల్ పోలీసు కథతో యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందుతోన్న ఈ చిత్రంలో ప్రభాస్ ఐపీఎస్ అధికారిగా అలరించనున్నారు. తనిందులో భిన్న లుక్స్‌లో కనువిందు చేయనున్నట్లు ప్రచారం జరుగుతోంది.

# త్రిముఖ వ్యూహం



''కామెడీ, థ్రిల్లింగ్ అంశాలు నిండిన కథతో రూపొందిన సినిమా 'త్రిముఖ'' అన్నారు దర్శకుడు రాజేశ్ నాయుడు. ఆయన దర్శకత్వం వహించిన ఈ బహుభాషా చిత్రంలో యోగేశ్ కల్లె హీరోగా నటించారు. సన్నీ లియోన్ ప్రధాన పాత్ర పోషించారు. ఆకృతి అగర్వాల్, సాహితీ దాసరి, ప్రవీణ్ తదితరులు కీలక పాత్రల్లో నటించారు. ఈ సినిమా ఈనెల 30న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే శనివారం హైదరాబాద్‌లో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు రాజేశ్ మాట్లాడుతూ.. ''ఇది మంచి కథ, బలమైన స్క్రీన్‌ప్లేతో రూపొందిన సినిమా. ప్రథమార్ధం వినోదాత్మకంగా.. ద్వితీయార్ధం థ్రిల్లింగ్‌గా ఉంటుంది. దీంట్లోని ప్రతి పాత్ర ఒక మంచి విషయాన్ని తెలియజేస్తుంది'' అన్నారు. ''ఈ చిత్రంలో సన్నీ లియోన్ పాత్రకు ఎంతో ప్రాధాన్యత ఉంది. ఈ సినిమాతో ఆమెకు నటిగా మంచి పేరొస్తుంది'' అన్నారు హీరో యోగేశ్ కల్లె.

# అనుబంధాల 'చాయ్ వాలా'

చాయ్ వాలా'లోని తండ్రీ కొడుకుల ఎమోషన్ అందర్నీ కట్టిపడేస్తుంది'' అన్నారు హీరో శివ కందుకూరి. ఇప్పుడాయన.. తేజు అశ్విని జంటగా ప్రమోద్ హర్ష తెరకెక్కించిన ఈ సినిమాని రాధా వి పావుడిప్పు నిర్మించారు. రాజీవ్ కనకాల, రాజ్ కుమార్ కసిరెడ్డి తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ చిత్రం ఫిబ్రవరి 6న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే ఇటీవల హైదరాబాద్‌లో టైటిల్ గీతాన్ని విడుదల చేశారు. ఈ వేడుకలో సిటీ కమిషనర్ వీసీ సజ్జనార్, నీలోఫర్ ఫౌండర్ బాబురావు, కిమ్స్ ఎండీ రవికిరణ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిటీ కమిషనర్ సజ్జనార్ మాట్లాడుతూ.. ''టైటిల్ గీతం బాగుంది. ఈ సినిమా యువతకు స్ఫూర్తినిచ్చేలా ఉంటుందని నమ్ముతున్నా. ఇందులో తండ్రీ కొడుకుల అనుబంధంతో పాటు చాలా అంశాలున్నట్లు అర్థమవుతోంది. తప్పకుండా ఈ సినిమా పెద్ద విజయం సాధిస్తుందనే నమ్మకముంది'' అన్నారు. ''ఈ సినిమాలో తండ్రీ కొడుకుల ఎమోషన్ చాలా బాగుంటుంది. అలాగే చాయ్‌కి.. షాప్ ఓనర్‌కీ మధ్య అద్భుతమైన ఎమోషన్ ఉంటుంది'' అన్నారు నిర్మాత రాజ్ కందుకూరి. ఈ కార్యక్రమంలో రాజీవ్ కనకాల, ప్రమోద్ హర్ష, ప్రశాంత్ ఆర్ విహారి, వెంకట్, శశాంక్ తదితరులు పాల్గొన్నారు.



# 'బోర్డర్ 2'.. దేశభక్తి నేపథ్యం మరోసారి మెప్పించిందా? రివ్యూ:

**బోర్డర్ 2; నటీనటులు: సన్నీ దేఓల్, వరుణ్ ధావన్, దిల్జీత్ దోసాంజ్, అహాన్ శెట్టి, మోనా సింగ్, సోనమ్ బజ్వా, అన్య సింగ్, అనురాగ్ అరోరా తదితరులు; సంగీతం: జాన్ స్టీవర్ట్, అను మాలిక్, మిథున్, సచేత్ - పరంపర, విశాల్ మిశ్రా, గుర్మోహ్; సినిమాటోగ్రఫీ: అన్షుల్; దర్శకత్వం: అనురాగ్ సింగ్; నిర్మాణ సంస్థలు: టీ సిరీస్ ఫిల్మ్స్, జేపీ ఫిల్మ్స్; విడుదల తేదీ: 23-01-2026**

బాలీవుడ్ నుంచి వచ్చిన గొప్ప దేశభక్తి చిత్రాల్లో 'బోర్డర్'కి ప్రత్యేక స్థానముంది. 1971 ఇండో పాక్ యుద్ధం నేపథ్యంలో జేపీ దత్తా తెరకెక్కించిన ఈ సినిమా 1997లో విడుదలై బాక్సాఫీస్ ముందు సంచలన విజయాన్ని అందుకుంది. ఇప్పుడు 28ఏళ్ల తర్వాత 'బోర్డర్ 2'ను తెరపైకి తీసుకొచ్చారు దర్శకుడు అనురాగ్ సింగ్. మరి ఈ చిత్ర కథేంటి? ప్రేక్షకుల్ని అలరించిందా?

**కథేంటంటే..**

border 2 story || తొలి భాగంలాగే 'బోర్డర్ 2' కూడా 1971 నాటి భారత్ పాకిస్థాన్ యుద్ధ నేపథ్యంలోనే సాగుతుంది. ఇండియాను దెబ్బ కొట్టేందుకు పాక్ భూ, జల, వాయు మార్గాల ద్వారా కశ్మీర్, పంజాబ్, గుజరాత్ సరిహద్దుల వెంట భారీ దాడులకు యత్నిస్తుంది. దీన్ని ముందే పసిగట్టిన భారత ప్రభుత్వం త్రివిధ దళాల్ని యుద్ధానికి రంగంలోకి దించుతుంది. మరి ఈ పోరులో లెఫ్టినెంట్ కల్నల్ ఫతేహ్ సింగ్ ఖేల్కర్ (సన్నీ దేఓల్), మేజర్ హోషియార్ సింగ్ దహియా (వరుణ్ ధావన్), లెఫ్టినెంట్ కమాండర్ ఎంఎస్ రావత్ (అహాన్ శెట్టి), ఎయిర్‌ఫోర్స్ ఆఫీసర్ నిర్మల్ జిత్ సింగ్ సెఖోన్ (దిల్జీత్ దోసాంజ్) ఎలాంటి ధైర్య సాహసాలు ప్రదర్శించారు? పాక్ సైన్యాన్ని ఎలా మట్టికరిపించారు? ఈ క్రమంలో ఎదుర్కొన్న సవాళ్లేంటి? అన్నది మిగిలిన కథ.

**ఎలా సాగిందంటే..**

ఈ సినిమా 1971 యుద్ధం తర్వాత జరిగిన మరో కీలకమైన సరిహద్దు పోరాటం చుట్టూ తిరుగుతుంది. మొదటి భాగంలో కేవలం ఆర్మీ పోరాటాన్ని మాత్రమే చూపిస్తే.. ఈసారి ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్ సంయుక్తంగా చేసిన త్రిముఖ పోరును కళ్లకు కట్టినట్లు ఉద్వేగభరితంగా చూపించారు. 'బోర్డర్' జ్ఞాపకాల్ని గుర్తు చేస్తూ.. పాక్ ముష్కరుల్ని చీల్చి చెండాడే ఓ వీరోచిత పోరాట ఘట్టంతో సన్నీ దేఓల్ పాత్రను పరిచయం చేసిన తీరు చక్కటి విజిల్ మూమెంట్‌లా ఉంటుంది. ఆ తర్వాత నుంచి కథ ఫ్రెండ్‌షిప్, కుటుంబ భావోద్వేగాల మేళవింపుగా సాగుతుంది. కొత్తతరం సైనికులుగా వరుణ్, దిల్జీత్, అహాన్‌లు పరిచయమైన తీరు.. సైనిక శిక్షణలో వాళ్ల మధ్య సాగే సరదా గొడవలు.. మిత్రులుగా మారాక ముగ్గురూ కలిసి చేసిన అల్లరి.. అన్నీ హత్తుకునేలా ఉంటాయి. కాకపోతే ఈ ముగ్గురి కుటుంబ నేపథ్యాల్ని పరిచయం చేయడానికి దర్శకుడు కాస్త ఎక్కువ సమయమే తీసుకున్నాడనిపించింది. ఎప్పుడైతే సరిహద్దు వెంట పాక్ యుద్ధ సన్నాహాలు ప్రారంభిస్తుందో అక్కడి నుంచే కథలో సంఘర్షణ మొదలవుతుంది. ఈ యుద్ధం కోసం కథానాయకులంతా రంగంలోకి దిగడం.. ఈ క్రమంలో ఓ చక్కటి ట్విస్ట్‌తో ప్రథమార్ధానికి విరామమిచ్చిన తీరు ద్వితీయార్ధంపై అంచనాలు పెంచేలా చేస్తుంది. ఇక ద్వితీయార్ధం ఆద్యంతం హైఓల్టేజ్ వార్ సీక్వెన్స్‌లతోనే ఉత్కంఠభరితంగా సాగుతుంది. ఓవైపు నేవీ లెఫ్టినెంట్ కమాండర్‌గా అహాన్ శెట్టి నడి సంద్రంలో పాక్ సబ్‌మెరైన్‌తో సాగించే వీరోచిత పోరాటం.. మరోవైపు గగనతలంలో దాయాది దేశ జెట్ ఫైటర్లను ఫ్లయింగ్ ఆఫీసర్ దిల్జీత్ వెంటాడి వేటాడే తీరు.. ఆద్యంతం రోమాంచితమే. అంతేకాదు ఆ పాత్రల ప్రాణత్యాగం మనసుల్ని మెలిపెడుతుంది. 'బోర్డర్' జ్ఞాపకాల్ని మరోసారి గుర్తు చేస్తూ వచ్చే 'సందేసే ఆతే హై' పాట ప్రతిఒక్కరి మదిని కదిలిస్తుంది. ఇక భారత నేవీ, ఎయిర్‌ఫోర్స్.. శత్రుదేశ సైనికులతో చేసిన పోరాటం ఒకెత్తైతే.. ఆర్మీ సాగించిన అలుపెరుగని సుదీర్ఘ పోరాటం మరో ఎత్తు. పాక్ సైన్యం కురిపించే తూటాల వర్షాన్ని దాటుకుంటూ ఆ దేశ సరిహద్దుల్లోకి వెళ్లి వరుణ్ చేసే విధ్వంసం.. మరో చోట పాక్ రహస్య స్థావరంలోకి చొచ్చుకెళ్లి సన్నీ దేఓల్ చేసే వీరోచిత విన్యాసాలు ప్రీక్లైమాక్స్‌కు హైలైట్. ముఖ్యంగా పాక్ యుద్ధ ట్యాంకుల్ని వన్ మ్యాన్ ఆర్మీలా సన్నీ గ్రనేడ్లతో పేల్చేసే తీరు థ్రిల్లింగ్‌గా ఉంటుంది. ఇక పతాక ఘట్టాల్లో ఆయన.. వరుణ్ కలిసి పాక్ సైన్యంపై సాగించిన పోరాటం ఆకర్షణగా ఉంటుంది.

**ఎవరెలా చేశారంటే..**

లెఫ్టినెంట్ కల్నల్ ఫతేహ్ సింగ్ పాత్రలో సన్నీ దేఓల్ స్క్రీన్ ప్రజెన్స్, తను చూపిన గంభీరత్వం, చేసిన పోరాట ఘట్టాలు అన్నీ సినిమాకి ప్రధాన ఆకర్షణ. వరుణ్ ధావన్, అహాన్ శెట్టి, దిల్జీత్ పాత్రలు ఆరంభంలో ఎంత సరదాగా కనిపిస్తాయో.. ద్వితీయార్ధంలో అంతగా భావోద్వేగాలతో మనసుల్ని బరువెక్కిస్తాయి. యాక్షన్ ఘట్టాల్లో ముగ్గురు పోటాపోటీగా మెప్పించారు. మోనా సింగ్, సోనమ్ బాజ్వా, అన్య సింగ్, అనురాగ్ అరోరా తదితరుల పాత్రలు పరిధి మేరకు ఉంటాయి. 'బోర్డర్'తో పోల్చితే ఈ రెండో భాగంలో కొన్ని చోట్ల భావోద్వేగాలు కొరవడినట్లు కనిపించినా.. ప్రేక్షకుల అంచనాల్ని అందుకునేలా దీన్ని రూపొందించడంలో దర్శకుడు అనురాగ్ విజయం సాధించారు. కాకపోతే నిడివిని తగ్గించి ఉంటే కథలో కాస్త వేగం కనిపించేది.

**బలాలు**

**+ సన్నీ దేఓల్, వరుణ్ ధావన్ నటన**

**+ దేశభక్తి అంశాలు**

**+ ద్వితీయార్ధంలోని పోరాట ఘట్టాలు**


**బలహీనతలు:**

**- నిడివి**

**- ప్రథమార్ధంలోని సాగదీత**

**చివరిగా: దేశభక్తిని రగిలించడమే కాదు.. థ్రిల్ పంచే 'బోర్డర్ 2'**

**గమనిక: ఈ సమీక్ష సమీక్షకుడి దృష్టి కోణానికి సంబంధించింది. ఇది సమీక్షకుడి వ్యక్తిగత అభిప్రాయం మాత్రమే!**



## నిజాంపేట్ లో పరిటాల రవి వర్ధంతి కార్యక్రమం

### లీడర్ నరసింహ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నివాళులు



**నిజాంపేట్, సిటీ టైమ్స్:**

ఉమ్మడి రాష్ట్రంలో తెలుగు దేశం పార్టీలో ఎనలేని సేవ చేసి తెలుగు వారి అభిమానాన్ని పొందిన దివంగత నేత పరిటాల రవి సేవలు చిరస్మరణీయం అని డాక్టర్ లీడర్ కోలన్ నర్సింహా రెడ్డి స్మరించుకున్నారు. శనివారం డాక్టర్ లీడర్ నరసింహ రెడ్డి ఆధ్వర్యంలో నిజాంపేట్ సర్కిల్ పరిధిలో పరిటాల రవి వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో అనంతయ్య చౌదరి, తదితరులు పాల్గొన్నారు.

## రహదారి ప్రమాదాలకు బ్రేక్... మియాపూర్‌లో 'అరైవ్ అలైవ్' ప్రచారం

* రోడ్ సేఫ్టీ మంత్-2026లో ట్రాఫిక్ పోలీసుల ప్రత్యేక చొరవ
* హెల్మెట్, సీటుబెల్ట్ పాటించకపోతే ప్రమాదమేనని హెచ్చరిక
* మద్యం మత్తు, అతివేగంపై స్పష్టమైన సందేశం



**శేరిలింగంపల్లి, జనవరి 24 (సిటీటైమ్స్):**

నగరంలో పెరుగుతున్న రహదారి ప్రమాదాలను నియంత్రించడమే లక్ష్యంగా రోడ్ సేఫ్టీ మంత్-2026లో భాగంగా మియాపూర్‌లోని కల్వరీ చర్చ్ పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ పోలీసులు 'అరైవ్ అలైవ్' పేరుతో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆదివారం చర్చ్‌కు వచ్చిన భక్తులతో పాటు రోడ్డుపై ప్రయాణించే వాహనదారులను ఉద్దేశించి ట్రాఫిక్ నిబంధనల పాటింపుపై పోలీసులు కఠినంగా హెచ్చరించారు. ప్రమాదాలకు కారణాలే లక్ష్యం ఈ సందర్భంగా ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, నాలుగు చక్రాల వాహనదారులు సీటుబెల్ట్ వినియోగాన్ని నిర్లక్ష్యం చేయొద్దని పోలీసులు స్పష్టం చేశారు. మద్యం సేవించి వాహనం నడపడం, అతివేగం, రాంగ్ సైడ్ డ్రైవింగ్ వంటి అలవాట్లే ప్రాణనష్టాలకు ప్రధాన కారణాలుగా మారుతున్నాయని వివరించారు. పాదచారుల భద్రతపై హెచ్చరిక రహదారి దాటే సమయంలో పాదచారులు జాగ్రత్తలు పాటించకపోతే ప్రమాదాల నుంచి తప్పించుకోవడం కష్టమని పోలీసులు తెలిపారు. జీబ్రా క్రాసింగ్‌ల వినియోగం, ట్రాఫిక్ సిగ్నల్స్ పాటింపు తప్పనిసరి అని సూచించారు. ట్రాఫిక్ పోలీసుల స్పష్టమైన సందేశం రహదారి నిబంధనలను ఉల్లంఘిస్తే ప్రాణాలతో చెలగాటమేనని, ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా భద్ర డ్రైవింగ్ అలవాటు చేసుకోవాలని మియాపూర్ ట్రాఫిక్ పోలీసులు స్పష్టం చేశారు. ఈ ప్రచారానికి స్థానిక ప్రజలు, భక్తుల నుంచి మంచి స్పందన లభించిందని తెలిపారు.

# రాత్రి రికీ..పగలు చోరీలు

## బైకు దొంగల ముఠా గుట్టు రట్టు






**ఏసీపీ శంకర్ రెడ్డి పర్యవేక్షణలో మేడ్చల్ పోలీసుల కీలక ఆపరేషన్**

* 18 ద్విచక్ర వాహన చోరీల కేసు ఛేదనం
* రూ.50 లక్షల విలువైన బైకుల స్వాధీనం

**సైబరాబాద్, జనవరి 24 (సిటీటైమ్స్):**

నగర శివార్లలో వరుసగా జరుగుతున్న ద్విచక్ర వాహన చోరీలకు అడ్డుకట్ట వేస్తూ మేడ్చల్ పోలీసులు కీలక విజయాన్ని సాధించారు. రాత్రివేళ ప్రాంతాలను పరిశీలించి, పగటి వేళల్లో అవకాశముంటే చోరీలకు పాల్పడుతున్న బైకు దొంగల ముఠాను ఏసీపీ శంకర్ రెడ్డి పర్యవేక్షణలో మేడ్చల్ పోలీసులు ఛేదించారు. ఈ కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేయగా, మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.* చోరీలు పెరగడంతో ప్రత్యేక దృష్టి మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల ద్విచక్ర వాహన చోరీలు అధికంగా నమోదవడంతో పరిస్థితిని సీరియస్‌గా తీసుకున్న ఏసీపీ శంకర్ రెడ్డి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి నిఘా పెంచారు. అనుమానాస్పద కదలికలపై దృష్టి పెట్టి, సాంకేతిక ఆధారాలు, సీసీ కెమెరా ఫుటేజీ, గుట్టు సమాచారం ఆధారంగా దర్యాప్తు చేపట్టారు. 18 బైకు చోరీల ఒప్పుకోలు అరెస్టైన నిందితులను విచారించగా వారు మొత్తం 18 ద్విచక్ర వాహన చోరీలకు పాల్పడినట్లు ఒప్పుకున్నారని ఏసీపీ శంకర్ రెడ్డి వెల్లడించారు. వీరిలో మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో 15 కేసులు, దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు, పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక చోరీ కేసు నమోదైనట్లు తెలిపారు. ఈ మేరకు బీఎన్ఎస్ సెక్షన్ 303(2) కింద కేసులు నమోదు చేశారు. రూ.50 లక్షల బైకుల స్వాధీనం నిందితుల నుంచి సుమారు రూ.50 లక్షల విలువైన ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఏసీపీ తెలిపారు. ఇందులో 12 రాయల్ ఎన్‌ఫీల్డ్ బైకులు, ఐదు పల్సర్ బైకులు, ఒక ఎఫ్‌జెడ్ ద్విచక్ర వాహనం ఉండగా, అదనంగా ఒక వెండి కుంకుమ భరణి, ఒక వైర్ కట్టర్, ఒక మాస్క్, మూడు మొబైల్ ఫోన్లను కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పరారీ నిందితులపై వేట ఈ కేసులో కీలక పాత్ర పోషించిన మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నారని, వారిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలతో గాలింపు కొనసాగుతోందని ఏసీపీ శంకర్ రెడ్డి తెలిపారు. త్వరలోనే వారినీ అరెస్టు చేస్తామని స్పష్టం చేశారు. ప్రజలకు హెచ్చరిక ద్విచక్ర వాహన యజమానులు తమ వాహనాలను సురక్షిత ప్రాంతాల్లో పార్క్ చేసుకోవాలని, లాకింగ్ వ్యవస్థలు తప్పనిసరిగా వినియోగించాలని ఏసీపీ సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా కదలికలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. పోలీస్ బృందానికి అభినందనలు ఈ కేసు ఛేదనలో చాకచక్యంగా వ్యవహరించిన మేడ్చల్ ఎస్‌హెచ్ఓ సత్యనారాయణ, డీఐ కిరణ్ కుమార్, ఎస్ఐ నవీన్‌తో పాటు పోలీస్ సిబ్బందిని ఏసీపీ శంకర్ రెడ్డి అభినందించారు.

# ఎదురులేని యువ భారత్

**–కివీస్‌పై ఘనవిజయం**
**–మెరిసిన ఆయుష్, అంబ్రిష్, హెనిల్**



అండర్ 19 ప్రపంచకప్‌లో భారత్‌కు ఎదురేలేదు. హ్యాట్రిక్ విజయంతో ఆయుష్ మాత్రే బృందం సూపర్ సిక్స్‌కు దూసుకెళ్లింది. శనివారం గ్రూప్‌బి ఆఖరి మ్యాచ్‌లో భారత్ 7 వికెట్ల తేడాతో న్యూజిలాండ్‌ను చిత్తు చేసింది. వర్షం కారణంగా 37 ఓవర్లకు కుదించిన ఈ మ్యాచ్‌లో మొదట 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అంబ్రిష్ (4/29), హెనిల్ పటేల్ (3/23) ధాటికి న్యూజిలాండ్ 36.2 ఓవర్లలో 135 పరుగులకే ఆలౌటైంది. కాలమ్ (37), సెల్విన్ సంజయ్ (28), కాటర్ (23) మాత్రమే రాణించారు. కెప్టెన్ ఆయుష్ మాత్రే (53; 27 బంతుల్లో 2×4, 6×6), వైభవ్ సూర్యవంశీ (40; 23 బంతుల్లో 2×4, 3×6) మెరుపులతో భారత్ 13.3 ఓవర్లలో 3 వికెట్లే కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది. ఈ విజయంతో గ్రూప్‌బిలో ఆడిన మూడు మ్యాచ్‌లూ గెలిచిన యువ భారత్.. 6 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. ఈ గ్రూప్ నుంచి బంగ్లాదేశ్ (3), న్యూజిలాండ్ (2) కూడా సూపర్ సిక్స్ చేరాయి. అమెరికా టోర్నీ నుంచి నిష్క్రమించింది. ఆదివారం ఆరంభమయ్యే సూపర్ సిక్స్‌లో మొత్తం 12 జట్లు రెండు గ్రూప్‌లుగా విడిపోయి తలపడతాయి. గ్రూప్2లో ఉన్న భారత్.. 27న జింబాబ్వే, ఫిబ్రవరి 1న పాకిస్థాన్‌తో తలపడనుంది. ఆయుష్, వైభవ్ దూకుడు: ఛేదనలో ఆరంభంలోనే భారత్.. ఆరోన్ జార్జి (7) వికెట్ కోల్పోయింది. 4 ఓవర్లకు స్కోరు 27/1. అక్కడ నుంచి వైభవ్ సూర్యవంశీ, ఆయుష్ మాత్రే సిక్స్‌లు, ఫోర్లతో విరుచుకుపడ్డారు. 8 ఓవర్లకు 87/1తో భారత్ విజయం దిశగా దూసుకెళ్లింది. వైభవ్ ఔటైనా.. ఆయుష్ దూకుడు కొనసాగించాడు. ఈ క్రమంలో 24 బంతుల్లోనే అర్ధసెంచరీ అందుకున్నాడు. అర్ధసెంచరీ చేశాక ఆయుష్ వెనుదిరిగినా.. వేదాంత్ (12 నాటౌట్), విహాన్ (16 నాటౌట్) పని పూర్తి చేశారు. భారత్ మరో 141 బంతులు ఉండగానే విజయాన్ని అందుకుంది. అంతకుముందు అంబ్రిష్, హెనిల్ పటేల్ విజృంభించడంతో న్యూజిలాండ్ నిలవలేకపోయింది. 22 పరుగులకే సగం వికెట్లు కోల్పోయిన ఆ జట్టు.. ఆ తర్వాత కోలుకోలేకపోయింది.

**--సంక్షిప్త స్కోర్లు..** న్యూజిలాండ్: 36.2 ఓవర్లలో 135 ఆలౌట్ (కాలమ్ 37 నాటౌట్, సెల్విన్ సంజయ్ 28, జాకబ్ కాటర్ 23; అంబ్రిష్ 4/29, హెనిల్ పటేల్ 3/23, ఖిలాన్ పటేల్ 1/26, మహ్మద్ ఇనాన్ 1/26, కనిష్క్ చౌహాన్ 1/30) భారత్: 13.3 ఓవర్లలో 130/3 (ఆయుష్ మాత్రే 53, వైభవ్ సూర్యవంశీ 40, విహాన్ 17 నాటౌట్, వేదాంత్ 13 నాటౌట్; మాసన్ క్లార్క్ 1/29, జస్కరణ్ సంధు 1/34, సంజయ్ 1/22).

## బంగ్లా ఔట్.. పాక్ బోర్డు ఛైర్మన్ మొసలికన్నీరు

టీ20 ప్రపంచకప్ (T20 World Cup 2026) నుంచి బంగ్లాదేశ్‌ను తప్పించి స్కాట్లాండ్‌కు అవకాశం ఇస్తున్నట్లు ఐసీసీ వర్గాలు తెలిపిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో పొట్టికప్‌లో పాక్ ఆడుతుందో లేదో అనేది తమ ప్రభుత్వమే తుది నిర్ణయం తీసుకుంటుందని పాకిస్థాన్ క్రికెట్ బోర్డు ఛైర్మన్ మోసిన్ నక్వీ (Mohsin Naqvi) వ్యాఖ్యానించారు. "బంగ్లాదేశ్‌కు అన్యాయం జరిగింది. అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ బోర్డు సమావేశంలో నేను అదే చెప్పాను. ఐసీసీ ద్వంద్వ ప్రమాణాలు కలిగి ఉండకూడదు. బంగ్లాదేశ్ ప్రధాన వాటాదారు. వారికి అన్యాయం చేయకూడదు" అంటూ మొసలికన్నీరు కార్చారు. బంగ్లాదేశ్‌ను టీ20 ప్రపంచ కప్‌లో పాల్గొనడానికి అనుమతించాలని డిమాండ్ చేశారు. పాక్ ఆడే మ్యాచులన్నింటినీ శ్రీలంకలో నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. భద్రత కారణాల దృష్ట్యా భారత్‌లో మ్యాచ్‌లు ఆడటానికి బంగ్లాదేశ్ నిరాకరించింది. తమ మ్యాచ్‌ల్ని శ్రీలంకకు మార్చాలని బంగ్లా ఐసీసీకి విజ్ఞప్తి చేసింది. ఆ అభ్యర్థనను తిరస్కరించిన ఐసీసీ భారత్‌లోనే ఆడాలని తేల్చిచెప్పింది. అయినా, బంగ్లా తీరు మార్చుకోకపోవడంతో ప్రస్తుత ర్యాంకింగ్స్ ఆధారంగా ఆ స్థానాన్ని స్కాట్లాండ్‌తో భర్తీ చేస్తున్నట్లు ఐసీసీ ప్రకటించింది.

# బెంగళూరుకు బ్రేక్



**–డబ్ల్యూపీఎల్-4లో తొలి ఓటమి**
**–ఢిల్లీ క్యాపిటల్స్ ఘనవిజయం**

డబ్ల్యూపీఎల్ నాలుగో సీజన్లో అప్రతిహతంగా సాగిపోతున్న రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుకు బ్రేక్ పడింది. అయిదు వరుస విజయాలతో ఇప్పటికే ప్లేఆఫ్స్ చేరిన ఆ జట్టు.. ఆరో మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ చేతిలో ఓటమి పాలైంది. శనివారం ఆల్‌రౌండ్ ప్రదర్శనతో సత్తా చాటిన డీసీ.. 7 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఈ సీజన్లో తొలిసారిగా బెంగళూరు బ్యాటింగ్ తేలిపోవడంతో మొదట ఆ జట్టు 20 ఓవర్లలో 109 పరుగులకే కుప్పకూలింది. నందని శర్మ (3/26), మరిజేన్ కాప్ (2/17), మిన్ను మణి (2/18), షినెలీ హెన్రీ (2/22) ప్రత్యర్థి పతనాన్ని శాసించారు. బెంగళూరు జట్టులో కెప్టెన్ స్మృతి మంధాన (38; 34 బంతుల్లో 6×4, 1×6) మాత్రమే చెప్పుకోదగ్గ ఇన్నింగ్స్ ఆడింది. ఆమె కాకుండా రాధ యాదవ్ (18), జార్జియా వోల్ (11) మాత్రమే రెండంకెల స్కోర్లు సాధించారు. పదో ఓవర్లో స్మృతి ఔటయ్యేసరికి ఆర్సీబీ స్కోరు 62/2. ఆ తర్వాత ఢిల్లీ బౌలర్లు పోటీ పడి వికెట్లు తీయడం, భాగస్వామ్యాలు నమోదు కాకపోవడంతో ఆర్సీబీ స్వల్ప స్కోరుకు పరిమితమైంది. అనంతరం లారా వోల్వార్ట్ (42 నాటౌట్; 38 బంతుల్లో 4×4, 1×6) కీలక ఇన్నింగ్స్ ఆడడంతో లక్ష్యాన్ని డీసీ.. 15.4 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఓపెనర్లు లిజెలీ లీ (6), షెఫాలి వర్మ (16) త్వరగా వెనుదిరిగినప్పటికీ.. కెప్టెన్ జెమీమా రోడ్రిగ్స్ (24), మరిజేన్ కాప్ (19 నాటౌట్)లతో కలిసి భాగస్వామ్యాలు నెలకొల్పిన లారా జట్టును గెలిపించింది. బెంగళూరు బౌలర్లలో సయాలీ సత్ఘారే (2/18), రాధ యాదవ్ (1/10) రాణించారు. 6 మ్యాచ్‌ల్లో 5 విజయాలతో ఇప్పటికీ బెంగళూరే అగ్రస్థానంలో కొనసాగుతుండగా.. 4 మ్యాచ్‌ల్లో ఒకే విజయంతో పాయింట్ల పట్టికలో అట్టడుగు స్థానంలో ఉన్న డీసీ.. ఆ తర్వాత వరుసగా రెండో విజయంతో రెండో స్థానానికి ఎగబాకడం విశేషం. బెంగళూరు: 20 ఓవర్లలో 109 ఆలౌట్ (స్మృతి మంధాన 38, రాధ యాదవ్ 18; నందని శర్మ 3/26, మరిజేన్ కాప్ 2/17, మిన్ను మణి 2/18, షినెలీ హెన్రీ 2/22) ఢిల్లీ: 15.4 ఓవర్లలో 111/3 (లారా వోల్వార్ట్ 42 నాటౌట్, జెమీమా 24, మరిజేన్ కాప్ 19 నాటౌట్; సయాలి సత్ఘారే 2/18, రాధ 1/10)

# సాధిస్తారా సిరీస్..

**–కివీస్‌తో భారత్ మూడో టీ20 నేడు**

న్యూజిలాండ్‌కు వన్డే సిరీస్ కోల్పోయినప్పటికీ, ఆ ప్రభావం ఏమాత్రం కనిపించనివ్వకుండా టీ20ల్లో చెలరేగిపోతున్న టీమ్‌ఇండియా.. సిరీస్ మీద గురి పెట్టింది. వరుసగా మూడో విజయంతో సిరీస్ చేజిక్కించుకోవాలనే లక్ష్యంతో ఆదివారం మూడో టీ20లో బరిలోకి దిగుతోంది. గువాహటి: బౌలర్లు విఫలమవుతున్నప్పటికీ, బ్యాటర్ల జోరుతో కివీస్‌తో టీ20 సిరీస్‌లో దూసుకెళ్తున్న భారత జట్టు.. హ్యాట్రిక్, సిరీస్ విజయం మీద కన్నేసింది. గువాహటిలోని బర్సపరా స్టేడియంలో ఆదివారం జరిగే మూడో టీ20లో ఈ రెండు జట్లు తలపడనున్నాయి. సూపర్ ఫామ్‌లో ఉన్న బ్యాటింగ్ లైనప్.. భారత్‌కు మరో విజయం సాధించి పెడుతుందని అభిమానులు ఆశిస్తున్నారు. ఇక సంజు వంతు: కివీస్‌తో టీ20 సిరీస్ సాగే కొద్దీ బ్యాటింగ్‌లో భారత్‌కు బాగా కలిసొస్తోంది. సుదీర్ఘ కాలంగా ఫామ్‌తో తంటాలు పడుతున్న కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ రెండో టీ20లో ఫామ్ అందుకుని 82 పరుగుల అజేయ ఇన్నింగ్స్ ఆడాడు. రెండేళ్లకు పైగా విరామం తర్వాత జట్టులోకి వచ్చిన ఇషాన్ కిషన్ సైతం ఈ మ్యాచ్‌లో చెలరేగాడు. తొలి టీ20లో అభిషేక్ శర్మ అదరగొట్టాడు. హార్దిక్ పాండ్య, రింకు సింగ్, శివమ్ దూబె కూడా తమ బ్యాట్ వాడి చూపించారు. ఇక బ్యాటింగ్ ఆర్డర్లో కొంత ఆందోళన రేకెత్తిస్తున్నది సంజు శాంసన్ ఒక్కడే. శుభ్‌మన్ గిల్‌పై వేటు పడడంతో అభిషేక్‌కు ఓపెనింగ్ భాగస్వామిగా అతనే ఖరారయ్యాడు. కానీ తొలి రెండు టీ20ల్లో అతను 10, 6 పరుగులతో నిరాశపరిచాడు. మూడో టీ20లో అయినా సంజు తనదైన శైలిలో చెలరేగుతాడేమో చూడాలి. కివీస్‌కు కూడా బలమైన బ్యాటింగ్ లైనప్ ఉన్న నేపథ్యంలో మొదట బ్యాటింగ్ చేస్తే వీలైనంత ఎక్కువ స్కోరు చేయాలి. మొదట బౌలింగ్ చేస్తే.. భారీ లక్ష్య ఛేదనకు సిద్ధంగా ఉండాలి. భారత బౌలింగ్ అయితే అంత గొప్పగా సాగట్లేదు. పేసర్లు, స్పిన్నర్లు ధారాళంగా పరుగులిచ్చేస్తున్నారు. రెండో టీ20లో వికెట్ తీయకుండా 53 పరుగులిచ్చిన అర్ష్‌దీప్‌పై ఆదివారం వేటు పడొచ్చు. గత మ్యాచ్‌కు విశ్రాంతి తీసుకున్న బుమ్రా అతడి స్థానంలో ఆడతాడు. హర్షిత్ రాణా తుది జట్టులో కొనసాగే అవకాశముంది. వరుణ్ చక్రవర్తి, కుల్‌దీప్ యాదవ్ స్పిన్ బాధ్యతలు పంచుకుంటారు. హార్దిక్ పాండ్య, శివమ్ దూబె కూడా పేస్ బౌలింగ్‌లో సహాయ పాత్ర పోషిస్తారు. తొలి రెండు టీ20ల్లో కివీస్ ఓడినప్పటికీ.. ఆ జట్టు బ్యాటింగ్ బాగానే సాగింది. డెవాన్ కాన్వే, టిమ్ సీఫర్ట్, రచిన్ రవీంద్ర, గ్లెన్ ఫిలిప్స్, డరిల్ మిచెల్, చాప్‌మన్, శాంట్నర్‌లతో ఆ జట్టుకు లోతైన బ్యాటింగ్ లైనప్ ఉంది. బౌలింగ్‌లో మాత్రం ఆ జట్టు భారత్ కన్నా ఎక్కువ ఇబ్బంది పడుతోంది. పేసర్లు హెన్రీ, డఫీ.. స్పిన్నర్లు శాంట్నర్, ఇష్ సోధిలపై ఆ జట్టు ఎక్కువ ఆశలతో ఉంది. గువాహటి పిచ్ బ్యాటింగ్‌కు బాగానే అనుకూలిస్తుంది. వికెట్ నుంచి పేసర్లకు కొంత సహకారం ఉంటుంది.

